ఆదివారం
13-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 201
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

చత్తీస్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర-చింతూరు: వరుస ఎన్‌కౌంటర్లతో చత్తీస్‌గఢ్ దండకారణ్యం యుద్ధక్షేత్రంగా మారింది. మరోసారి కాల్పులతో దండకారణ్యం దద్దరిల్లింది. మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌ను జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపాయి. పది రోజుల క్రితం

- మిగతా 2 లో

ఈవీఎంలు సురక్షితం: సీఈసీ

రాంఘర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) భద్రతకు ఢోకా లేదని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశం లేదన్నారు. కుమార్ శనివారం జార్ఖండ్, రాంఘర్ జిల్లాలో విలేకరులతో మాట్లాడుతూ ఈవీఎంలు అత్యంత సురక్షితమని చెప్పారు. భారత్‌లో వినియోగించే ఈవీఎంలను ఇంటర్నెట్‌తో, బ్లూటూత్ లేదా ఇన్ఫ్రారెడ్‌తో అనుసంధానం చేసేందుకు వీల్లేదు కాబట్టి

- మిగతా 2 లో

ముర్షిదాబాద్‌లో కేంద్ర బలగాలు

కోల్‌కతా: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారడంతో కోల్‌కతా హైకోర్టు తక్షణ చర్యలకు దిగింది. కేంద్ర బలగాలను మోహరించాలని శనివారం ఆదేశించింది. ముస్లింల అధిపత్యం ఉన్న ముర్షిదాబాద్ జిల్లాలో నిరసనకారులు శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగి రోడ్లను దిగ్బంధించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపై రాళ్లతో దాడులు చేశారు. పోలీసు వాహనాలతో సహా పలు వాహనాలకు నిప్పుపెట్టారు. మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో ఈ నిరసనలు కొనసాగాయి.

మూడు నెలలే గడువు

బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి సుప్రీం

న్యూఢిల్లీ: రాష్ట్ర గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతికి నిర్దిష్ట గడువు విధిస్తూ సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి నిలిపి ఉంచడంపై నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ ఆ బిల్లులకు ఆమోదం తెలిపింది. ఏదైనా బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సి వస్తే గవర్నర్ తీసుకోవాల్సిన అత్యధిక గడువు నెలరోజులు మాత్రమేనని తీర్పు ఇచ్చింది. 415 పేజీలతో కూడిన పూర్తి తీర్పును శుక్రవారం రాత్రి 10.54 గంటలకు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచారు. కాగా, గవర్నర్లు పంపే బిల్లుపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం తాజాగా తీర్పునిచ్చింది. ఏదైనా జాప్యం జరిగితే రాష్ట్రపతి భవన్ అందుకు కారణాలను రాష్ట్రాలకు వివరించాలని,

- మిగతా 2 లో

చరిత్రలో తొలిసారి... 10 బిల్లులు ఆమోదం 2 లో

బీజేపీ... పెద్ద ప్రమాదకారి

- మతోన్మాద రాజకీయాలకు కుట్ర
- రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు కంకణం
- మావోయిస్టులతో శాంతి చర్చలకు సిద్ధం కావాలి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బాధ్యత కేంద్రానిదే
- తెలంగాణకు తక్షణం నిధులు విడుదల చేయాలి: కూనంనేని

విశాలాంధ్ర–హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... పాలనను గాలికి వదిలి మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ముగ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మాట్లాడారు. కేంద్రం... రాష్ట్రాల మధ్య వైషమ్యాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దేశానికే బీజేపీ ప్రమాదకరంగా మారిందని మండిపడ్డారు. ప్రజలంతా ఏకమై ఆ పార్టీకి బుద్ధి చెప్పాల్సిన సమయం అసన్నమైందన్నారు. వేల సంవత్సరాలుగా ఉన్న విభిన్న సంప్రదాయాలు, సంస్కృతుల మధ్య చిచ్చు పెడుతూ మతాన్ని రెచ్చగొట్టి ఓట్ల ద్వారా గద్దెనెక్కుతోందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వక్ఫ్ చట్టాన్ని సవరించడం సరైంది కాదన్నారు. వక్ఫ్ భూములలో అక్రమాలు చోటుచేసుకుంటే ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారమే వాటిని సరిదిద్దవచ్చన్నారు. చట్ట సవరణ పేరుతో వక్ఫ్ బోర్డులో ఇతర సామాజికవర్గాల వారిని సభ్యులు చేర్చడం వెనక కుట్ర దాగుందని అనుమానం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని కూనంనేని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపునకు సుప్రీంకోర్టు అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో రాజ్యాంగ సవరణ చేసి ప్రత్యేక చట్టం తీసుకువచ్చి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తీసుకువచ్చారని, దీనికి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రమేనని స్పష్టం చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ ... సిద్ధంగా లేనట్లుగా కేంద్రం వ్యవహరిస్తోందని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలకు మనుషులను చంపే అధికారం లేదని, తప్పుచేస్తే చట్ట ప్రకారం మాత్రమే శిక్షించాలని అన్నారు. కేంద్ర బలగాల ద్వారా మావోయిస్టులను వెంటాడి చంపడం సరైందికాదన్నారు. మావోస్టులతో చర్చలకు తగిన వాతావరణ కల్పించాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అయితే... అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. త్రిభాషా సిద్ధాంతంతో ఘర్షణలు సృష్టించి ఎప్పటికీ తామే అధికారంలో ఉండేలా బీజేపీ కుట్ర పన్నుతోందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలు భారతదేశంలో భాగం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయి కోలుకోలేని పరిస్థితిలో ఉందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇచ్చి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. చట్టబద్ధంగా రావాల్సిన నిధులను విడుదల చేయించేందుకు బీజేపీ రాష్ట్ర నేతలు కూడా సహకరించాలని కోరారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి గత బీఆర్ఎస్ సర్కారే కారణమని అన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసే ఆలోచన సీపీఐకి లేదని కూనంనేని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై కవిత... బీజేపీపై యుద్ధం చేయాలని సూచించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములపై ప్రభుత్వం చర్చలు జరపడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. హెచ్‌సీయూ భూముల విక్రయం వ్యవహారంలో బీజేపీ ఎంపీ ఎవరు ఉన్నారో మాజీ మంత్రి

- మిగతా 2 లో

ఐసీఐసీఐ రుణం తీసుకోలేదు

- హెచ్‌సీయూ భూములపై బీఆర్ఎస్ రాద్ధాంతం
- ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు తీర్పు: మంత్రి దుద్దిళ్ల

విశాలాంధ్ర - హైదరాబాద్: హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టులో ఏవిధమైన వ్యాజ్యాలు లేవని, తమకు ఐసీఐసీఐ బ్యాంక్ ఎటువంటి రుణం తీసుకోలేదని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వం రూ.5,200 కోట్ల భూమిని రూ.30 వేల కోట్లకు చూపించారని కేటీఆర్ అంటుండు సరే ... సీబీఐ (సెక్యూరిటీ బ్యూరో ఆఫ్ ఇండియా) అనే రియల్ ఎస్టేట్ సంస్థ చేసిన సర్వే ప్రకారం రూ.23 వేల కోట్ల విలువ వచ్చిందని, దాన్ని సెబీ, ఆర్‌బీఐ కూడా నిర్ధారణ చేసిందని పేర్కొన్నారు. టీజీఐఐసీ మార్కెట్ ఫోర్ సెస్ ద్వారా 37 అంతర్జాతీయ సంస్థల నుంచి

- మిగతా 2 లో

ఉగ్రదాడుల ముప్పు

నిఘా సంస్థల హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరించాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగొచ్చని తెలిపాయి. ఈ మేరకు రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో దాడులు జరగవచ్చని వెల్లడించాయి. నదీమార్గాల్లో తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. ముంబై ఉగ్రదాడి కీలక కుట్రదారు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ వచ్చింది. 2008 నవంబర్ 26న 10 మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబైకి చేరుకొని... సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అధిపతి హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్,

- మిగతా 2 లో

అణు ఒప్పందంపై ఇరాన్, అమెరికా చర్చలు

అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు సిద్ధమని అమెరికా చెబుతుండటంతో ఆ దిశగా అడుగులు వేసేందుకు ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ సానుకూలత వ్యక్తం చేశారు.

2లో

ఇదీ లోకం!

సంపద సృష్టించడానికేగా మనం స్టీలుప్లాంటు అమ్మించేస్తున్నాం, ఆ తర్వాత పోర్టులు, మెడికల్ కాలేజీలు, భూములూ రెడీగా ఉన్నాయి.

మంతెనవారిపాలెం పాఠశాల

మంతెనవారిపాలెంలో రెండవ రాజకీయ పాఠశాల 1938 లో జరిగింది. కొత్తపట్నం రాజకీయ పాఠశాలను నిషేధించిన సందర్భంలో 63 మందిని అరెస్టు చేశారు. ఇలా అరెస్టు అయిన వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన బస్వారెడ్డి శంకరయ్య, పూసపాటి నరసింహరాజు, రావి ఆదిశేషయ్య, బీరం రామనాథం మొదలైన వారు ఉన్నారు. వీరంతా మంతెనవారి పాలెం రాజకీయ పాఠశాలకు కూడా హాజరయ్యారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

'నేషనల్ హెరాల్డ్' కేసులో

ఆస్తుల స్వాధీనం

సోనియా, రాహుల్‌కు ఈడీ షాక్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తు క్రమంలో జప్తు చేసిన రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా నోటీసులు జారీ చేసినట్లు 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) ప్రకటించింది. ఢిల్లీ, ముంబై, లక్నోలోని ఆస్తులపై నోటీసులు అతికించినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. సంబంధిత ఆస్తులను ఖాళీ చేయాలని లేదా వాటికి వచ్చే అద్దెలు బదిలీ చేయాలని నోటీసులో పేర్కొంది. పీఎంఎల్ఏ చట్టం కింద ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడిం చింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్) ప్రచురణకర్తగా ఉంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ సహా కొందరు పార్టీ నేతలు ప్రమోటర్లుగా ఉన్న 'యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్' దానికి యాజమాన్య సంస్థ. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడ్డ రూ.90 కోట్లు వసూలు చేసుకునే విషయంలో 'యంగ్ ఇండియన్'లో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా 2023 నవంబరులో సంబంధిత స్థిరాస్తులతోపాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో ఉన్న 'యంగ్ ఇండియన్'కు చెందిన రూ.90.21 కోట్లు జప్తు చేసింది.
ఈ కేసులో సోనియా, రాహుల్ గాంధీతోపాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌ను ఈడీ ఇప్పటికే విచారించింది. వారి వాంగ్మూలాలు రికార్డు చేసింది. తాజాగా సంబంధిత స్థిరాస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసింది.

వనజీవి రామయ్య కన్నుమూత

మోదీ సహా ప్రముఖుల సంతాపం

అధికార లాంఛనాలతో నేడు అంత్యక్రియలు



విశాలాంధ్ర బ్యూరో–ఖమ్మం: వృక్షో రక్షితి రక్షితః అనే సూక్తిని నిజాక్షరాలుగా భావించి కోటి మొక్కలు నాటిన వనజీవి రామయ్య గుండెపోటుతో మరణించారు. ఆయన హరిత విప్లవ యోధుడు. తన మనవరాళ్లకు సైతం చెట్ల పేరు పెట్టిన ప్రకృతి ప్రేమికుడు. 45 ఏళ్లుగా మొక్కలు నాటడమే జీవిత ఆశయంగా పనిచేశారు. భార్య జానకమ్మ కూడా మొక్కలు నాటడంలో ఆయనకు తోడుగా నిలిచారు. 1995లోనే వనజీవి సేవలు గుర్తించిన భారత ప్రభుత్వం వనసేవ అవార్డుతో సత్కరించింది. ఆ తర్వాత గౌరవ డాక్టరేట్‌తో పాటు అనేక రివార్డులు, అవార్డులు పొందిన రామయ్య... 2017లో అత్యున్నత పౌరపురస్కారం పద్మశ్రీ అందుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన రామయ్య శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు సహా మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంతాపం ప్రకటించారు. జాతీయస్థాయి పర్యావరణ ప్రేమికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా వనజీవి రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళి అర్పించగా... డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, మాజీ

- మిగతా 2 లో

85 వేల చైనా వీసాలు

భారత స్నేహితులకు స్వాగతమని పోస్ట్

న్యూఢిల్లీ: సరిహద్దు విషయంలో భారత్-చైనా మధ్య నిరంతరం ఉద్రిక్త వాతావరణం ఉంటుంది. అయితే ఇటీవల ఆ వైఖరిలో మార్పు వస్తున్నట్లు స్పష్టమవుతోంది. భారత్‌వైపు చైనా స్నేహహస్తం చాస్తోంది. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా... ముఖ్యంగా తమ దేశంలో భారతపౌరుల ప్రయాణాన్ని సులభతరం చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. దానిలో భాగంగా ఏప్రిల్ 9 వరకు 85 వేల వీసాలు జారీ చేసింది. ఈ మేరకు మనదేశంలోని చైనా రాయబారి జు ఫీహాంగ్ వెల్లడించారు. 'భారత్‌లోని చైనా ఎంబసీ, కాన్సులేట్లు ఈ ఏడాది ఏప్రిల్ 9 వరకు భారతీయులకు 85 వేలకుపైగా వీసాలు జారీ చేశాయి. చైనాను సందర్శించడానికి మరింతమంది భారత స్నేహితులకు స్వాగతం. సురక్షిత, స్నేహపూర్వక, స్ఫూర్తివంతమైన చైనాను అన్వేషించండి' అని ఫీహాంగ్ ఎక్స్ వేదికగా శనివారం పోస్టు పెట్టారు. మార్చిలోనూ ఆయన ఈ తరహా పోస్టు చేశారు. అప్పటికే 50 వేల వీసాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వీసా ధరలపై తగ్గింపును చైనా మరో ఏడాది పొడిగించిన సంగతి తెలిసిందే. 2025 డిసెంబరు 31 వరకు వీసా ఫీజుల తగ్గింపు కొనసాగుతుందని వెల్లడించింది. చైనాను సందర్శించే విదేశీయుల ప్రయాణ విధానాలను క్రమబద్ధీకరించడం కోసం ఈ చర్యలు చేపట్టామని దౌత్య కార్యాలయం అప్పట్లో వెల్లడించింది. గతేడాది ఈ వీసా ధరలు తగ్గించారు. అప్పటినుంచి సింగిల్ ఎంట్రీ వీసాలకు రూ.2,900, డబుల్ ఎంట్రీ వీసాలకు రూ.4,400 వసూలు చేస్తున్నారు.
ఆరు నెలల గడువు ఉండే మల్టిపుల్ ఎంట్రీ వీసాకు రూ.5900, సంవత్సరం, అంతకంటే పైబడి గడువు ఉండే మల్టీ ఎంట్రీ వీసా రూ.8,800 చెల్లించాల్సి ఉంటుంది. గత అక్టోబర్ నుంచి చైనా నుంచి

- మిగతా 2 లో

రెండంచెల విధానమే మేలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన

రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలన్న రామకృష్ణ

8 లో

విశాలాంధ్ర

ప్రపంచం

2

హైదరాబాద్

ఆదివారం

13 ఏప్రిల్ 2025

అణు ఒప్పందంపై ఇరాన్, అమెరికా చర్చలు

టెహ్రాన్: అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు సిద్ధమని అమెరికా చెబుతుండటంతో ఆ దిశగా అడుగులు వేసేందుకు ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ సానుకూలత వ్యక్తం చేశారు. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేఖ నేపథ్యంలో అణు ఒప్పందంపై పరోక్ష చర్చలకు కసరత్తు మొదలైంది. ఒమన్‌లో శనివారం రెండు దేశాల ప్రతినిధులు భేటీ అయ్యారు. దీంతో అణు కార్యక్రమంపై అమెరికాతో ఒప్పందానికి ఇరాన్ ఎదురుచూస్తోందని ఖమేనీ సన్నిహితుడు అలీ షమానీ ఇంతకుముందు చెప్పడానికి ప్రాధాన్యత ఏర్పడింది. నిజమైన, న్యాయమైన ఒప్పందాన్ని ఇరాన్ కోరుకుంటోందని, వాషింగ్టన్ అసంబద్ధ డిమాండ్లు చేయకుండా... సమస్యలు సృష్టించకుండా ఉంటే ఒప్పందం కుదురుతుందని షమానీ చెప్పారు. ఆయన చెప్పినట్లుగా ఇరాన్ తరపున ఈ చర్చలకు విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి వెళ్లారు. అమెరికా తరపున ఆ దేశ ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ హాజరయ్యారు. అయితే ప్రత్యక్ష చర్చల కోసం అమెరికా పట్టుబడుతుంటే ఇరాన్ ససేమిరా అంటోంది. పరోక్ష చర్చలకే మొగ్గు చూపింది. ఇరాన్‌తో గతంలో చేసుకున్న అణు ఒప్పందాన్ని 2018లో ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే.

చైనాలో పెను గాలులు... నిలిచిన 693 విమానాలు

బీజింగ్: చైనాలో పెను గాలులు బీభత్సం సృష్టించాయి. రాజధాని బీజింగ్‌లో చెట్లు నేలకొరిగాయి. దీంతో అప్రమత్తమైన జిన్‌పింగ్ ప్రభుత్వం 693 విమాన సర్వీసులను రద్దు చేసింది. బీజింగ్, డాక్సింగ్‌లో వందల విమాన, రైలు సేవలు నిలిచిపోయాయి. పార్కులను తాత్కాలికంగా మూసేశారు. 75 ఏళ్లలో లేని విధంగా భీకర గాలులు వీచినట్లు స్థానిక వార్తా సంస్థలు వెల్లడించాయి. ఉత్తర, తీర ప్రాంతాల్లో వాతావరణం ప్రమాదకరంగా మారినట్లు నిపుణులు హెచ్చరించారు. ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, ఇతర ముఖ్య కార్యక్రమాలకూ ఆటంకం కలిగింది. ఎవరూ గడప దాటొద్దని చైనా ప్రజలకు అధికారులు సూచనలు చేశారు.

ఇండో-అమెరికన్ నేతపై జూదం కేసు

న్యూయార్క్: ఇండో-అమెరికన్ నాయకుడిపై గ్యాంబ్లింగ్ కేసు నమోదైంది. న్యూజెర్సీ అటార్నీ జనరల్ మాథ్యూ ప్లాట్కిన్ ఈ మేరకు వెల్లడించారు. జూదం, అక్రమ కార్యకలాపాల్లో మున్సిపల్ కౌన్సిలర్ ఆనంద్ షాకు ప్రమేయం ఉందని తెలిపారు. గ్యాంబ్లింగ్, మనీలాండరింగ్ ఇతర నేరాలకు పాల్పడిన 39 మందిలో ఆనంద్ ఒకరన్నారు. రాష్ట్రంలోని 12 ప్రదేశాల్లో తనిఖీలు జరిపినట్లు వెల్లడించారు. న్యూయార్క్ శివార్లలోని ప్రాస్పెక్ట్ పార్కు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఆనంద్‌షా రెండోసారి బాధ్యతలు చేపట్టారు.

చరిత్రలో తొలిసారి...

10 బిల్లులు ఆమోదం

చెన్నై: పెండింగ్ బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన వేళ... తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిఫై చేసింది. ఈ మేరకు శనివారం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవికి పంపగా... ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లులకు సమ్మతి తెలపకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని తెలిపింది. రెండోసారి ఆమోదించిన బిల్లుల విషయంలోను ఆయన తీరు మారలేదని పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంపై ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను గవర్నర్ ఆర్.ఎన్.రవి తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని స్పష్టంచేసింది.

వనజీవి రామయ్య కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ రావు, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు భాగం హేమంతరావు, బీజేపీ, కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీల ప్రముఖులు, అధికారులు వనజీవి భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆయనకు నివాళులర్పించారు. కాగా రామయ్య అంత్యక్రియలను ఆదివారం తన స్వగ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని నిర్ణయించారు.

లాలయ్య, పుల్లమ్మ దంపతులకు వనజీవి రామయ్య 1937లో జన్మించారు. సాధారణ కుటుంబంలో జన్మించిన దరిపల్లి రామయ్య 15 ఏళ్లకే తుమ్మలపల్లి గ్రామానికి చెందిన జానకమ్మను వివాహం చేసుకున్నారు. 45 సంవత్సరాలుగా విరామం లేకుండా విత్తనాలు సేకరించడం, ఖాళీ స్థలాల్లో రోడ్ల వెంట మొక్కలు నాటడమే పనిగా పెట్టుకున్నారు. రామయ్య ఆశయాలకు అనుగుణంగానే భార్య జానకమ్మ తోడుగా నిలిచారు. రామయ్య, జానకమ్మ దంపతులకు నలుగురు సంతానం. అందులో ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. లక్షలాదిగా మొక్కలు నాటుతున్న రామయ్యను వనజీవి రామయ్యగా ప్రజలు, ప్రభుత్వాలు గుర్తించాయి. ఆయన ఇంటి పేరు వనజీవిగా మారిపోయింది.

వనజీవి సైకిల్ కూడా అభివృద్ధి శకటమే

ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్స వం, గణతంత్ర దినోత్సవాల సందర్భాల్లో పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ పథకాల నమూనాతో శకటాల ప్రదర్శన జరుగుతుంది. ఆ శకటాల ప్రదర్శనలో వనజీవి రామయ్య రేకుపై వృక్షో రక్షితి రక్షితః అంటూ రాసిన గుండ్రటి రేకునే కంఠాభరణంగా ధరించి సైకిల్‌పై వచ్చేవారు. వనజీవి సైకిల్ కూడా ఆకర్షణీయమైన ఒక శకటమే. వృక్షో రక్షితి రక్షితః అని రాసిన సైకిల్‌ను శకటంగా గుర్తించి... ప్రశంసా పత్రాలు అందజేశారు. వనజీవి రామయ్య ప్రయాణం ఖమ్మం నుంచి మొదలై పర్యావరణ ప్రేమికుల మన్ననలు పొందుతూ ఢిల్లీ చేరింది. జాతీయస్థాయిలో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండగా రామయ్యకు సైకిల్‌కు బదులు టీవీఎస్ అందజేయటమే కాకుండా ఆయనకు నెలకు 1500 రూపాయలు గౌరవ వేతనం ఇచ్చారు. మహారాష్ట్రతో పాటు తెలంగాణ ప్రభుత్వాలు వనజీవి జీవిత చరిత్రను పాఠ్యాంశాలుగా ముద్రించడం గొప్ప విశేషం.

ఈవీఎంలు సురక్షితం: సీఈసీ

(మొదటిపేజీ తరువాయి)

వాటి ట్యాంపరింగ్ అసాధ్యమని తెలిపారు. ఈవీఎంలపై న్యాయ సమీక్ష జరిగిందని గుర్తుచేశారు. మూడు రోజుల జార్ఖండ్ పర్యటనకు వచ్చిన సీఈసీ... రాంఘర్‌లో 55 మంది వలంటీర్ల (లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న)ను కలిశారు.

బీజేపీ... పెద్ద ప్రమాదకారి

(మొదటిపేజీ తరువాయి)

కేటీఆర్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో సింగరేణి సంస్థల్లో యూనియన్లు లేకుండా చేయాలని ప్రయత్నం చేశారన్నారు. ఆర్టీసీ, సింగరేణి, జెన్‌కో సంస్థల్లో కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వారంతా సమ్మెలు చేయకుండా ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరపాలని, ఆ సంస్థలను కాపాడుకోవాలన్నారు. ఉస్మానియా వర్సిటీలో నిషేధాజ్ఞలను ఎత్తివేయాలని కోరారు. కాంగ్రెస్‌తో స్నేహ బంధం కొనసాగిస్తూనే ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పంటలను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు జాతీయ మార్కెట్ విధానాన్ని కేంద్రం తీసుకువస్తోందని, ఇది రైతులను విచ్ఛిన్నం చేసే కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అని, ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కూనంనేని పిలుపునిచ్చారు.

ఐసీఐసీఐ రుణం తీసుకోలేదు

(మొదటిపేజీ తరువాయి)

మ్యూచువల్ పెట్టుబడుల బాండ్ల ద్వారా ప్రభుత్వం నిధులు సేకరించిందని, సంక్షేమ పథకాల కోసం తక్కువ వడ్డీతో నిధులు సేకరించామని తెలిపారు. డివేంచర్ ట్రస్టీ ... హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానివేనని స్పష్టంగా చెప్పిందన్నారు. డిసెంబర్ ఐదు, 2024న 9.35 శాతం వడ్డీతో రూ.995 కోట్లు బాండ్ల ద్వారా ప్రభుత్వం నిధులను సేకరించిందని, అలాగే సెబీలో రిజిస్టర్ అయిన మర్చంట్ బ్యాంకర్ను టీజీఐఐసీ నియమించుకుందని వివరించారు. ఈ ట్రస్ట్ ఇన్వెస్ట్ ఇండస్ట్రీ సంస్థ ఇతర రాష్ట్రాలకు కూడా నిధులు సమకూర్చిందని మంత్రి గుర్తు చేశారు. రైతుల సంక్షేమం, రైతు భరోసా, రైతు రుణమాఫీకి ఆ నిధులను ఉపయోగించామని తెలిపారు. గతంలో ఆర్ఈసీ, పీఎఫ్‌సీ, బీటీబీ నుంచి 10.09శాతం రేటుతో బీఆర్ఎస్ తీసుకుందని, అయితే గతంతో పోల్చితే తాము తక్కువ వడ్డీకే తీసుకున్నామని వివరించారు. రూ.8,476 కోట్లు ప్రభుత్వం టీజీఐఐసీ ద్వారా తీసుకుందని, వాటిలో రూ.2,146 కోట్లు రుణమాఫీకి, రూ.5,463కోట్లు రైతు భరోసాకు, రూ.947కోట్లు సన్నబియ్యంకు వినియోగించినట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో ఆ 400 ఎకరాలను అభివృద్ధి చేస్తా అంటే దాన్ని బీఆర్ఎస్ అడ్డుకుంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఆ పార్టీ నేతలు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ కార్యక్రమాలను అడుగడుగున అడ్డుకుంటూ అభివృద్ధి అవరోధులుగా మారారని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానివని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అందరికీ తెలుసని, అయినా బీఆర్ఎస్ కావాలనే రాద్ధాంతం చేస్తుందన్నారు. తొమ్మిదేళ్ల క్రితం రాజస్థాన్‌లో చనిపోయిన జింక పిల్లను హెచ్‌సీయూలో చనిపోయినట్లు చూపించారంటే వాళ్ల దుర్నీతి ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. ఏనుగులు సంచరిస్తున్నట్లు ఏఐ ద్వారా సృష్టించారని ధ్వజమెత్తారు. సోషల్ మీడియాను ఉపయోగించుకొని కుట్రలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సబర్మతి పరివాహక ప్రాంత వాసులకు మేలు జరగాలని అక్కడి బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తే స్వాగతించిన బీజేపీ నాయకుకుల... అదే అభివృద్ధి మూసీలో చేస్తామంటే వద్దు అంటున్నారని విమర్శించారు. దురుద్దేశాలతో అభివృద్ధికి కులాన్ని అపాదించవద్దని సూచించారు. మీడియా ప్రతినిధులను సబర్మతికి తీసుకుని వెళ్లాలని ఆకాడమీ చైర్మన్‌కు సూచించారు. మూసీ అభివృద్ధిలో మీడియా సలహాలు, సూచనలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళలకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు

ప్రతి నియోజకవర్గంలో మహిళల కోసం ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడిరచారు. హైటెక్స్‌లో జూన్ 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న "ఫుడ్ ఏ ఫెయిర్" రెండో ఎడిషన్ బ్రోచర్‌ను శనివారం ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, హైటెక్స్ ఎగ్జిబిషన్స్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆహార ఉత్పత్తిదారులు, ఆహార శుద్ధి నిపుణులు, ప్యాకేజింగ్ ఇండస్ట్రీ నిపుణులు, చెఫ్స్ ... ఈ ప్రదర్శనలో వివిధ అంశాలపై మేథోపర చర్చలు చేస్తారన్నారు. వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల రంగంలోనూ తెలంగాణను దేశంలోనే మొదటి స్థానంలో నిలపడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఇప్పటికే రూ.16వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో 7,150 ఎకరాల్లో 14 స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు ఉన్నాయని, రాబోయే రోజుల్లో టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 6,800కు పైగా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఉన్నాయని, కొత్తగా ఏర్పాటు చేసే ఔత్సాహికులకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల శాఖ కమిషనర్ మల్సూర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, "ఫుడ్ ఏ ఫెయిర్" నిర్వాహకులు శ్రీకాంత్, టీజీ శ్రీకాంత్, విశాల రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లపై సుంకాల్లేవ్

వాషింగ్టన్: ప్రతీకార సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను ట్రంప్ ప్రభుత్వం మినహాయింపు ప్రకటించింది. ఈ మేరకు కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ మార్గదర్శకాలను తాజాగా జారీ చేసింది. ఈ నిర్ణయంతో యాపిల్, శాంసంగ్ వంటి బడా కంపెనీలకు, అమెరికా వినియోగదారులకూ ఊరట లభించనట్లయింది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, హార్డ్ డ్రైవ్‌లు, కంప్యూటర్ ప్రాసెసర్లు, మెమొరీ చిప్‌లు, సెమీ కండక్టర్లు, సోలార్ సెల్స్, ఫ్లాట్ టీవీ డిస్‌ప్లేలు వంటి వాటిని ప్రతీకార సుంకాల నుంచి మినహాయించారు. చైనాపై విధించిన 145 శాతం సుంకం కూడా వీటికి వర్తించదు. వాస్తవానికి ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు పొందాలంటే ఆయా ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలి. కాగా ప్రతీకార సుంకాలతో అత్యధికంగా నష్టపోయిన కంపెనీ యాపిల్‌కు ఈ నిర్ణయం ఊరటనిచ్చింది.

మూడు నెలలే గడువు

(మొదటిపేజీ తరువాయి)

నిర్దేశిత గడువులోగా రాష్ట్రపతి నుంచి స్పందన లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు మాండమస్ రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజ్యాంగంలోని 200వ అధికారణ ప్రకారం మంత్రిమండలి సలహా, సూచనల మేరకు గవర్నర్లు తప్పనిసరిగా వ్యవహరించాల్సి ఉంటుందని, రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వ్ చేసే అధికారం గవర్నర్లకు లేదని మార్చి 8న ఇచ్చిన తీర్పులో సుప్రీం ధర్మాసనం తెలిపింది. నిర్దిష్ట గడువులోగా చర్య తీసుకోకుంటే గవర్నర్ జ్యుడిషియల్ స్క్రూటినీ ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

ఉగ్రదాడుల ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

ముంబై అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్ అమరులయ్యారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబై దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.

అన్ని రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

దేశవ్యాప్తంగా ఉగ్రదాడులు జరగవచ్చనే నిఘా సంస్థల హెచ్చరికల నేపథ్యంతో కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. సముద్ర తీర ప్రాంత పట్టణాలు మరింత అప్రమత్తంగా ఉండాలని, గస్తీ పెంచుకోవాలని సూచించింది. సముద్ర మార్గం గుండా వచ్చిన ఉగ్రవాదులు 2008 ముంబై 26/11 మారహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో కీలక సూత్రధారి, లష్కరే ఉగ్రవాది తహవ్వుర్ రాణా విచారణ కొనసాగుతున్న వేళ ఉగ్రముప్పు హెచ్చరికలు వచ్చాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగవచ్చని నిఘా సంస్థలు కేంద్ర హోం శాఖకు నివేదిక సమర్పించాయి. దీంతో హోంశాఖ అన్ని రాష్ట్రాలకు హెచ్చరికలు పంపింది. ఉగ్రవాదులు డ్రోన్లు, ఐఈడీలతో దాడులు చేసే అవకాశం ఉందని, ప్రత్యేకించి సముద్ర తీర ప్రాంతాలపై ఎక్కువ నిఘా ఉంచాలని సూచించింది.

చత్తీస్‌గఢ్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

బీజాపూర్, దంతెవాడ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యురాలు రేణుక అలియాస్ భాను హతయ్యారు. ఆమె తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి. గత ఏడాది జనవరిలో మొదలైన ఆపరేషన్ కగార్ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 400లకు పైగా మావోయిస్టులు హతమైనట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించింది. దేశంలో మావోయిస్టులను కూకటి వేళ్లతో పెకిలించి వేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించిన నేపథ్యంలో ఆపరేషన్ కగార్ దూకుడుగా కొనసాగుతోంది. చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో అబూజ్‌మడ్ మావోయిస్టులకు కంచుకోటగా ఉంది. అబూజ్‌మడ్ లక్ష్యంగా వేలాది మంది భద్రతాబలగాలు నలుదిక్కులుగా చుట్టుముట్టి మావోయిస్టుల ఏరివేత చర్యలు చేపడుతున్నాయి. అణచివేత పెరగడంతో ఇటీవల మావోయిస్టులు కూడా పెద్ద ఎత్తున లొంగిపోతున్నారు. లొంగిపోతున్న వారు ఇచ్చిన సమాచారంతో వరుస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి.

85 వేల చైనా వీసాలు

(మొదటిపేజీ తరువాయి)

సానుకూల వైఖరి కనిపిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలను తగ్గించుకోవడం కోసం భారత్, చైనా ఆ నెలలోనే కీలక గస్తీ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. దీని ప్రకారం 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి కొనసాగనుంది. రెండు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల భారత ఆర్థిక వృద్ధి అమోఘం అంటూ చైనా కాన్సుల్ జనరల్ జువీ కొనియాడిన సంగతి తెలిసిందే.

హిందీ చినీ భాయ్ భాయ్' అంటూ భారత్ సాధించిన విజయాలను ప్రస్తావించారు. అమెరికా ప్రతీకార సుంకాల వేళ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌కు స్నేహహస్తం అందించారు. భారత్‌తో కలిసి ఉమ్మడి భవిష్యత్తు లక్ష్యంగా పనిచేసే సమాజాన్ని నిర్మించాలని ఆశిస్తున్నట్టు చెప్పారు.

నిరసనాగ్రహం

వక్ఫ్ సవరణ చట్టం ఉపసంహరించాల్సిందే

ఇది ముస్లింల అంశం కాదు... రాజ్యాంగంపై దాడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మోదీ సర్కారు తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం దేశానికి అత్యంత ప్రమాదకరమని, దీనిని తక్షణం ఉపసంహరించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా గుంటూరు, విజయవాడ నగరాల్లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ప్రాంతీయ పార్టీలు కనుమరుగయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీనిపై బీజేపీ పాలకులు దృష్టి పెట్టారని తెలిపారు. అన్ని రాజ్యాంగ వ్యవస్థలపై ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారని చెప్పారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై చంద్రబాబునాయుడు మూడు సూచనలు చేశానని చెబుతున్నారని, లౌకికవాదినని చెప్పుకునే ఆయన ఆ మూడు సూచనలు ఏమిటో స్పష్టంగా తెలుగు ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజలకు మూడు నామాలు పెట్టిన చంద్రబాబు బోగస్ మాటలు ఆపాలని సూచించారు. అన్ని అంశాలలో మోదీకి మద్దతిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. దేశంలో లౌకిక వ్యవస్థపై చేస్తున్న దాడిలో ఎవరూ మిగిలే పరిస్థితిలేదని, ప్రస్తుతానికి పవన్ కల్యాణ్ మిగలవచ్చని, ఎందుకంటే ఆయన ఇప్పటికే అనేక రంగులు మార్చారన్నారు. చేగువేరా నుంచి సావర్కర్ వరకు ఉసరవెల్లిలా పవన్ రంగులు మారుస్తున్నారు. తాత్కాలికంగా మోదీ, అమిత్‌షాను భుజాలకెత్తుకొని పొంగిపోతున్నారని విమర్శించారు. బీజేపీకి మద్దతు తెలుపుతున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా మారాలని, లేనిపక్షంలో రాష్ట్రం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం తీసుకురావడం ద్వారా బీజేపీ పాలకులు దేశంలో చిచ్చుపెట్టారని మండిపడ్డారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, దేశవ్యాప్తంగా మైనార్టీలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టే పరిస్థితి వచ్చిందన్నారు. దీనిని కేవలం మైనార్టీలకు చెందిన అంశంగా మాత్రమే చూడరాదని, ఇది రాజ్యాంగంపై పాలకులు చేస్తున్న దాడిగా పరిగణించాలన్నారు. ఆర్ఎస్ఎస్ సొంతపత్రికలో ఇటీవల క్రైస్తవ ఆస్తులపై పెద్ద వ్యాసం వచ్చిందని, దేశవ్యాప్తంగా క్రైస్తవుల ఆస్తులపైనా బీజేపీ పాలకుల దృష్టిపడిందన్నారు. వారి ఆస్తులు సైతం స్వాధీనం చేసుకుని... ఆధిపత్యం చెలాయించే అవకాశం ఉందని, ముస్లింల ఆస్తులతోపాటు క్రైస్తవుల ఆస్తులను కూడా కబ్జా చేస్తారని హెచ్చరించారు. ఆ తరువాత హిందువులను సైతం గుప్పెట్లో పెట్టుకొని... మత సంస్థలపై గుత్తాధిపత్యం చెలాయించడానికి ఎన్డీఏ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని, ఈ మూడు పార్టీల నాయకులు ప్రధాని మోదీ అంటే భయపడుతున్నారని అన్నారు. లోక్‌సభలో బిల్లును వైసీపీ వ్యతిరేకించిందని సంతోషించామని, కానీ అదే సవరణ బిల్లు రాజ్యసభలోకి వస్తే వైసీపీ చేతులు ఎత్తేసిందన్నారు. ప్రజ్యాసామ్యవాదులు, లౌకికవాదులు, మైనార్టీలందరూ కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెస్ పార్టీల తరపున నిలబడి రాబోవు రోజుల్లో ఈ దేశాన్ని కాపాడుకునేందుకు ఇండియా ఐక్యసంఘటనకు మద్దతు పలకాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలతో కేంద్రం దిగిరాకపోతే... ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ఇన్సాఫ్ నాయకులు ఎస్‌కే అఫ్సర్, నగర నాయకులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, రమణ బాబు, సింగ రాజు సాంబశివరావు, పైడి కత్తుల రాము, బోరా రామకృష్ణ, ముగేషన్ రాము, సిద్ధిక్, తిప్పబతుల వెంకటేశ్వరరావు, డి.రమణమ్మ, గుడెల జనార్దన్, భాషా తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుంటూరులో భారీ నిరసన

రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని గుంటూరులో జరిగిన నిరసనలో నారాయణ విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ అధ్వర్యంలో గుంటూరులో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. మల్లయ్యలింగంభవన్ నుంచి పాతబస్టాండ్ మీదుగా మాయాబజార్ వరకు ఈ ప్రదర్శన సాగింది. అనంతరం అక్కడ బిల్లు కాపీలు దహనం చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా ప్రదర్శనకారులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. నారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, ఇస్టా జాతీయ కార్యదర్శి షేక్ గని, సీపీఐ నాయకులు షేక్ వలి, ముస్లిం సంఘాల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం దుర్మార్గం: జేవీఎస్ మూర్తి

ప్రజాస్వామ్య హక్కులకు పాతరేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెజారిటీ ఉందన్న మదంతో ఈ బిల్లు తీసుకురావడం దుర్మార్గమన్నారు. హిందూ ధార్మిక సంస్థల్లో అన్యమతస్తులను తొలగిస్తున్న నేపథ్యంలో వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు అనేక సవరణలు ప్రతిపాదించినా పట్టించుకోలేదన్నారు. బోర్డులో ముస్లిమేతరులను సభ్యులుగా వేయడం సరైన పద్ధతి కాదన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బాలికలదే హవా

- ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల
- ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లో కృష్ణాయే ఫస్ట్
- ఏఎస్ఆర్, చిత్తూరు జిల్లాలు లాస్ట్
- మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు
- పదేళ్లలో ఇదే అత్యధిక ఉత్తీర్ణతా శాతం: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఇంటర్‌మీడియట్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఇంటర్ ఫస్టియర్‌లో 70 శాతం, సెకండ్ ఇయర్‌లో 83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ప్రథమ ఇంటర్‌లో 4,87,295 మంది, ద్వితీయ ఇంటర్‌లో 4,22,030 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మార్చి19 వరకు ఫస్టియర్ పరీక్షలు జరగగా, మార్చి 20 వరకు సెకండియర్ పరీక్షలు నిర్వహించారు. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ వేగవంతంగా పూర్తికావడంతో శనివారం ఫలితాలు వెల్లడించారు. ప్రథమ, ద్వితీయ ఇంటర్‌లోనూ బాలికలే పైచేయి సాధించారు. ప్రథమ ఇంటర్‌లో బాలికలు 75 శాతం, బాలురు 66 శాతం, ద్వితీయ ఇంటర్‌లో బాలికలు 86 శాతం, బాలురు 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాల్లో మొదటిస్థానంలో కృష్ణా జిల్లా నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలు నిలిచాయి. ప్రథమ ఇంటర్ ఫలితాల్లో చిత్తూరు జిల్లా, ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచాయి. మే 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని ఇంటర్‌బోర్డు ప్రకటించింది. ఈసారి ప్రభుత్వం వినూత్నంగా ఇంటర్ ఫలితాలు విడుదల చేసింది. వాట్సాప్ గవర్నెన్స్‌లో హాయ్ అని చెప్పడం ద్వారా విద్యార్థులు ఫలితాలు చూసుకోవచ్చునని తెలిపిన మంత్రి లోకేశ్... ఫలితాలు ఆ విధంగానే సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. గతంలో ప్రభుత్వాలు పరీక్షా ఫలితాల విడుదల సందర్భంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ఫలితాలు విడుదల చేసేవి.

ఎంజేపీ ఫలితాలు అత్యుత్తమం

ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. సెకండ్ ఇయర్‌లో 98 శాతం, ఫస్ట్ ఇయర్‌లో 92.40 శాతం మేర ఫలితాలు సాధించారు. రాష్ట్రంలో మిగిలిన ప్రభుత్వ జూనియర్, ఇతర రెసిడెన్షియల్ కళాశాలల కంటే ఎంజేపీ విద్యార్థులు మెరుగైన ఫలితాలతో ముందంజలో నిలిచారు. ఈ ఫలితాల్లో ఎంజేపీ బీసీ కళాశాలలు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 18 ఎంజేపీ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 1,608 మంది హాజరు కాగా, వారిలో 1,578 మంది ఉత్తీర్ణులయ్యారు. 30 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించలేదు. ఇంటర్ సెకండియర్‌లో ఉత్తీర్ణత శాతం 98 శాతంగా నమోదయింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకుగాను బి.దివాకర్ అనే విద్యార్థి 984 మార్కులు, బైపీసీలో కె.కవితాభాయి 982 మార్కులు సాధించారు. మొదటి సంవత్సర పరీక్షలకు 1,925 మంది హాజరుకాగా, వారిలో 1,779 మంది ఉత్తీర్ణులయ్యారు. 146 మంది ఫెయిల్ కాగా, మొదటి సంవత్సర పరీక్షల్లో 92.40 శాతం మేర ఉత్తీర్ణులయ్యారు.

ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 470 మార్కులకుగాను ఎం.మనోజ్‌కు 463 మార్కులు రాగా, బైసీపీలో 440 మార్కులకు జి.మేఘన, జి.దస్తగిరి, సీహెచ్ రాణి 435 మార్కులు సాధించారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన గుడిబండ (బాలికలు), తిరుపతి జిల్లా కోట(బాలురు) ఎంజేపీ కళాశాలలకు చెందిన విద్యార్థులంతా ఫస్ట్, సెకండ్ ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ కళాశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి, సింగరేణి : కాంగ్రెసు పార్టీ పిలుపులో భాగంగా శనివారం గోదావరిఖనిలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గని మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ అన్నది కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారత పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం విభజించి పాలించు అనే రీతిలో దేశాన్ని ముక్కలు చేస్తోందని, సామాన్యుల హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ ధనవంతులకే మద్దతు ఇస్తోందని అన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే చర్యలకు పాల్పడుతోందని దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ జాగృతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కార్పొరేషన్ అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మహిళా అధ్యక్షులు యువజన నాయకులు ఎన్ఎస్ఐ నాయకులు డివిజన్ ఇంచార్జిలో, ఇతర నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెసు నాయకులు బొంతల రాజేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ కార్పొరేటర్లు, మహిళ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయాల్లో చైతన్యవంతులు కావాలి

విశాలాంధ్ర – నేరేడుచర్ల : ఆర్యవైశ్యులు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొట్టమొదటిసారిగా నేరడుచర్లకు వచ్చిన సందర్భంగా స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ రంగంలో ఉత్సాహంగా ఉన్నవారిని పార్టీలకతీతంగా ప్రోత్సహించాలన్నారు. నిరుపేద ఆర్యవైశ్యులకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు, శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లా కేంద్రమైన సూర్యాపేటలో ఆర్యవైశ్య భవన నిర్మాణం కోసం కృషి చేస్తానన్నారు, ఆర్యవైశ్య పారిశ్రామికవేత్తలు నిరుపేద ఆర్యవైశ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. మొదట ఆయనను పూలమాలలతో శాలువాలతో ఘనంగా సన్మానించారు, సభ్యత్వ సేకరణ పుస్తకాలను రాజీవ్ యువశక్తి దరఖాస్తులను అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మా శెట్టి అనంత రాములు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు రాచకొండ శ్రీనివాసరావు, కందిబండ శ్రీనివాస రావు, భువనగిరి అంజయ్య, టిఎన్ స్వామి, గెల్లి లక్ష్మీనరసింహా రావు కొత్త లక్ష్మణ్, జాయింట్ సెక్రెటరీలు ఊటుకూరి నటరాజ్, గొళ్ల సుధాకర్, సోమప్ప ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్తలు గుండా సత్యనారాయణ, రాచకొండ అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల పుల్లయ్య, నీల శ్రీనివాస్, మురారిశెట్టి రమేష్, యాద ఎల్లయ్య,గజ్జల కోటేశ్వరరావు, వాసవిక్లబ్ అధ్యక్షుడు ఈగ శ్రీనివాసరావు, కందిబండ సురేష్, కట్టమూరి మధు, జగిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేద, బడుగు బలహీన వర్గాలకు సన్నబియ్యం పంపిణీ

విశాలాంధ్ర గూడూరు: గూడూరు మండలం దామరవంచ గ్రామంలో శనివారం గిరిజన ప్రాథమిక సహకార సంఘం నిత్యావసర వస్తువుల విక్రయశాలలో గ్రామ పార్టీ అధ్యక్షులు, గడిల రమేష్, యూత్ మండల ఉపాధ్యక్షులు ససుప సుదర్శన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీలర్ సుందర్ సన్న బియ్యం అందించారు. ఈ సందర్భంగా గడిల రమేష్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అందరికీ సన్న బియ్యంతో బువ్వ అందిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేదల ఆశాజ్యోతి అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అతి కొద్ది నెలల్లోనే తెలంగాణ ప్రజలకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి, రాష్ట్రంలోనే కాకుండా అటు జిల్లాలోనూ గ్రామాలలోనూ అందర్నీ తన తోబుట్టులా కాపాడుకుంటున్న ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దారంజాని, గాదె రవీందర్ రెడ్డి, జమాల్మియా, సబ్బోజు రాజు, తదితర కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో – సంగారెడ్డి : రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వీర హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించామని బిజెపి రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ హనుమాన్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు వేలాది మంది యువకులు పాల్గొనారు. ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా హిందూ యువకుల కేరింతలతో జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో సంగారెడ్డి మెయిన్ రోడ్ బైపాస్ రోడ్‌లో ర్యాలీ కొనసాగింది. శ్రీ వైకుంటపురం దేవాలయం నుండి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకురావడం జరిగింది. అనంతరం ర్యాలీ చివరకు వైకుంటపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు కొనసాగించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జయంతి కమిటీ సభ్యులు మందుల నాగరాజ్, ద్వారకా రవి, కసిని వాసు, దోమల విజయ్ కుమార్, శివ భజరంగ్ దళ్ నాయకులు తరుణ్ అఖిల్ లక్ష్మణ్ అభిలాష్ పోచారం రాములు డాక్టర్ రాజు గౌడ్, డాక్టర్ స్వామి గౌడ్, శ్రీకాంత్ శ్రీనివాస్ రెడ్డి, నరేన్ ప్రవీణ్, లవన్ రాకేష్, గౌడ్ సృజన్, చిట్టా యశ్వంత్, సందీప్, ఆర్ఎస్ఎస్ నాయకులు అంబరీష్, జగన్ పాల్గొన్నారు.

యువ వికాస్ దరఖాస్తు తేదీని పొడిగించాలి

విశాలాంధ్ర ప్రతినిధి–పెద్దపల్లి,సింగరేణి: రాజీవ్ యువ వికాస్ తేదీని మరో 10 రోజులపాటు పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కింద రుణాలు మంజూరు చేయడం కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం అప్లికేషన్ చివరి తేదు ఈనెల 14 కాగా, గత రెండు రోజులుగా సర్వర్ పనిచేయకపోవడం వల్ల అనేకమంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని, అందువల్ల మరో 10 రోజులు దరఖాస్తు తేదీని పొడిగించాలని కోరారు.అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయాల్లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెనువెంటనే ఇచ్చే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

నల్గొండను వ్యవసాయ హబ్‌గా మార్చేందుకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర – నల్లగొండ బ్యూరో : నల్గొండ జిల్లాను వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఇక్కడి వాతావరణం, నీటి వసతులు, నూతన పంటల సాగు, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని నల్గొండను వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, త్రిపురారం మండలం, కంప సాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఫాక్స్ నట్ మఖాన ప్రయోగాత్మక సాగును ప్రారంభించారు. రైతులు బాగుపడేందుకు ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడి దిశగా వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఒకే పంటను సాగు చేయడం వల్ల కరువు లేదా తెగులు వంటివి సోకినప్పుడు రైతులు తీవ్రంగా నష్టపోతారని, అలా నష్టపోకుండా పంటల మార్పిడి పాటించినట్లయితే ఎక్కువ లాభాలు వచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాధారణ పంటలు కాకుండా కొత్తరకం పంటలు సాగు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా నుండి 4 వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందాన్ని గత మార్చిలో బీహార్ రాష్ట్రంలోని దర్భంగ మఖాన స్టేషన్ పంపించడం జరిగిందని, ఈ బృందం అక్కడ మఖాన సాగు గురించి విత్తనం మొదలుకొని పంట కోత వరకు అన్ని విషయాలను అధ్యయనం చేసి ఇక్కడి రైతులతో వారి అనుభవాలను పంచుకున్నారని తెలిపారు. నల్గొండ జిల్లాలో మఖాన సాగులో భాగంగా ప్రయోగాత్మకంగా కంప సాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో ముందుగా ఒక ఎకరం విస్తీర్ణంలో మఖాన సాగును చేసేందుకు నిర్ణయించడం జరిగిందని, ఇందుకు 10 కిలోల విత్తనం వాడడం జరుగుతున్నదని, రెండు ,మూడు నెలల్లో ఈ విత్తనం ఒక ఎకరం క్షేత్రానికి తరలించనున్నట్లు తెలిపారు. పూర్తి సాంకేతికంగా పండించనున్న మఖాన సాగులో భాగంగా కంపసాగర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రం తో పాటు, కట్టంగూర్ రైతు ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో 3 ఎకరాలలో, నకిరేకల్ నియోజకవర్గంలో 2 ఎకరాలు, కొండమల్లేపల్లిలో 4 ఎకరాలలో మఖాన సాగును చేపట్టనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అయితే చాలా మందికి మఖాన సాగు బీహార్ లాంటి రాష్ట్రంలో మాత్రమే వాతావరణం అనుకూలంగా ఉంటుందని, నల్గొండ జిల్లాలో వాతావరణం అనుకూలంగా ఉంటుందా? లేదా? అనే అపోహలు ఉన్నాయని, వీటిన్నింటిని పక్కనపెట్టి నూతన పంటల సాగుపై చర్యలు తీసుకోవడంలో భాగంగా తాము తొలిమెట్టు ఎక్కినట్లుగా భావిస్తున్నామన్నారు. ప్రయోగాత్మకంగా చేపడుతున్న ఈ మఖాన పంటలో భాగంగా 60 శాతం పంట దిగుబడి వచ్చినా ఇక్కడే మఖాన ప్రాసెసింగ్ యూనిట్‌ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు. అలాగే కట్టంగూరు రైతు ఉత్పత్తి సంస్థ సహకారంతో మహిళా బజార్లు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. నల్గొండ జిల్లా సాధారణ పంటలతో పాటు, వివిధ రకాల కొత్త పంటలను సాగు చేసేందుకు ఇక్కడ వాతావరణ పరిస్థితులు ...

సీపీఐ భారీ ర్యాలీ....

జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

విశాలాంధ్ర – కొత్తగూడెం అర్బన్: భిన్న సంస్కృతులు, జాతులు, మతాలు కలిగి ఉన్న 147 కోట్ల మంది భారతీయులను ఒక్కతాటిపైకి తెచ్చిన మన రాజ్యంగ స్ఫూర్తికి కేంద్రంలోని మోడీ బిజెపి ప్రభుత్వం విఘాతం కలిగిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబిర్ పాషా తీవ్రంగా విమర్శించారు. పార్లమెంటులో ఉన్న మందబలంతో ఇష్టారాజ్యంగా చట్టాలను ఖూనీ చేస్తూ, మత విద్వేషాలు కలిగించే కొత్త చట్టాలు తెస్తూ కేంద్రంలోని మోడీ సర్కారుపై ప్రజలు తిరగబడితేనే ప్రజాస్వామ్యం రక్షించ బడుతుంద న్నారు. మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రిల్ 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వరకు సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన దేశవ్యాప్త నిరసనలలో భాగంగా శనివారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సుజాతనగర్ మండలం కేంద్రంలో పెద్ద ఎత్తున సిపిఐ నిరసన చేపట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సర్దార్ భగత్ సింగ్ చిత్రపాతాలతో మండల కేంద్రంలో భారీ ప్రదర్శని నిర్వహించిన అనంతరం జాతీయ రహదారిపై మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ కులం కన్న దేశం మిన్న అని భావించిన భగత్ సింగ్ తోపాటు మిత్రులు లాంటి అనేక మంది దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేసారు. స్వేచ్ఛాయుత భారతావనికి ప్రజలు గర్వించదగ్గ రాజ్యాంగాన్ని డాక్టర్ అంబెద్కర్ అందించారని వివరించారు. త్యాగధనుల ఆశయాలకు తూట్లు పొడుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ బిజెపి పాలకులు, నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు ఎండగట్టాల్సిన అవసరం ఉందన్నారు. సిబిఐ, ఈడీ, ఎన్నికల సంఘం తదితర రాజ్యాంగ సంస్థలను మోడీ, షా ల జోడి దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలు సాబీర్ వివరించారు. దేశ వ్యాప్తంగా అప్రకటిత మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తూ దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు బిజెపి పాలకుల దినచర్యగా మారాయని ఆరోపించారు. తమ పెట్టుబడి దారు గుజరాతి వ్యాపారి అదాని అమెరికాలో అక్రమాలు చేస్తూ దొరికి పోయి కేసుల్లో ఇరుక్కున్నట్లు విమర్శించారు. అతన్ని కాపాడటానికి ప్రెసిడెంట్ ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి దేశ సార్వభౌమత్వాన్ని, ఆదాయాన్ని అమెరికాకు మోడీ తాకట్టు పెట్టాడని ఆరోపించారు. ఆదివాసి రాష్ట్రాల్లో ఉన్న సహజ వనరులను తమ వ్యాపారులకు దోచి పెట్టేందుకు కగార్ ఆపరేషన్ పేరా అడవుల్లో బతుకుతున్న ఆదివాసీలను ఉచకోత కు పాల్పడుతున్నట్లు విమర్శించారు. మోడీ అమిత్ షా లతోపాటు బీజేపీ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమైనట్లు హెచ్చరించారు. సిపిఐ జిల్లా, మండల నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, జి వీరాస్వామి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎమ్ ధనలక్ష్మి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, తాళ్ల వెంకటేశ్వర్ రావు, నాయకులు ధర్మరాజు, యండి. యూసుఫ్, నేరెళ్ల రమేష్, టి పాపారావు, గణేష్, గోవిందు, ఉపేందర్, దుర్గ, మల్లేష్, రసూల్, అంకూస్, కొమారి కృష్ణ, మురళి, సాపావట్ రవి, మాన్యా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

విశాలాంధ్ర – జిల్లా బ్యూరో మహబూబాబాద్ / తొర్రూరు : గర్భిణీలు బాలింతలు పిల్లలు అంగన్వాడి కేంద్రాలలో ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ సూపర్వైజర్ జిఎల్ మేరీ, అంగన్వాడీ టీచర్‌లు అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమర్‌సింగ్ తండా, కర్రె బిక్యా తండా, చౌల తండా అంగన్వాడి సెంటర్లలో చిరుధాన్యాలపై వారు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న రాగి జావా, పల్లి పట్టి, నువ్వుల లడ్డు, జొన్న లడ్డు, పుట్నాలు, వేరుశనగ పల్లీల పొడి, మునగాకు కారంపొడి మొదలగు పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు జె కమలాదేవి, వి.భారతి, చంద్రకళ, సీత, ఏఎన్ఎం ఉమా, శారద, ఆశా కార్యకర్తలు స్వరూప, కరుణ, ఆయా శారద, స్థానికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన షాలేం రాజు

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలో జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. శనివారం సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ దత్తత గ్రామమైన పెనగడపను జియం సందర్శించారు. రెవెన్యూ బడ్జెట్ నుంచి వ్యయంతో అంబేద్కర్ నగర్‌లోని అంగన్వాడి పాఠశాలలో రూ. 2.2 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంధాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రామవరంలోని అంబేద్కర్ పార్క్ నందు రూ.3.5 లక్షల వ్యయంతో నిర్మించిన వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు అంబేద్కర్ పార్క్‌ను ఆధునికరించి వాకింగ్ ట్రాక్ టాయిలెట్స్ నిర్మాణం చెయ్యాలని కోరడం జరిగింది. అనంతరం రామవరం లోని గణేష్ చౌరస్తా లోని పార్క్‌కు రూ.12 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్, టాయిలెట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సిఎండి బలరాం ఆదేశించిన ప్రకారం గ్రంథాలయ ఏర్పాటు కోరగా ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ త్వరిగతిన పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. పెనగడప గ్రామంలోని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. అంగన్వాడిలోని చిన్నారులకు కుర్చీలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలియడంతో 20 కుర్చీలను వితరణ చేస్తున్నామన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు రామవరం అంబేద్కర్ పార్క్, గణేష్ చౌరస్తాలోని పార్క్‌లను ఆధునికరణ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏఐటీయుసి వైస్ ప్రెసిడెంట్ కే.రాములు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, జి ఎం జీవీ కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, ఎజిఎం సిహెచ్ రామకృష్ణ, డిజిఎం బి. శివ కేశవరావు, సివిల్ అధికారులు అచ్యుతరామయ్య, రాజారాం, యూనియన్ ప్రతినిధులు ఆకునూరి కనకరాజు, రాజశేఖర్, ఫిట్ సెక్రటరీ సిహెచ్ సాగర్, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు సీపీఐ ఘన నివాళి

విశాలాంధ్ర – ఖమ్మం : పద్మశ్రీ అవార్డు గ్రహీత పర్యావరణ పరిరక్షకుడు వనజీవి రామయ్య మృతి పట్ల భారత కమ్యూనిస్ట్ పార్టీ సీపీఐ జిల్లా సమితి ఘనంగా నివాళులు అర్పించింది. వనజీవి మృతి వార్త తెలిసిన వెంటనే ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండి మౌలానా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దినేని కరణకుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ, సీపీఐ నాయకులు లింగ వెంకట నారాయణ, పొత్తీయ శ్రీనివాస్, తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ తన జీవితం అంత వృక్ష సంపదను పెంచడానికి పర్యావరణాన్ని కాపాడడానికి వనజీవి రామయ్య చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణానికి ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో వనజీవి రామయ్య లాంటి వారు మరణించడం తీరని నష్టం అని భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడేందుకు రామయ్యను స్ఫూర్తిగా తీసుకుని యువతరం ముందుకు సాగాలన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర – కారేపల్లి : శ్రీ ఆంజనేయ స్వామి శక్తి అద్వితీయమైన దని నిత్యం ఆ స్వామిని పూజించిన వారికి సర్వ శక్తులు లభిస్తాయని పలువురు ఆంజనేయ స్వామి భక్తులు అన్నారు. శనివారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. కారేపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో హనుమాన్ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా మందిరం వద్ద నుండి కారేపల్లిలోని పురవీధుల్లో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు తురక నారాయణ సూర్యదేవర వెంకటేశ్వర్లు, జంగా వెంకటేశ్వర్లు, రాము ధరక్ సురేష్ బాబ్, గూడెల్లి శ్రీనివాసరావు, చోడవరపు రమేష్, మూడు మోహన్ చౌహాన్, చిరునోముల రామారావు, నోముల రాజు, గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృతి

విశాలాంధ్ర – తొర్రూరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన తొర్రూరు మండలంలోని జమస్థాపురం గ్రామ శివారు రూప తండాలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు రైతు భూక్య రవి తెలిపిన వివరాల ప్రకారం తన పొలం వద్ద ఎద్దులను మేత మేపుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు ఒక ఎద్దు వెళ్లగానే షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. వ్యవసాయ పనులకు ప్రధాన ఆధారమైన ఎద్దు మృతితో కుటుంబం ఆర్థికంగా నష్టపోవడంతో రైతు దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఎద్దు మృతి చెందిందని, బాధిత రైతు ఆరోపించారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందచేసి కుటుంబాన్ని ఆదుకోవాలని తొర్రూరు పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, అధికారులను ఆయన కోరారు.

చంద్రుగొండలో ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేస్తాం

యువకులతో క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే జారే

విశాలాంధ్ర – కొత్తగూడెం క్రైమ్: ఎమ్మెల్యే హోదాలో ఉన్నప్పటికీ సామాన్య ప్రజలతో ఎలాంటి భేషజాలు లేకుండా కలిసిపోతారని అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణకు నియోజకవర్గంలో మంచి గుర్తింపు ఉంది. శనివారం ఒక కార్యక్రమానికి వెళ్తూ ఆయన ఉదయం 8.30 కు చంద్రుగొండ – జూలూరుపాడ్ రోడ్ పక్కనే ఉన్న పొలాల్లో క్రికెట్ ఆడుతున్న యువకులను చూసారు. వెంటనే కారు దిగి పొలాల్లోకి వెళ్లి వారితో కలిసి కొద్ది సేపు బ్యాటింగ్, బౌలింగ్ చేసి తనలో ఉన్న ఆటగాడిని ఎమ్మెల్యే ప్రదర్శించి ఆశ్చర్యానికి గురి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆటగాళ్ళతో మాట్లాడుతూ పొలంలో ఎందుకు ఆడుతున్నారని అడిగారు. మండల కేంద్రమైనప్పటికి "చంద్రుగొండలో ఆట స్థలం లేదని, చాలాసార్లు అధికార్లకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలిచ్చినా పట్టించుకో లేదని అందుకే ఈ పంటపొలాల్లో ఆడుతున్నట్లు" ఆటగాళ్ళ తమ ఇబ్బందులను ఆయనకు వివరించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తాను చదువులతోపాటు ఆటలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. వెంటనే తహసిల్దార్‌తో మాట్లాడారు. చంద్రుగొండలో ఆటల కోసం సరిపడా స్థలం చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరలో కచ్చితంగా ప్లే గ్రౌండ్ ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ఆటగాళ్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ మండల అధ్యక్షులు దారం గోవిందరెడ్డి, నాయకులు యండి. షబ్బీర్, యండి. వసీం పాష, యండి. ఇమ్రాన్, ఆటగాళ్ల ప్రతిభ విద్యాలయం కరెస్పాండంట్ ఖాజా హుస్సేన్, ఆర్ ఎమ్ పి వైద్యులు యండి.సాబిర్, యండి. పాష, ముజమ్మిల్, ఉద్యోగులు ఎంపివో ఖాన్, సెక్రెటరీ యండి. ఇజహార్, ఆర్‌టిసి ఉద్యోగి జలీల్, యువకులు జాహెద్, బషీర్, యాకుబ్ పాషా, నరేష్, మద్దిబోయిన సీతారాములు వున్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తు గడువు పెంచాలి

విశాలాంధ్ర – కొత్తగూడెం : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం కొత్తగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు తేదీని మరో వారం రోజులు పొడిగించా లని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత నెల 17వ తేదీ నుంచి మొదలైన ఈ దరఖాస్తుల పరంపరలో అనేక అడ్డంకులు ఏర్పడ్డాయని వివరించారు. ప్రభుత్వం దరఖాస్తుల కోసం తొలుత గత నెల 17 నుంచి 5 వరకు గడువు విధించింది అన్నారు. ఈ 15 రోజుల్లో వారం రోజుల్లో వారం రోజులు పండుగలు, జాతీయ సెలవు దినాలు ఉన్నట్లు తెలిపారు. తరువాత గడువు పొడిగించి ఈనెల 14న నిర్ధారించినప్పటికీ ఇందులోను అయిదారు రోజులు సెలవు దినాలే కావడం ప్రభుత్వం గమనించాలని ఆయన కోరారు. మొత్తంగా ఆదివారాలు కలిపి సుమారు 14 రోజులు సెలవు దినాలే రావడంతొ జిల్లాలో అర్హులైన సగం మంది ఇంకా దరఖాస్తులు చేసుకోలేదని తెలిపారు. దరఖాస్తుల కోసం అవకాశమున్న రెండు వారాల సమయంలోనూ వెబ్సైట్లు పనిచేయక చాలాచోట్ల ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. యువకుల ఉపాధి కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టగా భావిస్తున్న ఈ పథకాన్ని మరో వారం రోజులు గడువు పెంచాలని కోరారు. కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీ కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో సాఫ్ట్ వేర్ వల్ల సర్వర్ల సమస్యలు ఏర్పడి రోజుల తరబడి జాప్యం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు స్వయంగా విచారణ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల కోసం క్యూలు కడుతున్న యువకులను చూస్తుంటే నిరుద్యోగ సమస్య జిల్లాల వారీగా రాష్ట్రంలో ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. కొన్ని బ్యాంకులకే ఈ పథకం అనుసంధానం ఉన్న నేపథ్యంలో కొత్తగా బ్యాంకులు అకౌంట్లు తీసుకోవడానికి సమయం పడుతుందన్నారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర – ఖమ్మం : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నూతన వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈరోజు ఖమ్మం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు నశించాలి అని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం ద్వారా బీజేపీ తన మతోన్మాద మతపరమైన విభజన ఎజెండాను మరింత ముందుకు తీసుకొచ్చాయని మైనారిటీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఇప్పటికే ట్రిపుల్ తలాక్, సీఏఏ లాంటి చట్టాలకు జతగా తాజాగా వక్ఫ్ బిల్లును తీసుకొచ్చారని దేశ వ్యాప్తంగా సుమారు 9 లక్షల హెక్టార్లో విస్తరించిన 8.7 లక్షల వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసమే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ముస్లింలకు వ్యతిరేకంగా పలు అంశాలు ఈ చట్టంలో ఉన్నాయని సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతరులకు స్థానం కల్పించడం. ఇస్లామిక్ చట్టాల ప్రకారం మతపరమైన, దాతృత్వ సేవల కోసం దానంగా ఇచ్చిన ఆస్తులపై ముస్లిమేతరులకు కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. భవిష్యత్‌లో వక్ఫ్ భూముల వివాదాల సంబంధించి పరిష్కార భాద్యత, వక్ఫ్ భూముల నిర్ధారణ భాద్యత ప్రభుత్వ అధికారికి మొత్తంగా కట్టబెట్టడం ఉద్దేశ్యపూర్వకంగా ముస్లింలను భయందోళనకు గురిచేయడం ముస్లింలను ప్రధాన స్రవంతి నుంచి వేరు చేయడం అవుతుందని భాగం విమర్శించారు. ఈ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగం కల్పిస్తున్న మత స్వేచ్ఛ హక్కు, మత వ్యవహారాల నిర్వహణ హక్కులను నిర్ధారిస్తున్న రాజ్యాంగంలోని 25, 26 అధికరణలను ఉల్లంఘించడమే అవుతుంది అన్నారు. ముస్లిం ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా తీసుకొచ్చిన చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని ఇది ముస్లింలను విభజించడానికే తీసుకొచ్చిన చట్టంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, ఎస్కె జానీమియా, ఎండి సలాం, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, బీజీ క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, ఎస్కె షానా, రెహమాన్, తాటి నిర్మల, జాలా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అంబేద్కర్ - ఆర్‌ఎస్‌ఎస్

వచ్చే సోమవారం అంబేద్కర్ 135వ జయంతి. అంబేద్కర్ సిద్ధాంతంతో ఏ మాత్రం పొసగని వారు కూడా ప్రస్తుతం తమది అంబేద్కర్ వారసత్వమని చెప్పుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. సోమవారం మనం జరుపుకునే జయంతి దురదృష్టవశాత్తు బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో జరుగుతోంది. బీజేపీ ప్రభుత్వం అంటే ఆర్‌ఎస్‌ఎస్ అధీనంలో పని చేసే రాజకీయ పార్టీ ప్రభుత్వమే. అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి బీజేపీ చేయని ప్రయత్నం లేదు. కానీ ప్రతిసారీ ఈ ప్రయత్నం బెడిసికొడ్తూనే ఉంది. అంబేద్కర్ అంటే సంఘ్ పరివార్ సిద్ధాంత సంద్రంలో ఓలలాడే వారికి ఎంతటి ద్వేషం ఉందో ఇటీవల పార్లమెంటు నిండు కొలువులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతి దానికి "అంబేద్కర్, అంబేద్కర్ అంటూ ఉంటారు" అని ఎద్దేవా చేయడాన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. 2014 లోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని బాహాటంగా ప్రకటిస్తున్న వారిని సంఘ్ పరివార్ ఎన్నడూ మందలించిన పాపాన పోలేదు. అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించి సిద్ధం చేసిన భారత రాజ్యాంగంపై సంఘ్ పరివార్‌కు ఏనాడూ గౌరవం లేదు. ఈ రాజ్యాంగంలో భారతీయమైంది ఏదీ లేదని రాజ్యాంగం ఆమోదించిన వెంటనే సంఘు పరివార్ అధికార పత్రిక "ఆర్గనైజర్" పెద్ద వ్యాసం ప్రచురించింది. సంఘ్ పరివార్‌కు కావాల్సింది మనుస్మృతి. మనుస్మృతిని తగులబెట్టిన అంబేద్కర్‌ను సంఘ్ పరివార్ క్షమించడం సాధ్యం కాదుగా! ఆర్‌ఎస్‌ఎస్‌కి ఫాసిస్టు పోకడలు ముందు నుంచే ఉన్నా మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఫాసిజం పడగవిప్పి విలయ తాండవం ఆడుతోంది. తమకు 400 సీట్లకన్నా ఎక్కువ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు నినదించారు. ఆ కలే నెరవేరితే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీలో రెండవ శ్రేణి నాయకులు మొహమాటం లేకుండానే ప్రకటించారు. "అంబేద్కర్ మళ్లీ జన్మించి వచ్చినా రాజ్యాంగాన్ని మార్చడం సాధ్యం కాదు" అని మోదీ గొంతు చించుకుని అరవడం సంఘు పరివార్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. వందేళ్ల నుంచి మనగలుగుతున్న ఫాసిస్టు పోకడలుగల ఆర్‌ఎస్‌ఎస్ మనగలగడం ప్రపంచ చరిత్రలోనే మరో ఉదాహరణ లేని అంశం. వైపరీత్యం ఏమిటంటే అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగాన్ని బీజేపీ అధికార పీఠం ఎక్కడానికి సోపానంగా మలుచుకుంది. సంఘ్ పరివార్‌ను వ్యతిరేకించే వారు అదే రాజ్యాంగాన్ని ఆసరాగా చేసుకుని పోరాడుతున్నారు. ఫాసిజానికి, సంఘ పరివార్‌కు వ్యతిరేకంగా పోరాడే వారందరికీ రాజ్యాంగమే ఆయుధం అయింది. ఆర్‌ఎస్‌ఎస్ పుట్టిన సమయంలోనే యూరప్‌లో ఫాసిస్ట్ సంస్థలు పుట్టాయని మరిచి పోకూడదు. ఆర్‌ఎస్‌ఎస్ బుజానికెత్తుకునే మనుస్మృతి మహిళలను, దళితులను కనీసం మనుషులుగా చూడదు. మనుస్మృతి "అంటరానివారి బానిసత్వానికి బైబిల్ లాంటిది" అని అంబేద్కర్ అనడంలో కేవలం మనుస్మృతి మీద విరోధమే కారణం కాదు. అది మనుస్మృతిని నెత్తికెత్తుకునే సంఘ్ పరివార్ మీద ఆయన ఈసడింపునకు తార్కాణం. హిందూ మతంలో స్త్రీ పురుష సమానత్వం లేదని అంబేద్కర్ భావన. హిందూ కోడ్ బిల్‌కు రూపకల్పన చేసినప్పుడు ఆయన దృష్టిలో ఉన్న ప్రధానాంశం హిందూ మతంలో స్త్రీ, పురుష సమానత్వం కొరవడడమే. ఆర్‌ఎస్‌ఎస్‌కు కావలసింది ఈ వివక్షాపూరితమైన హిందూ సమాజ ఆధిపత్యమే. ఈ విషయంలో సంఘ పరివార్ వైఖరికి హిందూ మతానికి, సగటు హిందువులకు ఎలాంటి సంబంధమూ లేదు. హిందూ కోడ్ బిల్‌ను వ్యతిరేకించిందెవరో ప్రత్యక్షంగా చెప్పక్కర్లేదు. అంబేద్కర్ రూపొందించిన హిందూ కోడ్‌బిల్ వారసత్వంగా సంక్రమించిన ఆస్తిలో మహిళలకు భాగస్వామ్యం కల్పించింది. ఇది ఆర్‌ఎస్‌ఎస్‌ను భయకంపితం చేసింది. అందుకే అప్పుడు రాం లీలా మైదానంలో సంఘ్ పరివార్ 1949 డిసెంబర్ 12న అంబేద్కర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసింది.

అంబేద్కర్ కులవ్యవస్థకు బద్ధ విరోధి. సంఘ్ పరివార్ అస్తిత్వానికి మూలకందమే కుల వ్యవస్థ. అంబేద్కర్ జీవితాంతం మహిళలకు గౌరవ స్థానం ఇవ్వడానికి, కుల వ్యవస్థను వ్యతిరేకించడానికే పాటు పడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రబోధించే "సాంస్కృతిక జాతీయతా వాదం" మనుస్మృతి మీద, బ్రాహ్మణాధిపత్యం ఉండే కులవ్యవస్థ మీద ఆధారపడింది. అంబేద్కర్‌ను సొంతం చేసుకోవడంలో సంఘ్ పరివార్‌ది కేవలం కుట్ర తప్ప అంబేద్కర్ మీద ఇసుమంత గౌరవంగానీ, విశ్వాసంగానీ లేవు. అంబేద్కర్ కుల వ్యవస్థతో, బ్రాహ్మణీకంతో ఎన్నడూ రాజీ పడలేదు. కులం మీద ఆధారపడ్డ హిందుత్వ, ముస్లింలను ద్వేషించడం అంటే దళితులను, మహిళలను అణగదొక్కడమేనని అంబేద్కర్ భావించారు. హిందూ రాజ్యం కనక వాస్తవంగా ఆవిర్భవిస్తే అది నిస్సందేహంగా దేశానికి మహత్తరమైన దురదృష్టంగా పరిణమిస్తుంది అని అంబేద్కర్ భావించే వారు. హిందూ రాజ్యానికి, ప్రజాస్వామ్యానికి పొసగదు అన్నది అంబేద్కర్ నిశ్చితాభిప్రాయం. ఎట్టి పరిస్థితిలోనూ హిందూ రాజ్యం నెలకొల్పడాన్ని నివారించాల్సిందేనని అంబేద్కర్ చెప్పేవారు. హిందూ రాజ్యం లేదా హిందూ రాష్ట్రం వల్ల ముప్పును అంబేద్కర్ వ్యతిరేకించిన సమయంలో హిందుత్వ రాజకీయాలు ఇప్పుడున్నంత బలంగా లేవు. అసలు లెక్కలోకి తీసుకోదగినవిగా కూడా లేవు. బ్రిటీష్ వలసవాద వ్యతిరేక పోరాటం జరుగుతున్నప్పుడు ఇప్పుడు హిందుత్వ, హిందుత్వ అని బోర విరుచుకుంటున్న వారు అప్పుడు ప్రస్తావించదగిన స్థాయిలో కూడా లేరు. 1930, 1940 లలో జాతీయోద్యమం భీకరంగా సాగుతున్న దశలో ఆర్‌ఎస్‌ఎస్ పేరు ఎత్తే వారైనా ఉండేవారు కాదు. నిజానికి సంఘ పరివార్ కుదురుకు చెందిన వారందరూ జాతీయోద్యమంలో పాలు పంచుకోకపోగా బ్రిటీష్ వారికి దాసోహం అన్న వారే. బ్రిటీష్ వారి నుంచి మనకు అధికారం బదిలీ అవుతున్న దశలో కూడా ఆర్‌ఎస్‌ఎస్ నిగమ శర్మ అక్క పాత్రకే పరిమితం అయింది. ప్రస్తుతం పరిస్థితి ఆనాటి పరిస్థితికి పూర్తిగా భిన్నమైంది. సంఘ పరివార్‌కు చెందిన వారు ప్రస్తుతం అధికారంలో ఉన్నారు. వారు ఫాసిస్టు విషవమనం చేస్తున్నారు. రాజకీయ-ఆర్థిక ఆవరణలో నిర్ణాయక పాత్ర పోషిస్తున్నారు. పౌర వ్యవస్థ మీదే కాక, సైనిక వ్యవస్థ మీద కూడా ఆర్‌ఎస్‌ఎస్ ఉక్కు పిడికిలి బిగుసుకు పోయింది. న్యాయవ్యవస్థ, పోలీసులు, విద్యా రంగం, శాస్త్ర పరిశోధన, చరిత్ర రచన, కళా సాంస్కృతిక రంగాలు ఇప్పుడు హిందూ రాష్ట్ర గానంలో తరించి పోతున్నాయి. దాదాపు శతాబ్దం కిందే అంబేద్కర్ ఈ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌ను నిరంతరం ఈసడిస్తూనే వచ్చారు. అంబేద్కర్ మనుస్మృతిని అడుగడుగునా వ్యతిరేకిస్తే ఇప్పుడు మనుస్మృతిని నెత్తిన పెట్టుకుంటున్న వారు, జనం మీద బలవంతంగా రుద్దుతున్న వారు అధికారంలో ఉన్నారు. ఇలాంటి శక్తులతో శతాబ్దం కిందటే అంబేద్కర్ పోరాడారు. ఆయన జన్మ దినం జరుపుకోవడం అంటే ఇలాంటి ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సర్వ శక్తులూ ఒడ్డి పోరాడడమే.

రెడ్ బుక్ అంటే...!

పోతుల బాలకోటయ్య

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పదేపదే అంటున్న రెడ్‌బుక్ పై వివాదం ముదురుతోంది. లోకేశ్ ఏ సభలో మాట్లాడినా, మీడియాతో మాట్లాడినా అవును, ఏపీలో రెడ్‌బుక్ అమలు చేస్తున్నామని, ఆ ఎఱ్ఱ పుస్తకం రంగు చూసి ప్రత్యర్థులు కాలు జారిపడి పోతున్నారని, గుండెపోటుతో ఆసుపత్రిలో చేరి పోతున్నారని, గజ గజ వణికిపోతున్నారని అంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యం చేసుకొని ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని, రేపు మేము అధికారంలోకి రాగానే రెడ్‌బుక్ అమలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులను, అధికారులను గుడ్‌బుక్ పెట్టి సప్తసముద్రాల ఆవల ఉన్నా, లాక్కొచ్చి జైళ్లల్లో పెడతాం అని, గుడ్డలు ఇప్పదీసి రోడ్లపై నిలబెడతామని సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగైదు సార్లు హెచ్చరికలు జారీ చేశారు కూడా. టీడీపీ బాధితులు ఆయన దగ్గరకు వచ్చి బాధలు చెప్పుకుంటే, నిన్ను ఇబ్బంది పెట్టిన వాడిని తెచ్చి నీకు సెల్యూట్ కొట్టిస్తా, నమస్కారం పెట్టిస్తా అంటూ అభయం ఇస్తున్నారు. నిజానికి ఏపీలో రెడ్‌బుక్ ఉందా? ఉంటే అది ఎలా ఉంటుంది? అది అమలు జరుగుతోందా? రెడ్‌బుక్ అంటే ఏమిటి? ఎన్ని పేజీలు ఉన్నాయి? దానిలో ఏమి రాసుంది? దానిని ఎవరు రాశారు? ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు దానినే అనుసరిస్తున్నారా? అది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం లాంటిదేనా? పోనీ రాజారెడ్డి రాజ్యాంగం లాంటిదా? అది అధికారులకు కూడా ప్రామాణికమా? కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీ కూడా రెడ్‌బుక్ పట్టుకున్నట్లేనా? అంగీకరించినట్లేనా? ఇవన్నీ చర్చనీయాంశాలే.

రెడ్‌బుక్ అనేది ఒకటి ఉందా? ఉంటుందా? ఉండవచ్చా? ఇలా ఒక్కొక్కరు ఒక్కో పుస్తకం పెట్టుకోవచ్చా? పట్టుకోవచ్చా? వంటి చాలా ప్రశ్నలతో ఎఱ్ఱ పుస్తకంపై ఎఱ్ఱెఱ్ఱని చర్చ జరుగుతోంది. ఈ ఎఱ్ఱ పుస్తకం చర్చ కూడా ఇప్పటికిప్పుడు ఆగేలా లేదు. ఐదేళ్లూ సాగేలా ఉంది. భవిష్యత్తులో దీని పాత్ర చాలా 'రక్త చరిత్ర'లా ఉండబోతోంది కూడా. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రెడ్‌బుక్‌ను రాజకీయ అస్త్రంగా మార్చే ప్రయత్నం ఇప్పటికే మొదలు పెట్టారు.

ప్రజాస్వామ్యంలో భారత రాజ్యాంగం తప్ప, ఏ పుస్తకం ఉండదు. ఉండబోదు. ఇది అందరికీ తెలిసిన సత్యం. ప్రజాస్వామిక వాదుల భావన. ఐతే, గత ఎన్నికలకు ముందు లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహించారు. ఆ పాదయాత్ర సందర్భంగా ఆయన చేతిలోని మైకు, ఆయన ముందున్న కుర్చీ లాక్కొని పోలీసులు ఆయనను ఇబ్బందులు పెట్టారు. అడుగడుగునా పాదయాత్రను ఆపేందుకు, ఆటంకాలు కలిగించేందుకు, కట్టడి చేసేందుకు ప్రయత్నాలు చేశారు. వీటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులపై, కార్యకర్తలపై రాజ్యహింస ప్రయోగం జరిగింది. అనేక పదుల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను జైళ్లల్లో పెట్టారు. ఆఖరికి ఆయన తండ్రి చంద్రబాబును సైతం రాజమండ్రి జైలులో బంధించారు. తల్లికి, తన కొడుకుకీ కూడా శోకం తెప్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోకేశ్ రేపు మేము అధికారంలోకి రాగానే రెడ్‌బుక్ అమలు చేస్తామని, అందులో తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను చట్ట రహితంగా ఇబ్బందులు పెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కార్యకర్తలకు భరోసా, ధైర్యం నింపారు. దీనిని తెలుగుదేశం శ్రేణులు స్వాగతించాయి. హర్షం వ్యక్తం చేశాయి. అనుకున్నట్టుగానే గత ప్రభుత్వం 11 సీట్లతో కుప్ప కూలటం, కూటమి పార్టీలు 164 సీట్లతో అఖండ విజయం సాధించటం జరిగిపోయాయి. దీంతో ఇక చట్టాన్ని వంకర టింకరగా కాకుండా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎఱ్ఱ పుస్తకం అనే మాటతో, పదాలతో పనిలేదు. ఎఱ్ఱ పుస్తకం అంటే సక్రమంగా పని చేసే చట్టం అనో, వక్రంగా పనిచేసే చట్టం కాదనో చెబితే ఒక్క మాటతో బావుంటుంది. కానీ ఈ మాట అనేందుకు లోకేశ్‌కు వయసు అడ్డొస్తోంది. ఉడుకు రక్తం అననివ్వటం లేదేమో. రెడ్‌బుక్ అమలు చేస్తున్నామనే అంటున్నారు. దీంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని ప్రధాన అస్త్రం చేసుకొని ప్రజల్లో ప్రభుత్వంపై తనకు సానుభూతి, సానుకూలత సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో అంశం ఏమిటంటే, రెడ్‌బుక్ గూర్చి లోకేశ్ తప్ప కూటమి ప్రభుత్వంలోని జనసేన, బీజేపీ నాయకులు కానీ, ప్రభుత్వంలో ఉన్న నాయకులు కానీ మాట్లాడరు. సొంతం చేసుకోరు. అలా మాట్లాడితే సరైంది కాదన్న భావన వారికి ఉంది. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెడ్‌బుక్ అంశం ఇప్పటి వరకు ప్రస్తావించలేదు. దానిపై ఏ సందర్భంలోనూ మాట్లాడలేదు. రానున్న కాలంలో రెడ్‌బుక్ మాది కాదు అనే అవకాశం కూడా కూటమిలోని మిగిలిన రెండు పార్టీలకు లేకపోలేదు. సహజంగా సంకీర్ణ వ్యవస్థలో తప్పులు జరిగితే, ప్రధాన భాగస్వామ్య పార్టీపైకి నెట్టి, ఒప్పులు జరిగితే వాటిని మాత్రమే తమవిగా సొంతం చేసుకునే అవకాశం రాజకీయ పార్టీలకు ఉంది. దీనికి సంబంధించిన రాజకీయ అనుభవాలు అటు కేంద్రంలోని ఎన్డీఏ, యూపీఏ కూటముల్లోనూ, ఇటు అనేక రాష్ట్రాల్లో జత కట్టిన కూటముల్లోనూ దండిగా ఉన్నాయి. వెతుక్కుంటే చాలా దొరుకుతాయి. ఒకే రాజకీయ పార్టీ సారథ్యంలో ఉన్న ప్రభుత్వ పాలనకు, మూడు రాజకీయ పార్టీల సారథ్యంలో ఉన్న ప్రభుత్వ పాలనకు చాలా తేడా ఉంటుంది. సర్దుబాటు ఉన్నంత వరకు మహాప్రసాదం. సర్దుబాటు చెడితే మహా ప్రమాదం. అందువల్ల కూటమిలోని ప్రధాన భాగస్వామ్య తెలుగుదేశం పార్టీ, ముఖ్యంగా యువనేత లోకేశ్ ఆచి తూచి అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగుదేశం పార్టీకి భవిష్యత్ మార్గదర్శి కూడా కాబట్టి రాజ్యాంగ స్ఫూర్తిని పూర్తిగా పెంపొందించుకోవాల్సిన అవసరమూ ఉంది.

అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

అంబేద్కర్ జీవితం కావాలి ఆదర్శం

ఎస్.బాల్‌రాజ్

నవభారత నిర్మాత, అణగారిన జాతి ధాస్య విమోచకుడు, స్త్రీ జనోద్ధారకుడు, మానవ హక్కుల కొరకు నిరంతరం పోరాడిన ధీశాలి, భారత రాజ్యాంగ రచన శిల్పి, భారతరత్న బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ జీవితం అద్యంతం స్ఫూర్తిదాయకమైనది. 1891 ఏప్రిల్ 14 న నేటి మధ్యప్రదేశ్ లోని "మౌ" అనే కంటోన్మెంట్ పట్టణంలో మిలిటరీలో సుబేదార్ మేజర్‌గా పనిచేస్తున్న రాంజీ సక్పాల్ అంబావాడేకర్, ధీమా బాయిలకు 14 వ సంతానంగా అంబేద్కర్ జన్మించారు. 1896 నవంబర్ 7న అంబేద్కర్ 6వ ఏట తల్లి ధీమాబాయి మరణించారు. హైస్కూల్ నుంచి 1907 వ సంవత్సరంలో మెట్రిక్ ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. ఒక అంటరాని కులానికి చెందిన అంబేద్కర్ మెట్రిక్ పాసైన మొదటి వ్యక్తి కావటం గొప్ప విశేషం. 16 సంవత్సరాల వయసులో అంబేద్కర్‌కు 9 సంవత్సరాల రమాబాయితో వివాహం జరిగింది. 1910లో ఎల్ఫిన్‌స్టన్ కళాశాల నుంచి ఇంటర్‌మీడియట్, బరోడా మహారాజ్ ఆర్థిక సహాయంతో 1912 న అదే కళాశాల నుంచి బీఏ డిగ్రీ పూర్తి చేశారు.

అంబేద్కర్ బరోడా మహారాజ్ ఆర్థిక సహాయంతో 1913 జులైలో ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరాడు. 1915 జూన్‌లో ప్రాచీన భారతదేశ వాణిజ్యం అన్న థిసెస్‌కు ఎం.ఎ. డిగ్రీని, 1916 జూన్ 8 న భారత జాతీయ ఆదాయం, దాని చారిత్రక విశ్లేషణ అనే సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ పీహెచ్‌డీని అంబేద్కర్‌కు వర్సిటీ ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన మొదటి భారతీయుడిగా ఆయన చరిత్రకెక్కారు. 1916 మే 9 న శాస్త్ర సెమినార్‌లో భారతదేశంలో కులాలు, వాటి యంత్రాంగం, పుట్టుక, అభివృద్ధి అన్న అద్భుతమైన సిద్ధాంత వ్యాసాన్ని రాసి చదివారు. ఈ రచనే ఆయన్ని ప్రపంచ మేధావుల్లో ప్రథమ శ్రేణిలో నిలిపింది. అంబేద్కర్ తన భోజన ఖర్చులు తగ్గించుకొని పుస్తకాలు కొనేవాడు. అర్ధాకలితో రోజుకు 12 గంటలు చదువుతుండేవాడు.

అంటరాని కులం కారణంగా నౌకరీలు కూడా ఫైళ్లు చేతికిచ్చేవారు కాదు. పెద్ద ఉద్యోగం చేస్తున్నా చిన్న నౌకర్లు సైతం అంటరానివాడని హీనంగా చూసేవారు. ఉండటానికి ఎవరూ ఇల్లు ఇవ్వలేదు. 1920 జనవరి 31న "మూక్ నాయక్" అనే పక్ష పత్రికను స్థాపించి బానిసత్వంలో మగ్గుతున్న నిమ్న జాతీయులను మెల్కొల్పాలని, హిందూ సమాజంలోని అసమానతలను తొలగించేందుకు ప్రయత్నించాలని, నిమ్నజాతులు విద్యావంతులై గౌరవ ప్రదమైన వృత్తులను ఎన్నుకోవాలని, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, న్యాయం కొరకు నిరంతరం పోరాటం సాగించాలని ఇలా ఉత్తేజకరమైన వ్యాసాలు ఆ పత్రికలలో రాస్తూ అహోరాత్రులు వారి ఉద్ధరణకు కృషి సాగించేవారు. డా॥అంబేద్కర్ తన ఉపన్యాసంలో శాసన సభలకు నిమ్న జాతుల ప్రతినిధులను ఆ సంఘాలే ఎన్నుకోవాలని తీర్మానం చేసి ఆమోదింప చేశాడు. డా॥ అంబేద్కర్ లండన్‌లో ఉన్న సమయంలో లండన్ యూనివర్సిటీ లైబ్రరీ, సిటీ లైబ్రరీ, ఇండియా ఆఫీసు లైబ్రరీలలో అనేక పుస్తకాలు చదివారు. లండన్ మ్యూజియం లైబ్రరీని పూర్తిగా చదివిన మూడవ వ్యక్తి డా॥అంబేద్కర్. 1923 జూన్‌లో బొంబాయి వచ్చి న్యాయవాదిగా కొత్త జీవితం ప్రారంభించారు.

నిమ్నజాతుల ఉద్ధరణకు కృషి

1924 జులై 20న బహిష్కృత హితకారిణి సభను స్థాపించాడు. డా॥అంబేద్కర్ ఈ సంఘం ద్వారా నిమ్నజాతుల కొరకు హాస్టల్స్ స్థాపించటం, యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా సరైన మార్గంలో మళ్లించేందుకు లైబ్రరీలు, హాకీ క్లబ్, క్రికెట్ అసోసియేషన్ స్థాపించారు. సభా కార్యక్రమాల ప్రచారం కోసం "సరస్వతీ విలాస్" అనే మాసపత్రికను స్థాపించారు. 1925లో రాయల్ కమిషన్ ఆఫ్ ఇండియన్ కరెన్సీ&ఫైనాన్స్‌కు డా॥అంబేద్కర్ తన అభిప్రాయాలను తెలుపుతూ ఒక పత్రం ఇచ్చారు. ఆయన సేవలను గుర్తించిన బొంబాయి గవర్నర్ 1927 ఫిబ్రవరి 18 న బొంబాయి శాసన మండలి సభ్యునిగా నియమించారు.

1927 మార్చి 19న మహాద్‌లో ప్రసంగిస్తూ అస్పృశ్యులు తమను తాము సంస్కరించుకొని ప్రగతి వైపు ప్రయాణించాలంటే వారి వేష, భాషలను మార్చుకోవాలని, యాచనలుమాని గౌరవ వృత్తులను చేపట్టాలని డా॥అంబేద్కర్ పిలుపిచ్చారు. 20 వ తేదీన డా॥అంబేద్కర్ దాదాపు 10వేల మంది కార్యకర్తలతో ఊరేగింపుగా వెళ్లి చెరువులో దిగి నీటిని తీసుకొని తాగారు. ఇది భారత తొలి సాంఘిక దాస్య విముక్తి పోరాటం. 1927 ఏప్రిల్ 27 న "బహిష్కృత్ భారత్" అన్న మరాఠీ పక్షపత్రికను స్థాపించారు. 1927 డిసెంబర్ 25 న సాంఘిక, ఆర్థిక అసమానతలకు, స్త్రీ బానిసత్వానికి, కుల వివక్షతకు, అంటరానితనానికి కారణమైన "మనుస్మృతి"ని బహిరంగంగా తగలబెట్టాడు. డా॥అంబేద్కర్ 1928 జూన్‌లో బొంబాయి ప్రభుత్వ లా కళాశాలలో ప్రొఫెసర్‌గా చేరి తర్వాత ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. 1929 మే 17 న సైమన్ కమిషన్‌ను కలిసి నిమ్న జాతులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటు చేయాలని నివేదిక సమర్పించారు. 1930 మార్చి 2 న నాసిక్‌లోని కాలారాం దేవాలయంలోనికి అస్పృశ్యుల ప్రవేశం కొరకు 15 వేల మంది కార్యకర్తలతో సత్యాగ్రహం చేశారు. అందులో స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొనటం మహా విశేషం.

1932 ఆగస్టు 14 న డా॥అంబేద్కర్ కోరిక మేరకు బ్రిటీష్ ప్రధాని రామ్సే నికోనాల్డ్ నిమ్న జాతులకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేసే కమ్యూనల్ అవార్డును ప్రకటించారు. ప్రజా ఉద్యమంలో ఊపిరి సల్పక నిరంతరం శ్రమిస్తున్న డా॥అంబేద్కర్‌కు ఏలాంటి ఆటంకం కల్గకుండా భర్త శ్రేయస్సే ధ్యేయంగా తన జీవితాన్ని త్యాగం చేసిన సహధర్మచారిణి రామబాయి 1937 మే 27 న మరణించారు.

ఇండిపెండెంట్ లేబర్ పార్టీ

1936 ఆగస్టులో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని స్థాపించి 1937 ఫిబ్రవరిలో జరిగిన బొంబాయి శాసన సభ ఎన్నికలలో పోటీ చేసిన 17 స్థానాలను దక్కించుకున్నారు. శాసన సభలో అంబేద్కర్ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి బిల్లుల రూపంలో తెచ్చారు. వాటిలో వతందార్, మహిళా మెటర్నీటీ లీవ్, వెట్టి చాకిరి నిషేధం, బాల కార్మికుల నిషేధం, విశ్వవిద్యాలయాల సంస్కరణలు తెచ్చారు. 1938 జనవరిలో డా॥అంబేద్కర్ ఆధ్వర్యంలో రైతు కూలీల ర్యాలీ నిర్వహించారు. బొంబాయి ప్రెసిడెన్సీ నలుమూలల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు వేల సంఖ్యలో హాజరుకాగా బహిరంగ సభలో రైతు కూలీలకు కనీస వేతనం, రైతుల అప్పుల బకాయిలు ఆపుట, కోటి పద్ధతి, ఇనాందార్ పద్ధతి రద్దు చేయాలనే డిమాండ్లతో తీర్మానం చేశారు. 1938 నవంబర్ 7 న జరిగిన సాధారణ సమ్మెను డా॥అంబేద్కర్ వివిధ కార్మిక సంఘాల నాయకులు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు మొదలగు వారితో జయప్రదం చేశారు.

1942 జూన్‌లో వైశ్రాయ్ నూతన కార్యవర్గంలో కార్మికశాఖ మంత్రిగా డా॥అంబేద్కర్‌ను తీసుకున్నారు. చరిత్రలో ఒక నిమ్న జాతీయుడు పదవిని అలంకరించటం మహా విశేషం. ఆయన కార్మిక పగ్రతికి కృషి చేశారు. కార్మికులకు సెలవు దినాలతో వేతనం, వేతనాలతో కూడిన సెలవు, కనీస వేతన చట్టం, బోనస్ చట్టం, యుద్ధ కార్మికులకు టెక్నికల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజ్ ఏర్పాటు, అనేక సంక్షేమ చట్టాలు చేశారు. దేశమంతా పర్యటించి కార్మికుల స్థితిగతులను తెలుసుకున్నాడు.

రాజ్యాంగ చట్ట సభలు

ఇండిపెండెంట్ లేబర్ పార్టీ స్థానంలో షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్‌ను స్థాపించారు. డా॥అంబేద్కర్ బెంగాల్ నుంచి రాజ్యంగ పరిషత్‌కు ఎన్నికయ్యారు. భవిష్యత్తు రాజ్యాంగం ఎలా ఉండాలి, దానిలో నిమ్న జాతులకు ఉండవల్సిన రాజకీయ, ఆర్థిక హక్కులతో ఒక మెమోరాండం తయారు చేశారు. 1947 మార్చిలో రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించారు. 1947 ఆగస్టు 3 న డా॥అంబేద్కర్‌ను జవహార్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో న్యాయ శాఖ మంత్రిగా తీసుకున్నారు. ఆగస్టు 29 న డా॥అంబేద్కర్‌ను రాజ్యాంగ రచనా సభ సభ్యునిగా, ఆ సంఘానికి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. 1950 జనవరి 26 నుంచి నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
సెల్: 8074246685

మంతెనవారిపాలెం పాఠశాల

ఆర్వీ రామారావ్

మంతెనవారిపాలెంలో రెండవ రాజకీయ పాఠశాల 1938 లో జరిగింది. కొత్తపట్నం రాజకీయ పాఠశాలను నిషేధించిన సందర్భంలో 63 మందిని అరెస్టు చేశారు. ఇలా అరెస్టు అయిన వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన బస్వారెడ్డి శంకరయ్య, పూసపాటి నరసింహరాజు, రావి ఆదిశేషయ్య, బీరం రామనాథం మొదలైన వారు ఉన్నారు. వీరంతా మంతెనవారి పాలెం రాజకీయ పాఠశాలకు కూడా హాజరయ్యారు. నెల రోజులు జరిగిన ఈ పాఠశాలకు హాజరైన వారిలో జీసీ కొండయ్య, అరిశ సుందర రాజన్ కూడా ఉన్నారు. ఈ పాఠశాలకు కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకులు కూడా హాజరయ్యారు. అక్కడే సీపీఐ కేంద్ర కమిటీ సమావేశం కూడా జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజులు కమ్యూనిస్టు సిద్ధాంతాలు వివరించి ఎక్కువ మంది కార్యకర్తలను తయారు చేసిన మొదటి రాజకీయ పాఠశాల కూడా ఇదే. మరుసటి సంవత్సరం మైపాడులో జరిగిన రాజకీయ పాఠశాలలో ప్రజా సమస్యలు, ప్రజల్లో పని చేసే విధానంపై తరగతులు నిర్వహించారు. మైపాడు పాఠశాలకు ఎస్.వి.ఘాటే హాజరయ్యారు. వరసగా మూడేళ్లు నిర్వహించిన ఈ రాజకీయ పాఠశాలలు కార్యకర్తల్లో నూతనోత్సాహం కలిగించడమే కాక చైతన్యం కలిగించాయి.

మొదట 1938లో కూడా కొత్తపట్నంలోనే రాజకీయ పాఠశాల నిర్వహించాలనుకున్నారు. కానీ 1937లో ఏర్పడిన నడమంత్రపు మంత్రివర్గం విధించిన నిషేధాన్ని కాంగ్రెస్ మంత్రివర్గం కూడా తొలగించకపోవడంతో కర్నూల్ జిల్లా బుగ్గలో పాఠశాల నిర్వహించాలనుకున్నారు. కానీ బుగ్గలో ఎండలు తీవ్రంగా ఉండడంతో గుంటూరు జిల్లాలో సముద్రానికి దగ్గరగా ఉన్న మంతెనవారిపాలెంలో పాఠశాల నిర్వహించారు. 1938 ఏప్రిల్ ఆరు నాటి నవశక్తి పత్రికలో ఈ పాఠశాల రాష్ట్ర కాంగ్రెస్, యువజన సంఘం, విద్యార్థి సమాఖ్య అధీనంలో నిర్వహిస్తారని తెలియజేశారు. మంతెనవారిపాలెం పాఠశాలకు కూడా యువతీ యువకులు ఉత్సాహంగా హాజరయ్యారు. వివిధ దేశాలు స్వాతంత్ర్యం ఎలా సంపాదించింది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు సంవత్సరం కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు ఆర్గనైజర్‌గా ఉన్న అన్నాప్రగడ కామేశ్వరరావునే మళ్లీ ఆర్గనైజర్‌గా నియమించారు. కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు పబ్లిసిటీ ఆఫీసరుగా ఉన్న వాసిరెడ్డి శివలింగ ప్రసాద్ ఈ పాఠశాలలో కూడా అదే బాధ్యత నిర్వర్తించారు. పాఠశాలకు 250 మందికన్నా ఎక్కువ మందిని అనుమతించకూడదని కూడా నిర్ణయించారు. డాక్టర్ అధికారి, డాంగే, డా. అష్రాఫ్, జడ్ఏ అహమద్, పీసీ జోషి, అజయ కుమార్ ఘోష్, సజ్జాద్ జహీర్, ఆచార్య ఎన్జీ రంగా, డా. పట్టాభి సీతారామయ్య అధ్యాపకులుగా వ్యవహరించారు.

మంతెనవారిపాలెం రాజకీయ పాఠశాలకు గుంటూరు జిల్లా కాంగ్రెస్ సకలవిధ సహాయం అందజేసింది. గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ పాఠశాల నిర్వహణకు రూ.200 విరాళం కూడా అందజేసింది. ఈ పాఠశాలను ప్రారంభించాలని జవహర్ లాల్ నెహ్రూను ఆహ్వానించాలని అనుకున్నారు. కానీ అది సాధ్యమైనట్టు లేదు. ఈ పాఠశాల నిర్వహణకు రూ. 3000 ఖర్చు అవుతుందని, ధన వస్తు రూపేణా సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పాఠశాల విద్యార్థుల వసతి కోసం గ్రామస్థులు తాము నివసించే ఇళ్లను ఖాళీ చేసి ఇచ్చారు. చిన్న దుకాణం కూడా ఏర్పాటు చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా రెండు ఇళ్లు కేటాయించారు. రాజనీతి శాస్త్రం, మార్క్సిస్టు రాజనీతి, తత్వశాస్త్రం, అర్థశాస్త్రం మొదలైన అంశాలను బోధించారు. ఇతర రాష్ట్రాల నాయకులు చెప్పే పాఠశాలలు, మామూలు ఉపన్యాసాలు కూడా కొనసాగాయి.

సంస్థాన ప్రజలు-వారి ఉద్యమం, దేశంలో కార్మికోద్యమం, కార్మిక శాసనాలు, బీహార్ రైతు పోరాటం, రష్యా విప్లవం, చైనా విప్లవం, యుద్ధ వ్యతిరేక పోరాటం, సామ్యవాద సూత్రాలు, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం, కమ్యూనిజం లాంటి అనేకానేక అంశాలపై తరగతులు నిర్వహించారు. రాజకీయ తరగతులను స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల అవగాహనా స్థాయిని బట్టి కూడా వేర్వేరు తరగతులు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలకు పులుపుల శివయ్య ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఆయన పాఠాలు కూడా బోధించారు. కంభంపాటి సత్యనారాయణ (సీనియర్) తో పాటు కంభంపాటి జూనియర్, సీవీకే రావు, చంద్ర రాజేశ్వరరావు, వెంకటాచారి, అమరవాద కృష్ణమూర్తి, జొన్నలగడ్డ రామలింగయ్య అధ్యాపకులుగా ఉన్నారు.

కేంద్ర నాయకులు డాంగే, పీసీ జోషి, రణదివే, అజయ్ కుమార్ ఘోష్, డా.అధికారి, సోమనాథ్ లాహిరి, ఎస్వి ఘాటే లాంటి వారు ఉపన్యాసాలిచ్చారు. కొత్తపట్నంలోనే రెండవ ఏడాది కూడా రాజకీయ పాఠశాల నిర్వహించడానికి ప్రభుత్వం అంగీకరించనందువల్ల మంతెనవారిపాలెంలోనే నిర్వహించాల్సి వచ్చింది. ఆ గ్రామంలో ఎక్కువ మంది రైతులు జైలు శిక్ష అనుభవించినవారే.

అకాలీ దళ్ అధ్యక్షుడిగా మళ్లీ బాదల్

అమృత్‌సర్: శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడిగా సుఖ్బీర్ సింగ్ బాదల్ తిరిగి ఎన్నికయ్యారు. పంజాబ్, అమృత్‌సర్‌లో శనివారం జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో భాగంగా ఆయన ఎన్నిక జరిగింది. బాదల్ పేరును పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బల్బీర్ సింగ్ భూందర్ ప్రతిపాదించగా, మరొక నేత పరంజీత్ సింగ్ శర్మ బలపరిచారు. శ్రీ దర్బార్ సాహిబ్ కాంప్లెక్స్‌లోని తేజా సింగ్ మసుందరీ హాల్‌లో అకాలీ దళ్ నూతన అధ్యక్షుడి ఎన్నిక కోసం సమావేశాన్ని నిర్వహించారు. బాదల్ భార్య, భటిండా ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్, మాజీ మంత్రులు విక్రమ్ సింగ్ మజీతియా, దల్జీత్ సింగ్ చీమా, సీనియర్ నేత మహేశ్ ఇందర్ సింగ్ గ్రేవల్ హాజరయ్యారు. 2024 నవంబరు 16న పార్టీ అధ్యక్షుడిగా బాదల్ రాజీనామా చేశారు. దానిని జనవరిలో పార్టీ వర్కింగ్ కమిటీ ఆమోదించింది. కాగా, 2007 నుంచి 2017 వరకు అకాలీ దళ్, ఆ పార్టీ నేతృత్వ ప్రభుత్వం చేసిన తప్పిదాలకుగాను బాదల్‌ను 'తనఖైయా' (మతపరమైన దుష్ప్రవర్తన నిందితుడు)గా అకాలీ తక్త్ ప్రకటించింది. దీంతో పార్టీ అధ్యక్షుడి హోదాకు సుఖ్బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేశారు.

21న భారత్‌కు వాన్స్, వాల్ట్జ్

న్యూఢిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైఖెల్ వాల్ట్జ్ ఈనెల 21న భారత్‌లో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతుండటంతో ప్రపంచ దేశాలతో అగ్రరాజ్యం సంబంధాలు ప్రభావితం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో వాన్స్, వాల్ట్జ్ భారత్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. భారత్‌తో సంబంధాలపై అమెరికా దృష్టి పెట్టడాన్ని ఇది ప్రతిబింబిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాన్స్, వాల్ట్జ్ వేర్వేరుగా భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. వీరు 22వ తేదీ నుంచి రెండు రోజులు సౌదీ అరేబియాలో పర్యటిస్తారు. సౌదీ వెళ్లే ముందు భారత ప్రధాని మోదీని ఈ ఇద్దరు కలుస్తారని సమాచారం.

ఢిల్లీలో దుమ్ము తుపాను

విమాన రాకపోకలకు అంతరాయం

న్యూఢిల్లీ: ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దుమ్ము తుపానుతో 205 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. 50 విమానాలను దారిమళ్లించారు. దీంతో అక్కడ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలువురు విమాన ప్రయాణికులు ఎక్స్ వేదికగా తమ ఆవేదనను వ్యక్తంచేశారు. దేశ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో దుమ్ము తుపానుతో పాటు మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీని కారణంగా కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. బలమైన ఈదురుగాలులు వీయడంతో దాదాపు 50 విమానాలను దారి మళ్లించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. దాదాపు 12 గంటలుగా విమానాశ్రయంలోనే వేచి చూసినట్లు ఒక మహిళ పేర్కొన్నారు. 'ముంబై వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చాం. ఉదయం 12 గంటలకు బుక్ చేసుకున్న విమానం కాకుండా మరొకటి ఎక్కాలని అధికారులు సూచించారు. అది ఎక్కాక అందులోనే 4 గంటల పాటు కూర్చోబెట్టి తర్వాత దింపేశారు' అని ఒక ప్రయాణికుడు తెలిపారు.

బెంగాల్‌లో 'వక్ఫ్' మంటలు

చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు హింసాత్మకం

ముగ్గురి హత్య - 110 మంది అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 'వక్ఫ్' మంటలు మండుతున్నాయి. విద్యార్థులు, మైనారిటీలు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని అంగీకరించే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. ఈ చట్టాన్ని ఉపసంహరించే వరకు ఆందోళన ఆగదని ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు మిన్నంటాయి. దీంతో ముర్షిదాబాద్‌లో శనివారం ముగ్గురిపై దుండగులు కత్తితో దాడి చేసి హతమార్చారు. ఈ వివరాలను ఐపీఎస్ అధికారి తెలిపారు. మృతులు తండ్రీ కొడుకలని, షంషేర్‌గంజ్‌లోని జాఫ్రాబాద్‌లో ఉండే వీరి ఇంటిలోకి కొందరు చొరబడి, వీరిద్దరిని కత్తితో పొడిచి పరారయ్యారని చెప్పారు. ఆసుపత్రికి తరలిస్తే తండ్రీకొడుకులు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. తమ ఇంటిని లూటీ చేసిన కొందరు ఈ దారుణానికి పాల్పడినట్లు బాధిత కుటుంబం వాపోయింది. అదే ప్రాంతంలో జరిగిన వేరొక ఘటనలో ధులియన్‌లో నివాసముండే వ్యక్తికి బుల్లెట్ గాయమైందని అధికారి చెప్పారు. వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా మాల్దా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లోనూ నిరసనలు, రహదారుల దిగ్బంధనం సాగింది. తమను అడ్డుకునేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై ఆందోళనకారులు రాళ్లురువ్వారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఇదే క్రమంలో 110 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. హింస కారణంగా ముర్షిదాబాద్ జిల్లాలో నిషేధాజ్ఞలు అమలు చేసి, ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తిచెందే వదంతులను పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘర్షణ సమయంలో ఆందోళనకారులపై కాల్పుల్లో గాయపడిన 10 మంది పోలీసులు...ఓ యువకుడిని ఆసుత్రికి తరలించినట్లు వెల్లడించారు.

మమత ప్రభుత్వ వైఫల్యం: బీజేపీ

పరిస్థితిని అదుపు చేయడంలో మమత ప్రభుత్వం విఫలమయిందని బీజేపీ విమర్శించింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అవసరమైతే కేంద్రం సహాయం తీసుకోవాలని సూచించింది. ఇది నిరసన చర్యగా కనిపించట్లేదని, సమాజంలోని ఇతర వర్గాలలో గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికి దుష్టశక్తులు చేస్తున్న ప్రయత్నాలని ఆరోపించింది.

వక్ఫ్ చట్టాన్ని అమలు చేయం

మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో కొత్త వక్ఫ్ చట్టాన్ని అమలు చేయమని సీఎం మమతా బెనర్జీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయని, వక్ఫ్ చట్టాన్ని కేంద్రం రూపొందించిందని, దీనికి సమాధానాలు కేంద్రమే ఇస్తుందని ఆమె అన్నారు. అన్ని మతాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని, అందరూ శాంతియుతంగా ఉండాలని, మతం పేరుతో విద్వేషాలకు పాల్పడవద్దు అని, ప్రతి ఒక్కరి జీవితం విలువైందని, రాజకీయాల కోసం అల్లర్లు సృష్టించవద్దు అని, హింసను ప్రేరేపించి సమాజానికి హాని చేయవద్దు అని ఆమె తెలిపారు. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్‌లోని పలు జిల్లాలో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. మాల్దా, ముర్షీదాబాద్, సౌత్ 24 ప్రగనాస్, హూగ్లీ జిల్లాల్లో ఈ ఆందోళనలు చేపట్టారు. అనేక వాహనాలు, పోలీసు వ్యాన్లకు నిప్పుపెట్టారు. భద్రతా దళాలపై రాళ్లు రువ్వారు. చట్టాన్ని మనం చేయలేదని, కేంద్రమే ఆ చట్టం చేసిందని, మీరు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ సమాధానాన్ని రాబట్టాలని ఆమె అన్నారు.

కుటుంబ వ్యవస్థలో పరివర్తన

జస్టిస్ నాగరత్న

బెంగళూరు: దేశంలో కుటుంబ వ్యవస్థ శరవేగంగా పరివర్తన చెందుతోందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీవీ నాగరత్న శనివారం వ్యాఖ్యానించారు. ఈ మార్పులతో కుటుంబాలపై, న్యాయ వ్యవస్థపై ప్రభావం పడుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి విద్య, పట్టణీకరణ పెరగడం, కార్మిక వర్గ చైతన్యం, విద్య ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యత ఇందులో భాగమేనని జస్టిస్ నాగరత్న అన్నారు. చట్టం కూడా ఈ పరివర్తనానికి దోహదమవుతున్నట్లు తెలిపారు. జస్టిస్ నాగరత్న శనివారం బెంగళూరులో దక్షిణ జోన్ ప్రాదేశిక సదస్సులో 'కుటుంబం: భారతీయ సమాజం ఆధారం' అంశంపై ప్రసంగించారు. సమాజంలో ప్రాథమిక వ్యవస్థగా కుటుంబానికి అనాదిగా గుర్తింపు ఉన్నదన్నారు. 'కుటుంబం...మన గతానికి, భవిష్యత్‌కు ఇది వారధి' అని నొక్కిచెప్పారు. మహిళలకు విద్యతోనే సామాజిక-ఆర్థిక స్వాతంత్ర్యం వస్తుందని, దీనిని సానుకూలంగా పరిగణించాలని, ప్రోత్సహించాలని జస్టిస్ నాగరత్న సూచించారు. విద్యావంతులు, ఆర్థిక స్వతంత్రులుగా మహిళలు తమ కుటుంబాలు, సమాజానికే కాదు జాతికి దోహదమవుతారన్నారు. ఫామిలీ కోర్టుల్లో కేసులు పేరుకుపోతుండటాన్ని ప్రస్తావిస్తూ రెండు వైపుల నుంచి చర్యలు ఉన్నప్పుడే కుటుం కలహాలు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. సమాజం ఆలోచనా విధానంలో మార్పు అవసరమని, అప్పుడే ఫామిలీ కోర్టులపై భారం తగ్గుతుందన్నారు. ఫ్యామిలీ కోర్టుల్లో శిక్షితులైన మధ్యవర్తులు లేదా మధ్యవర్తులుగా రిటైర్డ్ జడ్జిలు ఉంటే కుటుంబ కలహాలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని అభిప్రాయపడ్డారు. లేకపోతే వంట బాగోలేదని, సమయానికి తయారు కావడం లేదంటూ చిన్న తగదాలు కూడా కోర్టు కేసులుగా మారి విడాకులకు దారితీస్తాయని, దీంతో పిల్లలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. వేర్వేరు కోర్టుల చుట్టూ తిరగడంతో ఆయా కుటుంబాలు దెబ్బతింటాయని జస్టిస్ నాగతర్న ఆందోళన వ్యక్తంచేశారు. కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉండిపోతుండటం పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. దశాబ్ద కాలంలో 40 శాతం వైవాహిక బంధాలు తెగిపోయాయని చెబుతూ... పెరుగుతున్న విడాకుల కేసులకు సరిపడ ఫ్యామిలీ కోర్టులు దేశంలో లేక ప్రిసైడింగ్ అధికారులపై భారం అధికమవుతున్నట్లు తెలిపారు. పరిమిత ఆర్థిక వనరులు, అరకొర మౌలిక వసతులతో ఫ్యామిలీ కోర్టుల పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తుండటంతో న్యాయం ఆలశ్యమవుతున్నట్లు జస్టిస్ నాగరత్న వెల్లడించారు.

ముగ్గురు ఉగ్రవాదుల హతం

జమ్మూ: కిష్త్వార్ జిల్లాలోని చత్రూ ప్రాంతం నైద్గామ్ వద్ద భారత భద్రతా దళాలు ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో భారత భద్రతా దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఉగ్రవాదుల్లో జైష్-ఎ-మొహమ్మద్ కమాండర్ సైఫుల్లా ఉన్నట్లు సమాచారం. చత్రూ ప్రాంతంలో ఉగ్రవాదుల గుంపు కనిపించిన తర్వాత... భారత సైన్యం, పోలీసు దళాలు, పారామిలిటరీ దళాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో ఉగ్రవాదుల నుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలు ఉగ్రవాదుల ఇతర స్థావరాలను కూడా గుర్తించాయి. పాకిస్థాన్ సైన్యం అఖ్నూర్ సెక్టార్‌లోని కేరీ బట్టల్ ప్రాంతంలో కాల్పుల విరమణను ఉల్లంఘించి, భారత సైన్యాన్ని టార్గెట్ చేస్తోంది. దీంతో అప్రమత్తమైన భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఈ కాల్పుల్లో భారత సైనికుడు గాయపడినట్లు సమాచారం. ఉగ్రవాదుల చర్యలను ట్రాక్ చేయడానికి భద్రతా దళాలు, భదేర్వా ప్రాంతంలో నిఘాను మరింతగా పెంచాయి. ఇది సమర్థవంతంగా ఉగ్రవాదుల కదలికలను గుర్తించడానికి, ఆయా ప్రాంతాలపై కంట్రోల్ ఉంచడానికి ఉపయోగపడుతుంది..

సూట్ కేసులో గర్ల్ ఫ్రెండ్

చండీగఢ్: గర్ల్‌ఫ్రెండ్‌ను సూట్‌కేసులో పెట్టి బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్లాలని ఓ విద్యార్థి చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. హర్యానాలోని సోనిపట్‌లో ఉన్న జిందాల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ విద్యార్థి పెద్ద సూట్ కేస్‌తో హాస్టల్‌లోకి వచ్చాడు. అందులో ఏమున్నాయని సిబ్బంది అడగగా దుస్తులు, వస్తువులు ఉన్నాయని చెప్పాడు. అతడి తీరుపై అనుమానం వచ్చిన హాస్టల్ గార్డులు ఓసారి సూట్ కేస్ తెరవాలని కోరారు. అందుకు ఆ విద్యార్థి నిరాకరించాడు. వారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి... సూట్ కేస్ తెరిచి చూడగా, అందులో నుంచి ఓ అమ్మాయి బయటకు రావడంతో అంతా అవాక్కయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ విద్యార్థి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. సూట్ కేసులో ఉన్న అమ్మాయి అదే విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థా లేక బయటనుంచి వచ్చిన వ్యక్తా అనే విషయం తెలియాల్సి ఉంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ వీడియోను చూసిన ఓ వ్యక్తి స్పందిస్తూ..'ఈ మధ్య సూట్ కేసులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నట్టున్నాయి' అంటూ చమత్కరించారు.

నమ్మకద్రోహ కూటమిని తమిళులు సహించరు

ఏఐఏడీఎంకే-బీజేపీ పొత్తుపై స్టాలిన్

చెన్నై: అన్నాడీఎంకే-బీజేపీ కూటమిని 'ఓటమి కూటమి'గా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభివర్ణించారు. తమిళనాడుకు ద్రోహం చేసే 'నమ్మక ద్రోహ కూటమి'ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ సహించరని స్టాలిన్ అన్నారు. తమిళనాడులో బీజేపీతో ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఏఐఏడీఎంకే) పార్టీలు కూటమిగా ఏర్పడిన నేపథ్యంలో స్టాలిన్ ఆ కూటమిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పొత్తు సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై శనివారం స్టాలిన్ స్పందించారు. 'ఏఐఏడీఎంకే-బీజేపీ కూటమి... ఓటమి కూటమి. ఈ కూటమిని తమిళనాడు ప్రజలు పదేపదే భరించారు. అయినప్పటికీ అమిత్‌షా ఈ విఫలమైన కూటమిని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. నిన్న అమిత్‌షా చెన్నై పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడిన తీరు ఆయన పదవికి తగినది కాదు. ఏఐఏడీఎంకే-బీజేపీని ఓ కూటమిగా ఏర్పాటు చేయాలనేది ఆయన ఎంపిక అయినప్పటికీ... ఈ కూటమి ఎందుకు ఏర్పడిందో... ఏ సైద్ధాంతిక పునాదిపై ఏర్పడిందో ఆయన స్పష్టం చేయలేదు. రెండు పార్టీలు సాధారణ కార్యక్రమాలపై కలిసి పనిచేస్తామని మీడియా ముందు చెప్పడం... అస్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోందని స్టాలిన్ అన్నారు. నీట్ పరీక్ష, త్రిభాషా విధానంతో హిందీని బలవంతంగా రుద్దడం, వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఏఐఏడీఎంకే గతంలో ప్రకటించింది. కానీ అమిత్‌షాతో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఐఏడీఎంకే వీటిపై నోరుమెదపలేదు. రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శించడానికి మాత్రమే మీడియా సమావేశాన్ని ఉపయోగించుకున్నట్లు అర్థమవుతోంది' అని స్టాలిన్ అన్నారు. అధికార దాహంతో ఉన్న ఏఐఏడీఎంకే- బీజేపీ కూటమి రాష్ట్ర హక్కుల్ని కాపాడడంలోనూ, తమిళ సంస్కృతిని పరిరక్షించడం వంటి ఆదర్శాలకు వ్యతిరేకం. ఈ కూటమిలోని పళనిస్వామి పదవుల కోరికతో తమిళనాడు ఆత్మగౌరవాన్ని, హక్కుల్ని ఢిల్లీకి తాకట్టుపెట్టి రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించడం ఎవరూ మర్చిపోలేదని స్టాలిన్ అన్నారు. నిన్న జరిగిన మీడియా సమావేశంలో నీట్ అంశంపై జర్నలిస్టులు అమిత్‌షాని పదేపదే ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం ఇవ్వలేకపోయారు. నీట్ వల్ల తమిళనాడులో 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. బీహార్‌లోనూ కొంతమంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీనిపై అమిత్‌షా ఏం సమాధానం చెబుతారు? ఐదు రాష్ట్రాల్లో నీట్ సంబంధిత కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తు చేస్తోందని, ఈ కేసుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులను అరెస్టు చేశారని అమిత్‌షాకు తెలుసా అని స్టాలిన్ ప్రశ్నించారు. సిబిఐ ఎవరి నియంత్రణలో ఉంది. ఆ సంస్థను దర్యాప్తు చేయనివ్వండి. అప్పుడే నీట్‌ను వ్యతిరేకించడం దృష్టి మరల్చే చర్యనా లేక వైద్య విద్యను పరిరక్షించడానికి చట్టబద్ధమైన వైఖరిని తీసుకున్నామా అని షా నిర్ధారించగలరని స్టాలిన్ అన్నారు.

బొమ్మ తుపాకీతో బ్యాంకు దోపిడీకి యత్నం

కోల్‌కతా: అప్పులపాలు కావడంతో ఇంటి రుణం తీర్చే మార్గం లేక ఓ వ్యక్తి బొమ్మ తుపాకీతో బ్యాంక్ దోపిడీకి యత్నించి అడ్డంగా దొరికిపోయిన సంఘటన పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగింది. వివరాల్లోకి వెళితే... దలీమ్ బసు (31) పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. జాతీయ బ్యాంకు నుంచి హౌస్ లోన్ తీసుకున్నాడు. అప్పులపాలు కావడంతో వాయిదాలు చెల్లించలేకపోయాడు. తన అప్పులు, ఇంటి రుణం నుంచి బయటపడేందుకు ఏకంగా ఆ బ్యాంకును దోచుకోవాలని బసు ప్రణాళిక రచించాడు. శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయంలో సర్వే పార్క్ ప్రాంతంలోని బ్యాంకులోకి ప్రవేశించాడు. టాయ్ గన్ బయటకు తీసి బ్యాంకు సిబ్బంది, కస్టమర్లను బెదిరించాడు. వారి వద్ద ఉన్నవన్నీ తనకు ఇచ్చేయాలని డిమాండ్ చేశాడు. మరోవైపు బసు చేతిలో ఉన్నది పేలని బొమ్మ తుపాకీ అని బ్యాంకు మేనేజర్, కస్టమర్లు గ్రహించారు. దీంతో అతడిని వెనుక నుంచి పట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకుని అక్కడకు వచ్చిన పోలీసులకు బసును అప్పగించారు. దీంతో అతడిని అరెస్ట్ చేశారు. టాయ్ గన్‌తోపాటు ఒక కత్తిని కూడా బసు నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వాట్సప్ సేవలకు అంతరాయం

న్యూఢిల్లీ: మెటాకు చెందిన ప్రముఖ మెసెంజర్ యాప్ వాట్సప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. భారత్‌లోని యూజర్లు యాప్‌ను ఉపయోగించడంలో అవాంతరం ఎదుర్కొంటున్నారు. వాట్సప్ సందేశాలు వెళ్లడం లేదని, స్టేటస్‌లు అప్‌లోడ్ కావడం లేదని యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం... 81 శాతం మంది మెసేజులు పంపడంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. వాట్సప్ దీనిపై అధికారికంగా స్పందించలేదు. మెటాకే చెందిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవల్లోనూ అంతరాయం ఎదుర్కొంటున్నట్లు పలువురు యూజర్లు తెలిపారు. ఉదయం యూపీఐ సేవల్లో... సాయంత్రం వాట్సప్ సేవల్లో అంతరాయం ఏర్పడడంపై యూజర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

'వక్ఫ్'పై రాహుల్ మౌనమెందుకు

మాయావతి

లక్నో: వివాదాస్పద వక్ఫ్ బిల్లుపై పార్లమెంటులో సుదీర్ఘ చర్చలు జరిగినప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఎందుకని మాట్లాడలేదంటూ బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రశ్నించారు. ఈ అంశంపై ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములు అసహనానికి గురి కావడం... ముస్లింలకు కోపం రావడం సహజమేనన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించినప్పటికీ దీనిపై చర్చలప్పుడు మాట్లాడరాదన్న ప్రతిపక్ష నాయకుడి నిర్ణయం సరైనదేనా? అని ఆమె 'ఎక్స్'లో ప్రశ్నించారు. కొత్త వక్ఫ్ చట్టాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని, అందులోని నిబంధనలను పున:పరిశీలించాలని మోదీ ప్రభుత్వానికి మాయావతి సూచించారు. సంక్షేమం, ప్రభుత్వ ఉద్యోగాలు, విద్య వంటివి మిగతా వర్గాలతో సమానంగా దళితులకు అందించడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలమయ్యాయని విమర్శించారు. రిజర్వేషన్ హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఈ పార్టీల మోసాలను గ్రహించాలని మతపరమైన మైనారిటీలకు పిలుపునిచ్చారు. విద్యుత్ తదితర రంగాల ప్రైవేటీకరణ, ప్రజల సంక్షేమానికి నిజాయితీగా, బాధ్యతగా ప్రభుత్వం వ్యవహరించకపోవడం ఆందోళన కలిగించే అంశాలన్నారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం మంచిది కాదని హితవు పలికారు. వక్ఫ్ చట్టాన్ని పున:పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాయావతి కోరారు.

సంస్థాగత ప్రక్షాళనకు కాంగ్రెస్ శ్రీకారం

న్యూఢిల్లీ: వరుస పరాజయాలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న కాంగ్రెస్ పార్టీ గత వైభవాన్ని తిరిగి సాధించేందుకు పార్టీ సంస్థాగత ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. కిందిస్థాయి నుంచి పార్టీ నిర్మాణ ప్రక్రియ ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ 'సంఘటన్ సుజన్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ముందుగా గుజరాత్‌లో దీనిని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. గుజరాత్‌లోని అన్ని జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల(డీసీసీ) ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలోని మొత్తం 41 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు. ప్రతీ జిల్లాకు ఒక ఏఐసీసీ పరిశీలకుడిని, నలుగురు పీసీసీ పరిశీలకుల బృందాన్ని నియమించారు. ప్రక్షాళన ప్రక్రియ కోసం మొత్తం 43 మంది ఏఐసీసీ పరిశీలకులు, 183 మంది పీసీసీ పరిశీలకుల నియామకం జరిగింది.

వచ్చే మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తొలి సమావేశం జరగనుంది. ఏఐసీసీ సమావేశాల్లో తీసుకున్న విధానపరమైన నిర్ణయం ప్రకారం పార్టీ ప్రక్షాళన ప్రక్రియ చేపట్టింది. గుజరాత్‌లో ఆరావళి జిల్లాలోని మొడాసా పట్టణంలో వచ్చే మంగళవారం (ఏప్రిల్ 15) మధ్యాహ్నం 3 గంటలకు ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులతో తొలి సమావేశం జరుగుతుంది. గుజరాత్ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ సెక్రటరీలు, వారికి కేటాయించిన జోన్లలో తొలి సమావేశం నిర్వహించనున్నారు.

కథక్ నృత్యకారిణి కుముదిని మృతి

అహ్మదాబాద్: ప్రముఖ కథక్ నృత్యకారిణి కుముదిని లఖియా(95) కన్నుమూశారు. అహ్మదాబాద్‌లో శనివారం ఉదయం ఆమె మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుముదిని గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 1930లో జన్మించారు. ఈ నృత్య కళారూపాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు 1967లో అహ్మదాబాద్‌లో కదంబ సెంటర్ ఫర్ డ్యాన్స్ సంస్థను స్థాపించారు. ఇందులో ఆమె చేసిన కృషికిగాను 2025లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. అంతకుముందే పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డును ఆమె అందుకున్నారు. కుముదిని మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ సంతాపం తెలిపారు.

సమాఖ్యవాదాన్ని సుప్రీం గెలిపించింది

కపిల్ సిబల్



న్యూఢిల్లీ: గవర్నర్లు తమ వద్దకు వచ్చే బిల్లులపై నిర్ణయాన్ని నిర్దేశిత కాలంలోగా తీసుకోవాలని, ఇష్టమొచ్చినట్లు పెండింగ్ పెట్టడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. తమిళనాడు వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ శనివారం స్వాగతించారు. సుప్రీం తీర్పు చరిత్రాత్మకమన్నారు. దీంతో సమాఖ్యవాదం గెలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. గవర్నర పాత్రను నిర్వచిస్తూ సుప్రీం తీర్పు వెలువడిందన్నారు. 'సుప్రీం కోర్టు చారిత్రక తీర్పునిచ్చింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గవర్నర్లు ఏకపక్షంగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. శాసనసభల్లో ఆమోదం పొందే బిల్లులపై గవర్నర్లు సంతకం చేసేందుకు మూడు నెలల గడువు విధించింది. అపరిమిత కాలం పెండింగ్ పెట్టడం కుదరదని చెప్పింది. మూడు నెలల్లోగా ఆమోదించడమో-తిరస్కరించడమో జరగాలని గవర్నర్లకు స్పష్టం చేసింది. ఆ బిల్లులు మళ్లీ ఆమోదం పొంది, తమ వద్దకు వస్తే నెలరోజుల్లోగా ఆమోదించాలని సూచించింది. గవర్నర్లకు డెడ్‌లైన్ వర్తించదన్న అటార్నీ జనరల్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. సమాఖ్యవాదాన్ని గెలిపించేలా తీర్పునిచ్చింది' అని సిబల్ అన్నారు.

మొరాయించిన గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం...

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల సేవలకు శనివారం అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులు సక్రమంగా జరగలేదు. యూపీఐ మొరాయిస్తుండడంతో ఆన్‌లైన్ ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, ఆసుపత్రులు, హోటళ్ల వద్ద యూపీఐ చెల్లింపులు నిలిచిపోయాయి. ఒకవేళ చెల్లింపులు జరిపినా ఎర్రర్ లేదా పెండింగ్ అని చూపిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా యూపీఐ సమస్యలు వస్తున్నట్లు సోషల్ మీడియా యూజర్ల ద్వారా స్పష్టమవుతోంది. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం ద్వారా బిల్లు చెల్లింపుల సమస్య రావడంతో.. అందరూ నగదు అడుగుతున్నారు. దీంతో కొందరు కస్టమర్లు వెనుదిరిగి పోవాల్సి వస్తోంది. డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ద్వారా యూపీఐ పేమెంట్ సమస్యలు వెల్లడయ్యాయి. చెల్లింపులు చేయడంలో సుమారు 66 శాతం మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 34 శాతం మందికి నిధులు బదలాయించడం కష్టంగా మారింది. బ్యాంకులు, యాప్‌ల్లో ఈ సమస్య తలెత్తింది. అయితే ఏ కారణం చేత యూపీఐ చెల్లింపులు నిలిచిపోయాయో ఇంత వరకు స్పష్టం కాలేదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కానీ దిగ్గజ యూపీఐ ప్లాట్‌ఫామ్స్ కానీ దీనిపై వివరణ ఇవ్వలేదు.

విశాలాంధ్ర హైదరాబాద్

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు శనివారం అల్వాల్ మండల పార్టీ ఆధ్వర్యంలో వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కార్యదర్శి కే.సహదేవ్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ హాజరై వక్ఫ్‌బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని, కేంద్రంలో నరేంద్ర మోడీ అవలంభిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి నరసింహులు, మైనార్టీ జిల్లా అధ్యక్షులు సల్మాన్ పేజ్, సిపిఐ పార్టీ అల్వాల్ మండల సహాయ కార్యదర్శి పి.చంద్రయ్య, మల్కాజిగిరి మండల సహాయ కార్యదర్శి అశోక్, ఏఐటీయుసి నాయకులు బి.నరేంద్ర చారి, యాప్రాల్ శాఖ కార్యదర్శి వై.వెంకటేష్, గిరిజ, వెంకటరమణ, ఎండి ఇమ్రాన్, ఎస్.కె అజీజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మూడు చింతలపల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులను సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం కలసి వారి న్యాయమైన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారి వేతన బకాయిలను విడుదల చేసి సమ్మెను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అలసత్వం ప్రదర్శించటం సరికాదన్నారు. పంచాయితీ కార్మికులు ఐదు నెలలు జీతం లేకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఐదు నెలల జీతాలు తీసుకుండా ఉంటార అని ఆయన ప్రశ్నించారు. పంచాయతీ కార్మికుల సమ్మె వల్ల గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను పంచాయతీ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమ్మెను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ప్రతి కార్మికుడికీ రావాల్సిన రూ.9,500, గ్రామ పంచా యతీ నుంచి ఇవ్వాల్సిన రూ.3వేలను కలిపి ఐదు నెలల బకాయిలను సత్వరమే ఇవ్వడానికి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎం) ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేస్తుందన్నారు. ట్రెజరీ నుంచి రావాలని అధికారులు చెప్పడం సరికాదనీ, జనరల్ ఫండ్ల నుంచైనా కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏ.అశోకు, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కిష్టప్ప పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి



విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఛలో వరంగల్ ఎల్కతుర్తిలో జరగబోయే బిఆర్ఎస్ పార్టీ రజోత్సవ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసేందుకు మల్కాజి గిరి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9-30 గంటలకు మల్కాజిగిరిలోని లక్ష్మీ సాయి గార్డెన్‌లో ప్రారంభం కానుందని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఉద్యమ కారులు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు అనుబంధ సంఘాల నేతలు, యువత, మహిళామణులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మండల్ అవార్డుల ప్రదానోత్సవానికి ఆర్ కృష్ణయ్యకు ఆహ్వానం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిజాం కాలేజ్ కి ఎదురుగా బీపీ మండల్ అవార్డ్స్‌ను ప్రదానం చేసే ముఖ్య కార్యక్రమం యాదవ రాజ్యాధికారం సాధన సమితి, బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల్ అవార్డ్స్‌ను ప్రదాన చేసే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా తెలుగు రెండు రాష్ట్రాల ఉద్యమ నాయకుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యను అవార్డు ఫంక్షన్స్‌కు సాదరంగా ఆహ్వానించడం జరిగింది. బీసీ ఆరాధ్య దైవం బీపీ మండల్ బీహార్ ముఖ్యమంత్రి యే కాకుండా బీసీలకు సంక్షేమ పథంగా సామాజిక న్యాయం అభివృద్ధి కోసం వీపీ సింగ్ ప్రభుత్వానికి 40 సిఫార్సులను నివేదించడం గొప్ప విశేషం అందులో భాగంగా మూడు సిఫార్సులను ఇంప్లిమెంట్ కూడా చేయడం జరిగింది. మేమెంతో మాకు అంత మన ఓటు మనం వేసుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారమైన బీసీలు 50శాతం ఉన్నారు. అధికారం మనదే. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం మేరకు 42శాతం స్థానిక ఎన్నికలు మున్సిపల్ జిహెచ్ఎంసి అన్నింటా రిజర్వేషన్ కల్పించాలని బేరి రామచంద్ర యాదవ్ ప్రభుత్వాలకు డిమాండ్ చేయడం జరిగింది. ఆహ్వాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక బేరి రామచంద్ర యాదవ్‌తో పాటు బీసీ సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు ఒంగూరు శ్రీనివాస్ యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్నముదిరాజ్, శేరిలింగంపల్లి సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ యాదవ్, రామకృష్ణ గౌడ్ మాధవరావు విజయ్ మధు కోటేశ్వరరావు కృష్ణ ఈశ్వర్ నరేష్ పెద్దలు అభిమానులు కార్యకర్తలు పాల్గొని ఆర్ కృష్ణ అన్నను ఆహ్వానించడం జరిగింది.

కేటీఆర్ ఆరోపణల్లో వాస్తవం లేదు

ఎంపీ చామల కిరణ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెచ్‌సీయూ విషయంలో ఏదో జరిగిపోయింది అందులో వున్న భారీ కుంభకోణం వెలికితీసి భయటపెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొండంత రాగం తీసి పాట కూడా పాడలేకపోయ్యాడని భువనగిరి ఎంపీ.చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవ చేశారు. అయన ఏదో హైడ్రోజన్ బాంబు పేలుస్తామనే స్థాయిలో బిల్డప్ ఇచ్చి చివరకు అది ఉల్లిగడ్డ బాంబు అంత కూడా పేలలేదని వ్యాఖ్యానించారు. కేవలం కుట్రపూరితంగా ప్రభుత్వం మీద కేటీఆర్ బురద చల్లుతున్నారనే విషయం అయన మాట్లాడే మాటల్లోనే అర్థం అవుమతుందన్నారు.

శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చిందని కేటీఆర్ చెప్పారని టీజీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 37మంది బాండ్లు కొన్నారని అయన పేర్కొన్నారు. అలా కొనుకున్న బాండ్ల పైసలు అన్ని ఐసీఐసీఐలోని టిజిఐఐసీలో పడ్డాయని వెల్లడిరచారు. ఓవైపు కేటీఆర్ ఏమో భూమి విలువ రూ.5200 కోట్లు అంటారు మరోవైపు అయన శిష్యుడు రూ.20 వేల కోట్లు అంటారని అసలు ఎవ్వరి మాటలు నమ్మాలో కూడా అర్థం కావడం లేదన్నారు. లిటికేషన్ ల్యాండ్‌కు ఐసీఐసీఐ బ్యాంకు లోన్ ఎలా ఇచ్చిందని కేటీఆర్ విలేఖరుల సమావేశంలో ప్రశ్నించారని అయితే ఇక్కడ కేవలం బాండ్ల పై వచ్చిన డబ్బులే మాకు బ్యాంకు ఇచ్చిందనే విషయం అయన గ్రహించాలని సూచించారు. ఇక్కడే ఆ భూములు హెచ్‌యూవి లేదా అటవీ భూములు కావనే విషయం చాలా స్పష్టంగా అర్థం అవుతుందని చెప్పారు. సామాన్య ప్రజలను తప్పుతోవ పట్టించాలని చెప్పిన మాటలే తప్ప కేటీఆర్ చేసిన ఆరోపణలో ఏ మాత్రం వాస్తవం లేదని అయన మండిపడ్డారు. పేద ప్రజలు సన్నబియ్యం తింటుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోలేక పోతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు గత పదేళ్ళ కాలంలో తెలంగాణను కుక్కలు చింపిన విస్తరాకుగా మారిస్తే మేము దాని కుట్టి అందులో సన్నబియ్యం అన్నం పెడుతుంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు ప్రజలు నమ్మకూడదని అయన సూచించారు. ప్రజలకు ఎక్కడ్కైనా సమస్యలు వున్న తపులు జరిగినా వాటిని మా దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం సిద్దంగా వుందని అన్నారు.

నేటి మహిళలకు కస్తూరిభా జీవితం అదర్శం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళా సాధికారత కోసం కస్తూరిబా గాంధీ చేసిన సేవలు అదర్శనీయమని పలువురు పాశం రాజేందర్ యాదవ్ అన్నారు. కస్తూరిబా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ దర్శన్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గాంధీ డాక్టరేట్, ఇంటర్నేషనల్ గాంధీ అవార్డు గ్రహీత గాంధీ దర్శన్ కార్యదర్శి డా.ప్రసాద్ గొల్లానిపల్లి ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు పాండుగౌడ్, యానిమేషన్ ఫిలం డైరెక్టర్ సీతారాం, రిటైర్డ్ ఎస్బీఐ మేనేజర్ మోహన్‌దాస్, తదితరులు పాల్గొని అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేటి యవత కసూర్బాగాంధీ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ వెంట అమె అనేక స్వాతంత్ర్య ఉద్యమాలలో కూడా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. 1917లో ప్రారంభమైన చంపారామ్ ఉద్యమం నుండి 1942వరకు సాగిన క్విట్ ఇండియా ఉద్యమం వరకు గాంధీజీ వెన్నంటే వుంటూ చివరక గాంధీజీ అరెస్టు అయిన సమయంలో కూడా అమె భయపడకుండా అయన స్థానంలో ప్రసంగాలు చేస్తూ ఉద్యమానిక ముందుకు నడిపారని కొనియాడారు. 1942 అగస్టు 8న రాత్రి బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మాణాన్ని ధృవపరచగా వెంటనే అగస్టు9న ఉదయం బిర్లా హౌస్‌లో వున్న గాంధీజీని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంలో కస్తూర్బాగాంధీ కూడా అయన వెంట వెళ్ళడానికి సిద్దపడిరది. అదే రోజు సాయంత్రం శివాజీ పార్కులో గాంధీజీ మాట్లాడాల్సిన బహిరంగసభలో అమె ప్రసంగించి అందరిలో స్పూర్తిని నింపారు. కస్తూర్బాగాంధీ తరుచూ గుండెనొప్పితో పాటు అస్తమాతో కూడా ఇబ్బందులు పడేవారని గాంధీజీ పర్యవేక్షణలో సుశీలా నాయర్ గాంధీజీ సనర్యాలు చేస్తుండగా తన ఆరోగ్యం క్షిణించసాగింది. చివరకు 1943 డిసెంబర్‌లో కస్తూర్బా గాంధీ గుండెపోటు రావడంతో అమె ఆరోగ్యం క్షిణించి చివరకు ఫిబ్రవరి 22న మహాత్ముని ఒడిలోనే తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ సినీనటి ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులను ఓ వ్యక్తి బెదిరించారు. వివరాల ప్రకారం చంద్రక్రిరణ్‌రెడ్డి అనే వ్యక్తి విజయశాంతి దంపుతులను బెదిరించినట్లు విజయశాంతి భర్త శ్రీనివాస్ శనివారం నాడు బంజారహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గతంలో విజయశాంతి బీజేపీలో పనిచేసిన సమయంలో చంద్రకిరణ్‌రెడ్డి అమె సోషల్ మీడియా అకౌంట్స్‌ను చేసుకునే వారని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే గత ఎన్నికల సమయంలో అమె కాంగ్రెస్ పార్టీలో చేరిన క్రమంలో చంద్రకిరణ్‌రెడ్డిని అమె పక్కకు పెట్టడం జరిగింది. ప్రస్తుతం తనకు డబ్బులు చెల్లించాలని లేదంటే మీ అంతుచూస్తామని చంద్రకిరణ్‌రెడ్డి విజయశాంతికి తరుచు బెదిరింపు మేసేజస్ పెడుతున్నట్లు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ధర్యాప్తు చేపట్టారు.

దూదేకులకు అధిక నిధులు ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం కింద నూర్బాన్ దూదేకుల బీసీ బి మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర దూదేకుల ఆధ్యక్షులు మహ్మద్ అజీమొద్దిన్ కోరారు. శనివారం నాడు హజ్‌హౌస్‌లో మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్‌ను కలిసిన అయన వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువవికాసం ద్వారా మైనారిటీలకు రూ.840కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసినందుకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇలా మంజూరు చేసిన నిధులు నూర్బాన్ దూదేకుల బీసీ బి మైనారిటీలకు పెద్ద మొత్తంలో ఇవ్వాలని కోత్వాల్‌ను కోరారు. ఈ సందర్భంగా ఓబేదుల్లా కోత్వాల్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అహ్మద్ హుస్సేన్, గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షులు సమద్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ షాదుల్ల బాయ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజ్ మాహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలి

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : ఎస్.ఏ.డాంగే భవన్‌లో శనివారం బిసి బిల్లును పార్లమెంట్‌లో ఆమోదం చేయాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. విద్యా, ఉపాధి చట్టసభల్లో రిజర్వేషన్ అమలు జరపాలని, మేమెంతో మాకు అంత వాటా గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు వర్తింప చేయాలని, లెక్కలు తేల్తేనే హక్కులు వస్తాయని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. హక్కులు వస్తేనే స్వతంత్రం వస్తుందని, స్వాతంత్ర్యం వస్తేనే రాజ్యాధికారం వస్తుందన్నారు. పార్లమెంట్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని పలువురు డిమాండ్ చేశారు. బీసీ జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయించాలని, అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో బి.సిల గురుంచి ప్రస్తావిస్తూ ఎన్నికల తరువత చెత్త బుట్టలో వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట సభల్లో బీసీల వాటా కోసం బీసీ ఉద్యమాలు బలోపేతం చేయాలి. స్వాతంత్రానికి ముందు బహుజన లెక్కలు ఉన్నాయి. కులగణనపై మొట్ట మొదటిసారి 2010 పార్లమెంట్లో ఏకగ్రివ తీర్మానం చేశారని, 90 శాతం ఉన్న బీసీలపై, 10 శాతం ఉన్నవారు,ఆధిపత్యం చేస్తున్నారని సమావేశం అభిప్రాయపడింది. ఒక పారిశ్రామికవేత్తకి రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసి కేంద్ర ప్రభుత్వం ఆదానికి రుణ విముక్తి చేశారన్నారు. దేశంలోని రైతులకు ఏక కాలంలో రుణ మాఫీలు చేయని పరిస్థితి ఉందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కుల గనన జరపడానికి అనేక సార్లు అధికార పార్టీ వాళ్ళు, అగ్రవర్ణాల వాళ్లు ఆటంకాలు కలిగిస్తున్నారని అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, వృత్తి సంఘాల నాయకులు, బి.సి.రాష్ట్ర నాయకులతో పాటు రాష్ట్ర కార్యదర్శి నాయి బ్రహ్మన సంఘం రసమల్ల బాలకృష్ణ, వంశీరాజ్ సంఘం మాజి అధ్యక్షులు శ్యామల యాదగిరి, బి.సీ. సంక్షేమ సంఘం ఉప అధ్యక్షులు యర్ర శ్రీహరి, రాష్ట్ర గీత పని వారల సంఘం నాయకులు కట్ట ఈశ్వరయ్య, బి.సీ.ఫ్రంట్ ఛైర్మెన్ బొంగు వేంకటేశ్, దండు నిరంజన్, చిక్కుల పద్మ, పి.శ్రీను, జి.కృష్ణ, బి.వెంకటేష్, ఎస్.రాములు, యు.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్స్‌పై చర్చలు జరిపి దీక్షను విరమింపచేయాలి

బీసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశ జనగణనలో కులగణన చేయాలని, చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు మొదలైన డిమాండ్స్ సాధన కోసం బీసీ హిందూ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ 12 రోజులుగా ఢిల్లీలో తెలంగాణ భవన్ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు నిశితంగా విమర్శించారు. శనివారం నిరాహార దీక్షలో ఉన్న సిద్దేశ్వర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని సంఘీభావం తెలియజేశారు. నిరాహార దీక్షలో ఉన్న ఆయన చాలా నీరసంగా ఉన్నాడని, ఆరోగ్య పరిస్థితి క్షీణించక ముందే కేంద్ర ప్రభుత్వం డిమాండ్స్‌పై చర్చలు జరిపి నిరాహార దీక్షను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు పాలకుల విధానాల వలన ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో తీరని అన్యాయానికి గురైనారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జన గణనలో కులగణన జరపాలని చట్టసభలలో 50% రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి అభివృద్ధికి, సంక్షేమానికి చర్యలు చేపట్టాలని, తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగాలలో బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లులు అమలుపరిచేందుకు 9వ షెడ్యూల్డ్‌లో చేర్చేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సిద్దేశ్వర్‌కు ప్రాణాపాయం జరిగితే అందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని వెంకట్రాములు హెచ్చరించారు.

హనుమాన్ దేవాలయంలో కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని తాళ్ళ బస్తీలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ దేవాలయంలో కార్పొరేటర్ వై.ప్రేం కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, కిషోర్, పోచాలు, శివ కుమార్, కృష్ణ, విగ్నేష్, రామాంజనేయులు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ వనజీవి రామయ్యకు టీడీపీ నాయకుల సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఖమ్మం జిల్లా కు చెందిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్ కుమార్ గౌడ్, మీడియా కమిటీ ఛైర్మన్ ప్రకాష్ రెడ్డిలు తమ సంతాపాన్ని తెలియజేశారు. కోటి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు రామయ్య చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన మరణం పర్యావరణ ఉద్యమానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి

రాష్ట్ర సీఎం సహా ప్రముఖుల సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సామాన్యంగా మనం మన పరిసరాల్లో మొక్కలు కనిపిస్తే వాటిని తొలగించేందుకు అనేక వ్యయప్రయాసాలు పడుతుంటాం. కాని వనజీవి రామయ్య మాత్రం అందకు పూర్తిగా భిన్నం. ఎక్కడ్కైన ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకుని తన శేషజీవితం గడిపారు. మనం మన జెబుల్లో ఎప్పుడు ఏదో మనకు అవసరమైన వస్తువులను తీసుకుని వెళ్తుంటాము కాని అయన మాత్రం తన జెబులో నిత్యం వివిధ రకాల విత్తనాలను తీసుకెళ్ళేవారు అంటే అయనకు వృక్ష సంపద మీద ఎంత ప్రేమ వుండేదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇలాంటి గొప్ప వ్యక్తి నేడు మన మధ్యలో లేకుండా పోయ్యారు. పర్యావరణ ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య కన్ను మూశారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. శనివారం నాడు తెల్లవారు జామున ఖమ్మంలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గుండెపోటు కారణంగా ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడిరచారు. వనజీవి అసలు పేరు దరిపల్లి రామయ్య. అతను ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో 1 జులై 1937లో జన్మించారు. విస్తృతంగా మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం, విత్తనాలు - మొక్కలను పంచడం వల్ల వనజీవి రామయ్యగా గుర్తింపు పొందారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణం, మొక్కల పెంపకం పట్ల అయనకు ఆసక్తి వుండేది దీంతో జీవితాంతం కూడా దాన్ని అయన కొనసాగిస్తూ వచ్చారు. చివరకు 80 సంవత్సరాల వయస్సులోనూ అయన విస్తృతంగా మొక్కలను నాటారంటే ఆయనకు పర్యావరణం పై ఎంతగా అసక్తి వుండేదో మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సుమారు కోటికిపైగా మొక్కలను నాటిన అయన సామాజిక అడవుల పెంపకం, అటవీ సంరక్షణ ప్రచారకర్తగా కూడా వ్యవహరించారు. పర్యావరణ రంగంలో ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ తొలిసారిగా 1995లో అయన కృషికి సేవ అవార్డును అందుకున్నారు. అలాగే 2017లో పద్మశ్రీ అవార్డు ఆయనను వరించింది. అప్పటి రాష్ట్రపతి ప్రణభ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ సైతం ఆయన అందుకున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా చెట్లు నాటడాన్ని ఆయనకు అలవాటు. అనేక బంజరు భూములు ఆయన వల్ల హరిత వర్ణాన్ని సంతరించుకున్నాయంటే అతిశయుక్తి కాదు. మనిషి- ప్రకృతి ఎలా ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయో చెప్పడానికి వనజీవి రామయ్య జీవితం ఒక గొప్ప ఉదాహరణ అని చెప్పవచ్చు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా, నిస్వార్థ ఆయన సాగించిన సేవా కార్యక్రమాలు ఆయనను చిరస్మరణీయుడిని చేశాయి.

చివరకు అయన తన మనుమలు, మనుమరాళ్ళకు చందనపుష్ప, హరిత లావణ్య, కబంధ పుష్ప, వనశ్రీ అని మొక్కల పేర్లు పెట్టి పర్యావరణంపైన, మొక్కల పెంపకం పైన ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని, ప్రేమను చాటుకున్నారు. 60 ఏళ్ల వయసులోనూ ఆయన రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల వెంట తిరుగుతూ తన భార్య సమేతంగా మొక్కలు నాటే వారు. ఓ విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరిహారం ఆలోచనకు అయన ప్రేరణ అని కూడా చెప్పవచ్చు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి అయను బ్రాండ్ అంబాసిడర్‌గా పెట్టారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జీవిత చరిత్రను ఆరవ తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశంగా పొందుపరిచింది. మన పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదవ తరగతిలో ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా బోధిస్తుందంటే అయన ఎంతగా పర్యావరణం పై స్ఫూర్తి నింపారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం వనజీవి రామయ్యను స్ఫూర్తిగా తీసుకొని ప్రతిఒక్కరు మొక్కలు పెంచుతూ పర్యావరణ హితానికి పాటుపడితే అదే వనజీవి రామయ్యకు ఇచ్చే గొప్ప నివాళి అవుతుంది.

ప్రముఖుల సంతాపం...

వనజీవి రామయ్య మరణ వార్త తెలిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రముఖులు అయన కుటుంబానికి సంతాపం తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉతమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహా, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఎంపీలు డికె.అరుణ, ఈటెల రాజేందర్, రఘునందన్‌రావు తదితరులు ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఓ మహానీయుని కోల్పోయిందని వారు అన్నారు. వనజీవి రామయ్య మృతి ప్రకృతి ప్రేమికులకు తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. వనజీవి రామయ్య కోటికి పైగా మొక్కలు నాటి రికార్డు సృష్టించారని గుర్తు చేసుకున్నారు. ఆయన పర్యావరణ పరిరక్షణకు అంకితమై ఆరున్నర దశాబ్దాలుగా ఆయన హరిత యాత్రను కొనసాగించారని ఆయన జీవితం భవిష్యత్ తరానికి ఆదర్శమని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పర్యావరణ పరిరక్షణకు అందరూ ప్రతిన భూనాలని విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్యపురస్వామికి 'కథక్ నృత్య' నివేదన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: అన్నమయ్యపురంలో అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అన్నమ స్వరార్చనలో భాగంగా, తొలుత విష్ణు సహస్రనామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరంతో ప్రారంభించగా, ఏ.బి.వి. విద్యార్థులచే గురు స్తుతి (అన్నమ గాయత్రి) పాడగా, అనంతరం ప్రముఖ కథక్ ప్రావీణ్యులు "డా. దివ్య సల్లా సింగ్", "కుమారి లక్ష్మి విశ్వనాథన్" వారి బృందం "సుమన్ గిద్వాని, మాన్సి హిందోచ" సంయుక్తంగా "వందన త్రయి, శివ స్తుతి, మధురాష్టకం, దర్బారి తారానా, నటభైరవ తారానా" అనే సంకీర్తనలకు అద్భుతమైన కథక్ నృత్య ప్రదర్శన అందించారు. అనంతరం కళాకారులకు, డా శోభా రాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నంద కుమార్ జ్ఞాపికను అందించారు. చివరిగా శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి మంగళ హారతి ఇచ్చి వారి తీర్థ ప్రసాదాలతో అన్నమ స్వరార్చన దిగ్విజయంగా ముగిసింది.

రాకేష్‌రెడ్డికి టీజీపీఎస్‌సీ పరువునష్టం దావా నోటీసులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డికి టీజీపీఎస్సీ పరువు నష్టం దావా నోటీసును ఇచ్చింది. గ్రూప్ 1 ఫలితాల విషయంలో తమ పై తప్పుడు ఆరోపణలు చేశారని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డికి టీజీపీఎస్సీ ఈ నోటీసులు జారీ చేశారు. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇచ్చి క్షమాపణలు చెప్పాలని నోటీసులో టీజీపీఎస్సీ డిమాండ్ చేసింది. ఒకవేళ్ళ వారం రోజుల్లో సమాధానం చెప్పనట్టైతే పరువునష్టం కేసులు, ఇతర క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని హెచ్చరించారు. అదే సమయంలో తదుపరి టీజీపీఎస్సీపై రాకేష్ రెడ్డి ఎటువంటి ఆరోపణలు చేయొద్దని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టద్దని ఆంక్షలు విధించారు.

పీర్జాదిగూడ- పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించిన తుంగతుర్తి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ - పర్వతాపూర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి శనివారం ఉదయం రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. విస్తరణలో భాగంగా పలు విద్యుత్ స్తంభాలను తొలగించడం, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ల రీప్లేస్మెంట్ పనులను సంబంధిత అధికారుల సమక్షంలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నత్తనడక నడిచిన రోడ్డు విస్తరణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో శరవేగంగా చురుకుగా సాగుతున్నాయని, పీర్జాదిగూడ పర్వతాపూర్ ప్రజల సౌకర్యార్థం వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ నాణ్యతలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు తుంగతుర్తి రవి ఆదేశించారు. అలాగే ఈ తాటి చెట్ల తొలిగింపునకు సహకరించిన గౌడ సంఘం నాయకులకు, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి.ఇ. లింగయ్య, ఏ.ఇ. సత్యనారాయణ రెడ్డి, లైన్మెన్ భాస్కర్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లస్టర్ అండ్ లెగసీ' సిరీస్‌ని ఆవిష్కరించిన కీర్తిలాల్స్

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతీయ ప్రసిద్ధ జ్యువెలరీ బ్రాండ్ అయిన కీర్తిలాల్స్, ప్రకృతిసిద్ధ వజ్రాభరణాల కళాత్మకతని వేడుక చేసుకునేలా వుండే డిజైన్లతో విశిష్టమైన ఆరు ప్రత్యేక సేకరణలని ప్రదర్శించే గొప్ప సిరీస్‌ని 'లస్టర్, లెగసీ బై కీర్తిలాల్స్' గా ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్‌లో తన 25 సంవత్సరాల ఉజ్వలమైన ఉనికికి గుర్తుగా కీర్తిలాల్స్ సోమాజీగూడ షోరూంలో ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ ఈ మైలురాయికి గుర్తుగా, వజ్రాభరణాలపై కేరట్‌కు రూ. 20,000 వరకూ ప్రత్యేకమైన తగ్గింపును కీర్తిలాల్స్ అందిస్తుందన్నారు. ఈ లస్టర్ అండ్ లెగసీ సిరీస్‌లో ఆరు అద్భుతమైన సేకరణలు వుంటాయని, వీటిల్లో ప్రతి ఒక్కటీ దాని విలాసం, శోభ, కాలాతీత సౌందర్యాలకి ప్రత్యేకమైన కలిగి ఉన్నాయన్నారు. మొత్తంగా ఈ సేకరణలు అన్నీ, చక్కటి ఆభరణాల భవిష్యత్ డిజైన్లతో కలిపి కీర్తిలాల్స్ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాయన్నారు. వీటిల్లో 30,000లకు పైగా సహజసిద్ధమైన వజ్రాభరణాల అద్భుత కళాకౌశలాన్ని ప్రదర్శిస్తున్నామని, అసాధారణ రూపకల్పనల శ్రేణిని చూసేందుకు ఆభరణ ప్రేమికులకు ఇదొక అసమానమైన అవకాశంగా చెప్పారు. కీర్తిలాల్స్ నుంచి అత్యాధునిక వజ్రాన్ని కనిపెట్టే యంత్రాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికత కలిగిన ఈ యంత్రం, వజ్రాల కొనుగోళ్ళలో పూర్తి పారదర్శకతని, ప్రామాణికతని హామీ ఇస్తుందని, తన ఖాతాదారులకి అత్యధిక నాణ్యత కలిగిన సహజసిద్ధ వజ్రాలని మాత్రమే అందించాలన్న కీర్తిలాల్స్ నిబద్ధతని ఇది బలోపేతం చేస్తోందన్నారు. కీర్తిలాల్స్ నిబద్ధతని ప్రతిఫలిస్తూ లస్టర్ అండ్ లెగసీని సమర్పిస్తున్నందుకు సాంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆవిష్కరణలని అందిపుచ్చుకుంటూ సాగిన మా యాత్ర సారాన్ని ఈ సిరీస్ ప్రతిఫలిస్తోందని చెప్పారు.

వక్ఫ్ చట్ట సవరణ చేయడమంటే ముస్లింల హక్కులను కాలరాయడమే

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ చేయడమంటే ముస్లింల హక్కుల కాలరాయడమే కాదని, ఎస్సి, ఎస్టీ, బిసి, అణగారిన వర్గాలకు రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం-2024ను నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, టిపిసిసి ఉపాధ్యక్షులు ఎం.ఆర్.జి. వినోద్ రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, సిపిఐ (ఎం) నాయకులు అబ్బాస్, ఎంబిఎం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ సయ్యద్ జాఫ్రీ, టిజెఎసి నగర ఉపాధ్యక్షులు అఫ్జల్, ఆప్ నేతలు సుధారాణి, విజయ్ మల్లంగి, జావిద్ షరీఫ్, షాబాజ్, నాగరాజు, అజీమ్ బేగ్, అజ్మత్, ఖాన్ తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగానికీ పూర్తిగా విరుద్ధమన్నారు. ఇది భారత లౌకిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా మతాలు, కులాల పేరిట దేశాన్ని విభజించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణకకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కోటి వినతులను స్వీకరించినట్లు చెప్పడం హాస్యస్పదమని, అసలైన భాగస్వాములతో కనీసం చర్చించకుండనే ఏకపక్షంగా వక్ఫ్ చట్ట సవరణను తీసుకువచ్చిందన్నారు. ఏం.ఆర్.జి, వినోద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. బిజెపి చట్ట సవరణ చేసిందని తాము గుడ్డిగా వ్యతిరేకించడం లేదని, సవరణ చట్టం ద్వారా దేశ సమగ్రతకు భంగం వాట్లిలే విధంగా ఉండడంతో దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. వి. హనుమంతరావు మాట్లాడుతూ ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ చట్ట సవరణ పేరుతో అందులో కేంద్ర తల దూర్చడం సరైంది కాదన్నారు. అబ్బాస్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని సిపిఐ (ఎం) పూర్తిగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఈ చట్ట సవరణతో వక్ఫ్ ఎవరైనా భూములు దానం చేయాలంటే మతం మారితే తప్ప సాధ్యం కాదని, అదే వక్ఫ్ మాత్రం ఇతర మతస్తులు ఉండే చట్టసవరణ చేయడం ఎంత దుర్మార్గమే ప్రజలంతా ఆలోచించాలని సూచించారు.

జాఫ్రీ మాట్లాడుతూ కేంద్ర తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం ద్వారా పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములను కొట్టేసేందుకు కుట్రలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బిజెపి రహిత రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వక్ఫ్ చట్టాన్ని అమలు చేయరాదని కోరారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను రద్దు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర - జవహర్ నగర్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అందులో భాగంగా, మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేశంగా మార్చేందుకు కేంద్ర పాలకులు ఉద్దేశ పూర్వకంగా వేస్తున్న ఎత్తుగడలే భాగంగానే ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని విమర్శించారు. ఈ చట్టం ఆస్తుల కబ్జా చేయడానికి తప్ప,వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. ఒకసారి వక్ఫ్ చేయబడిన ఆస్తులను శాశ్వతంగా వక్ఫ్ ఆస్తులు గానే ఉంటాయని వాటి స్వభావాన్ని మార్చే అధికారం ఎవరికి లేదని గతంతో సుప్రీంకోర్టు తీర్పిచ్చినప్పటికీ, దీనికి వ్యతిరేకంగా బిజెపి ఈ చట్టం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, సిపిఐ మూడు చింతలపల్లి మండల కార్యదర్శి తపెట్ల రాములు గౌడ్, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, కాప్రా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోదాసి జయమ్మ, ఏఐటియుసి కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, బి.కే.ఎం.యు మండల అధ్యక్షులు కోదాసు గంగారాం, కీసర మండల సహాయ కార్యదర్శి వి.రవి నాయక్, మహిళా సమాఖ్య నాయకురాలు సి. హెచ్ మాధవి, డి.మల్లిక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కొత్త షోరూమ్‌లతో ఒబెన్ ఎలక్ట్రిక్ గ్రాండ్ ఎంట్రీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారతదేశపు స్వదేశీ మరియు ఆర్‌అండ్‌డి నడిచే ఎలక్ట్రిక్ మోటార్సైకిల్ తయారీదారు ఒబెన్ ఎలక్ట్రిక్, 3 కొత్త షోరూమ్లను ప్రారంభించడంతో తెలంగాణలోకి గణనీయమైన ప్రవేశం చేసింది. హైదరాబాద్ (సికింద్రాబాద్, కొండపూర్)లో 2 వరంగల్‌లో ఒకటి, ఒక్కొక్కటి ప్రత్యేకమైన ఒబెన్ కేర్ సర్వీస్ సెంటర్లను కలిగి ఉన్నాయి. ఈ విస్తరణ దక్షిణ భారతదేశంలో బ్రాండ్ పెరుగుతున్న ఉనికిని బలోపేతం చేస్తుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ మార్కెట్ గుండెలో ఒబెన్ను ఉంచుతుంది. ఆరంభ జ్ఞాపకార్థం, ఒబెన్ ఎలక్ట్రిక్ ప్రారంభ స్వీకర్తల కోసం ప్రత్యేకమైన ఆఫర్ను విడుదల చేసింది. కొత్తగా ప్రారంభించిన ప్రతి షోరూమ్లో ఒబెన్ రోర్ ఈజెడ్‌ను కొనుగోలు చేసే మొదటి 30 మంది వినియోగదారులకు కాంప్లిమెంటరీ బంగారు కాయిను లభిస్తుంది. తెలంగాణ విస్తరణ పై వ్యాఖ్యానిస్తూ, ఒబెన్ ఎలక్ట్రిక్ వ్యవస్థాపకురాలు, సీఈఓ మధుమిత అగర్వాల్ మాట్లాడుతూ, "ఒబెన్ ఎలక్ట్రిక్ పాన్-ఇండియా వృద్ధి ప్రయాణంలో తెలంగాణ కొత్త ఆశాజనకమైన మార్కెట్ను సూచిస్తుంది. స్థిరత్వం గురించి పెరుగుతున్న అవగాహన, ద్విచక్ర వాహన విభాగంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు స్పష్టమైన మార్పుతో, ఇక్కడ మా ప్రవేశం సకాలంలో మరియు వ్యూహాత్మకంగా ఉంది. ఈ విస్తరణ పర్యావరణ స్పృహ గల వినియోగదారుల నుండి మాత్రమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న మా డీలర్ నెట్‌వర్క్ నుండి కూడా బలమైన డిమాండ్ ద్వారా నడపబడుతుంది. మా అధిక-పనితీరు, మేక్-ఇన్-ఇండియా ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్ల ద్వారా, అమ్మకాల తర్వాత బలమైన మద్దతుతో, ఎలక్ట్రిక్ మొబిలిటీని రాష్ట్రవ్యాప్తంగా రైడర్లకు మరింత అందుబాటులో నమ్మదగినదిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని" అన్నారు.

ఎమ్మార్వో ద్వారా కుల ధృవీకరణ పత్రాలు అందజేయాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఎమ్మార్వో ద్వారా ఎలాంటి షరతులు లేకుండా కుల ధ్రువీకరణ సర్టిఫికెట్స్ అందజేయాలని తెలంగాణ రాష్ట్ర మాలజంగం మహేశ్వర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు పర్స శ్యామ్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆర్డీవో ద్వారా అందజేయడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి తాలూకా రాజేందర్‌తో కలసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు తమ కులానికి అందేలా చూడాలన్నారు. అలాగే తమ కుల దైవం వేములవాడ రాజన్న సన్నిధిలో భవన నిర్మాణానికి స్థలం ఇప్పించాలని కోరారు. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా తమ కులాలకు స్వాతంత్రం రాలేదన్నారు. ఏ ప్రభుత్వాలు నిమ్న జాతులను మనుషులుగా గుర్తించకుండా ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారని అన్నారు. తెలంగాణలో తమ కులం ఏ రంగంలోనూ అభివృద్ధి చెందలేదన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లుగా ఎవరి జనాభా ఎంత ఉన్నదో ఆ జనాభా ప్రాతిపదికన రాజకీయ, ఉద్యోగ ఫలాలు పంచాలన్నారు. అన్ని కులాల వారు ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు అవుతుంటే తమకు కుల ధ్రువీకరణ పత్రాలు లేవన్నారు. ఆర్డిఓ ద్వారా కాకుండా ఎమ్మార్వో ద్వారా కుల ధృవీకరణ పత్రాలు, మూడెకరాల వ్యవసాయ భూమి, కళా కారులకు పెన్షన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లతో పాటు బ్యాంకుల్లో ఏ పూచీకత్తు లేకుండా రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు నిమ్మ సదానందం, కొండ మచ్చేందర్, కార్యనిర్వహణ అధ్యక్షులు పీసరి సత్యానందం, వేముగంటి నాగభూషణం, ప్రచార కార్యదర్శి కోదాది భూమయ్య, కోశాధికారి ఏల్పుల నాగరాజు, సహాయ కార్యదర్శి గౌడి చిరంజీవి, సాంస్కృతిక కార్యదర్శి రామిల్ల గురుపాదం, వివాహ పరిచయ వేదిక కన్వీనర్ గౌడి యోగేశ్వర్ పాల్గొన్నారు.

మాదాపూర్, హైదరాబాద్‌లో అవిరా డైమండ్ విస్తరణ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : భారతదేశపు అత్యుత్తమ ల్యాబ్‌లో ఉత్పత్తి చేసిన డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ అయిన అవిరా డైమండ్స్, హైదరాబాద్‌లో తన మొదటి ఎక్స్‌క్లూజివ్ బుటిక్ స్టోర్‌ను దుర్గం చెరువు మెట్రో స్టేషన్ సమీపంలో, మాధాపూర్‌లో ప్రారంభించింది. చెన్నై, బెంగళూరు, పుదుచ్చేరి దుబాయ్‌లలో విజయవంతమైన తర్వాత ఇది సంస్థ ఎనిమిదవ స్టోర్. ఇప్పుడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మరిన్ని 10 స్టోర్లతో తన విస్తరణను కొనసాగించేందుకు అవిరా సిద్ధమైంది. అవిరా డైమండ్స్ 2021లో సురేష్ జైన్ ఆధ్వర్యంలో, పూజా గోల్డ్ ప్యాలెస్‌కు అనుబంధంగా స్థాపించబడింది. అత్యాధునిక ల్యాబ్‌ల్లో, నైతిక ప్రమాణాల ప్రకారం గనులను తవ్వకుండా పర్యావరణహితంగా, ల్యాబ్‌లలో ఉత్పత్తి చేయబడే ఈ వజ్రాలు అత్యున్నత నాణ్యతతో రూపుదిద్దుకుంటాయి. ల్యాబ్‌లో ఉత్పత్తి చేసే వజ్రాలు-భూమిలో తవ్వే వజ్రాలకు ప్రత్యామ్నాయంగా, ప్రకృతికి హానికరం కాకుండా ఉంటాయి. ఇవి అదే రసాయన, భౌతిక, ఆప్టికల్ లక్షణాలతో ఉంటాయి, కానీ దాదాపు 70శాతం తక్కువ ఖర్చుతో లభిస్తాయి. ప్రకృతి పట్ల బాధ్యతతో కూడిన డైమండ్ల భావన నన్ను గాఢంగా ఆకట్టుకుంది. దీని ద్వారా పరిశ్రమలో పెద్ద మార్పు తీసుకు రాగలమని తెలుసుకున్నాం. హైదరాబాద్‌లో మా తొలి స్టోర్‌తో, నగల వైభవానికి ప్రసిద్ధిగాంచిన ఈ నగరానికి అవిరా ప్రత్యేకతను అందించడంలో గర్వంగా ఉంది అని, సంస్థ వ్యవస్థాపకులు మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ జైన్ అన్నారు. స్టోర్ ఫ్రాంచైజీ భాగస్వాములు డాక్టర్ శిల్పా రెడ్డి కొల్లా, కొల్లా అరవింద్ రెడ్డి కూడా ఈ కార్యక్రమలో పాల్గొన్నారు.

డాబర్ రెడ్ పేస్ట్‌తో దంత సంరక్షణ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: నోటి ఆరోగ్య సమస్యలు, దంతక్షయం పిల్లలను, పెద్దలను ప్రభావితం చేస్తున్నాయని ఎండీఎస్, పీహెచ్డీ, పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా తెలిపారు. పేలవమైన నోటి పరిశుభ్రత అలవాట్లు, పునరుత్పాదక ఆహారాలు కార్బోనేటెడ్ పానీయాల వినియోగం ఈ పెరుగుతున్న సమస్యకు గణనీయంగా దోహదం చేస్తాయన్నారు. దంత సంరక్షణను నిర్లక్ష్యం చేయడం నొప్పి, అసౌకర్యం, దంతాల నష్టం, ఖరీదైన చికిత్సల అవసరానికి దారితీస్తుందన్నారు. కావిటీస్ ప్రాబల్యం సమర్థవంతమైన నివారణ వ్యూహాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. చికిత్స చేయని కుహరాలు పురోగమిస్తాయన్నారు. ఇది దంతాల గడ్డలు, ముఖ ఇన్ఫెక్షన్లు వంటి మరింత తీవ్రమైన సమస్యలకు దారితీస్తుందన్నారు. కావిటీస్, దంత క్షయాన్ని నివారించడం సరైన సంరక్షణతో ప్రారంభమవుతుందన్నారు. లవంగం, వేప, అల్లం వంటి ఆయుర్వేద పదార్థాలతో సమృద్ధిగా ఉన్న డాబర్ రెడ్ పేస్ట్ ఫలకం నిర్మాణం, బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా సహజ రక్షణను అందిస్తుంది. దంతాలపై ఏర్పడే బ్యాక్టీరియా అంటుకునే చిత్రం అయిన దంత ఫలకం వల్ల కుహరాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ బ్యాక్టీరియా చక్కెర, పిండి పదార్థాలపై వృద్ధి చెందుతుంది, ఎనామెల్‌ను నాశనం చేసే ఆమ్లాలను ఉత్పత్తి చేస్తుంది. తగినంత బ్రష్ చేయకపోవడం, ఫ్లోసింగ్ ఫలకం పేరుకుపోవడానికి అనుమతిస్తుంది, దంతాల క్షయాన్ని వేగవంతం చేస్తుందన్నారు. చక్కెర స్నాక్స్, ముఖ్యంగా, బ్యాక్టీరియాకు సులభంగా లభించే ఆహార వనరును అందిస్తాయి, కావిటీలకు దారితీసే ఆమ్ల ఉత్పత్తికి ఆజ్యం పోస్తాయన్నారు. కుహరం అభివృద్ధిలో చక్కెర వినియోగం ఫ్రీక్వెన్సీ ఒక కీలక అంశం. భోజనాల మధ్య తరచుగా అల్పాహారం, ముఖ్యంగా చక్కెర ఆహారాలపై, దంతాలను పదేపదే ఆమ్లానికి గురి చేస్తుంది, ఇది క్షీణించే ప్రమాదాన్ని పెంచుతుంది.

ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరిండంతో పాటు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ జేఏసీ అధ్యక్షులు పులి లక్ష్మయ్య, జేఏసీ నాయకులు రాజ్ మహమ్మద్‌లు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. ఈమేరకు శనివారం నాడు వారు అయను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీల వలన జరుగుతున్న నష్టాన్నీ, కొత్త ఉద్యోగాలు ఇచ్చేక్రమంలో, ఎటువంటి ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులని తీయకుండా ప్రభుత్వంమే అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అదేసమయంలో ఈ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు ఒక చట్టపద్ధతి తీసుకొచ్చి భవిష్యత్తు రోజుల్లో కూడా ఉద్యోగస్తులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరడం జరిగిందన్నారు. దీనికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తప్పకుండా తీసుకెళ్ళి అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ధన్యజీవి వనజీవి

విశాలాంధ్ర - అమనగల్లు : మన దేశం ఒక ప్రపంచ ప్రకృతి ప్రేమికుడి కోల్పోయిందని సీజర్ వ్యవస్థాపకులు లీల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం వనజీవి మృతి పట్ల సిజిఆర్ బృందం సంతాపం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణే ప్రాణంగా బతికిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల లీల లక్ష్మారెడ్డి విచారం వ్యక్తం చేశారు. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని తన శరీరంలో భాగం చేసుకుని, కోటికి పైగా మొక్కలను నాటి, ప్రపంచానికి పచ్చదనం ప్రాముఖ్య తను ప్రచారం చేసిన వనజీవి రామయ్య లక్ష్యం మహోన్నతమైనదన్నారు. మొక్కల పెంపకం కోసం వనజీవిగా మారిన దర్పల్లి రామయ్య జీవితం రేపటి తరాలకు ఆదర్శనీయమని కొనియాడారు. సిజిఆర్ వేలమంది వనజీవి రామాయలను తయారు చేస్తుందని లీల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల ఎర్త్ సెంటర్ అన్మాస్పల్లిలో పర్యావరణవేత్త తులసి రావు, త్రిపుర ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రసాద్ రావు, ఎర్త్ లీడర్ జ్ఞానేశ్వర్ మొక్క నాటి శ్రద్ధాంజలి ఘటించారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం, యూసఫ్ గూడా డివిజన్, వెంకటగిరిలో అతి పురాణతమైన దేవాలయం శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు, హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం, వేకువ జామున నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు మొదలైతో మొదట స్వామి వారికి ప్రత్యేక అభిషేక, మధ్యాహ్నం మహా అన్నదాన ప్రసాద కార్యక్రమంతో పాటుగా సాయంత్రం వెంకటగిరి పూరవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక పూజా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాతో సన్మానించారు. అన్ని పూజాది కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి శోభాయాత్రలో పాల్గొన్న ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం సీనియర్ టిఆర్ఎస్ నాయకులు నాగేష్ ముదిరాజ్. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు జిల్లా బిక్షపతి రాజేష్ ముదిరాజ్ దినేష్ నాగసాయి మొదలైన వారు పాల్గొన్నారు.

బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి : ఆళ్ల

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ 42 శాతం బీసీ బిల్లును రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చాలని, దేశవ్యాప్త జనగణనలో కులగణనను వెంటనే జరపాలని ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న సిద్దేశ్వర పటేల్ ఆరోగ్యం చాలా ప్రమాదకర దశలో ఉన్నదనీ క్రమక్రమంగా క్షీణిస్తున్నదనీ వెంటనే తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పంపించిన బీసీ బిల్లులను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆమోదింపచేస్తామనే హామీని సిద్దేశ్వర పటేల్‌కు ఇవ్వాలని జాతీయ ఓపిసి మేధావుల పోరం అధ్యక్షులు, విశ్రాంత చీఫ్ ఇంజినీర్ ఆళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరా లుగా నిరవధికంగా వాయిదా పడుతున్న జనగణనను కులగణనతో కలిపి వెంటనే చేపట్టాలన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు వెంటనే తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ప్రజాస్వామ్య వాదులు మేధావులు వెంటనే స్పందించి సిద్దేశ్వర పటేల్ ప్రాణహాని నుండి కాపాడాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బషీర్ బాగ్ చౌరస్తా బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్‌లోనీ సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున గిరిజన శక్తి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రక్షణకై భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహన్ తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేద అణగారిన, గిరిజన దళిత బహుజన వర్గాలకు అన్యాయం చేస్తూ భవిష్యత్తులో వారికీ రిజర్వేషన్లను లేకుండా చేయాలని కుట్ర చేస్తుందని అలాగే గిరిజనుల భాషలను గుర్తించకుండా అవమానిస్తుందని ఎన్నో ఏళ్ల నుంచి బంజారా భాష "గోర్ భోలి"ని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ఈ దేశంలో ఉండే సబ్బండ వర్గాల ప్రజలకు ఉంది అని కోరారు. ఈ రాజ్యాంగ రక్షణ ర్యాలీ కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరు గౌరవప్రదమైన సూటు కోటు వేసుకొని, రాజ్యాంగాన్ని చేత పట్టుకొని రావాలని కోరారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి సుమారు 12 ఏళ్ల అయినా పేదవారి అకౌంట్లో నల్లధనం తీసుకొచ్చి వేస్తానని చెప్పి బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని అలాగే ప్రైవేట్ సెక్టార్లో రిజర్వేషన్ ఇవ్వకుండా కుట్ర చేస్తుందని, నేడూ మోడీ అంబానీ, అదానీలకు వత్తాసు పలుకుతూ దేశాన్ని మొత్తం ప్రైవేట్ సెక్టార్ చేస్తున్నారని తెలియజేశారు. గిరిజన హక్కుల కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం కూడా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలుపడం జరిగింది. గిరిజన శక్తి నాయకులు శ్రీమన్ నాయక్, మహేష్ నాయక్, ఈ ర్యాలీకి మద్దతుగా. బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, ముస్లిం జేఏసీ రాష్ట్ర నాయకులు ఖదీర్, సలీమ్, ఎరుకల జేఏసీ రాజేష్, మాదిగ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు గణేష్, తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐతరాజు అభేందర్ దళిత్ యూత్ ఫోర్స్ అధ్యక్షులు కొండ్రపల్లి రమేష్, బి.సి. నాయకులు వేమూలూరి చారి. తరుణ్, నిఖిల్, భరత్, ఉమేష్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో

రెండంచెల విధానమే మేలు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఉద్ఘాటన
- రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలన్న రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ సహకార రుణ వ్యవస్థలో రెండంచెల విధానం వల్ల ఉద్యోగులకు, రైతాంగానికి మేలు జరగడంతో పాటు రాజకీయ జోక్యం తగ్గుముఖం పడుతుందని, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సహా వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నేతలు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో రెండంచెల విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన శనివారం విజయవాడ ఐలాపురం హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తొలుత ఇందుకు సంబంధించిన తీర్మానాన్ని ఎంప్లాయిస్ యూనియన్ నేత కేవీఎస్ రవికుమార్ ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన రామకృష్ణ మాట్లాడుతూ సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో రెండంచెల విధానం అమలు చేస్తే రైతాంగానికి ఒకటి, రెండు శాతం వడ్డీ తగ్గినా... దానివల్ల చాలా మేలు జరుగుతుందన్నారు. సహకార సంఘాలలో రాజకీయ జోక్యం అధికంగా ఉందన్నారు. దీని కారణంగా అవినీతికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కొన్నిచోట్ల వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఉద్యోగులు అంత భారీ మొత్తంలో అవినీతి చేయలేరని, సహకార సంఘాల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటే అది నూరు శాతం పాలకవర్గాల ప్రమేయంతోనేనన్నారు. రెండంచెల విధానంతో సహకార బ్యాంకులపై వస్తున్న అవినీతి ఆరోపణల వార్తలు తగ్గుతాయన్నారు. సహకార బ్యాంకులు అప్రతిష్ట పాలవ్వడం వల్ల ఎక్కువ మంది జాతీయ బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడానికి మొగ్గు చూపుతారన్నారు. 2001లోనే రెండంచెల విధానానికి చంద్రబాబు మద్దతు పలికారని, ఆ తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా మద్దతిచ్చినట్లు యూనియన్ నాయకులు చెబుతున్నారని, అయినా దీనిపై వారు ఎందుకు ముందుకెళ్లలేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంప్లాయిస్ అసోసియేషన్ వజ్రోత్సవాల సందర్భంగా మంచి అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇది కేవలం ఉద్యోగులకు పరిమితమైన అంశం కాదని, రైతాంగానికి మేలు జరిగే అంశం కావడంతో రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎంప్లాయిస్ యూనియన్‌తో పాటు రైతు సంఘాలు ఈ అంశాన్ని ముందుకు తీసుకువస్తే రాజకీయ పార్టీలుగా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. త్వరలో అన్ని పార్టీల నాయకులతో కలిసి ఈ అంశంపై సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తెలియజేద్దామన్నారు.

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ సహకార రంగంలో అవినీతి జరిగితే... ఆ డబ్బులు పెద్ద నాయకుల ఖాతాల్లో ఉంటున్నాయని ఆరోపించారు. అలాంటి నాయకుల అధీనంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు ఉంటే వ్యవస్థ కూలిపోకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార పార్టీలో రాజకీయ నిరుద్యోగులకు వాటిలో పదవులు ఇస్తుంటారని చెప్పారు. ఎంప్లాయిస్ యూనియన్ అధ్వర్యంలో చేస్తున్న ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ మరోసారి దీనిపై సదస్సు ఏర్పాటు చేయాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ఉపయోగించుకుంటున్న ఒక దొంతరను తీసివేయడానికి తప్పనిసరిగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు కోట్ల రూపాయలు బ్యాంకులకు ఎగ్గొడితే మాట్లాడని అధికారులు... కౌలు రైతులకు తనఖా లేకుండా రుణాలు ఇచ్చే విషయంలో నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నార న్నారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం కౌలు రైతుకు న్యాయబద్ధంగా అందాల్సిన రుణాలను పంట తనఖాతో ఇవ్వాలన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కృష్ణయ్య మాట్లాడుతూ ఎంప్లాయిస్ అసోసియేషన్ వజ్రోత్సవం తర్వాత ఈ వ్యవస్థ ఉండదేమో అన్న భయం ఉందని, కావున దీన్ని ఒక దీక్షగా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అజెండాలో తీసుకున్న ఐదు అంశాల ప్రణాళికపై సీపీఎంగా అన్ని జిల్లాల్లో పాల్గొని మద్దతు ఇస్తామని తెలిపారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉండబోయే నూతన సహకార చట్టాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీమంత్రి, టీడీపీ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ అన్నింటికీ మించినదని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సహకార వ్యవస్థ విస్తృత ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేందుకు రాధాకృష్ణ అధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ ఈ తీర్మానాన్ని ఆమోదించడమే కాకుండా అమలు కోసం జరిగే పోరాటంలో భుజం భుజం కలిపి ముందుకు నడుస్తామని హామీ ఇచ్చారు. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని తీర్మానంలో ప్రవేశపెట్టాలని కోరారు. కేరళలో రెండంచెల విధానం అమలవుతున్నందున అక్కడ అధ్యయనం చేసి ఫలాలు ఎలా ఉన్నాయో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. అఖిల భారత కిసాన్ సభ మహాసభలు తమిళనాడులోని నాగపట్నంలో 15,16,17 తేదీల్లో జరుగుతున్నాయని, ఆ మహాసభలో సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో రెండంచెల విధానం అమలు చేయాలన్న తీర్మానాన్ని ఆమోదింపజేస్తామన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు ఇతర రంగాలవైపు వెళుతున్నారన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం చేసే వారే కనుమరుగయ్యే పరిస్థితులు కనబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కుటుంబంలోని మగ పిల్లలకు 30 ఏళ్లు దాటినా పెళ్లి కావడం లేదన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నేత మర్నీడి యలమందరావు మాట్లాడుతూ రైతాంగానికి తోడ్పాటు అందించాల్సిన సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ రాష్ట్ర నాయకుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ హయాంలోనే సహకార వ్యవస్థ బలోపేతమైందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, నాయకులు వై.కేశవరావు, సింహాద్రి ఝాన్సీ, అక్కినేని భవానీ ప్రసాద్, నారాయణరెడ్డి, చక్రవర్తి తదితరులు ప్రసంగించారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సభలు, సమావేశాలు, ఐదు లక్షల సంతకాల సేకరణ, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నుంచి లేఖలు, ఒక రోజు విజయవాడలో మహాధర్నా నిర్వహించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. తొలుత సహకార వ్యవస్థలో మూడంచెల విధానం వల్ల జరుగుతున్న నష్టాన్ని, ఇంతకుముందు నిర్వహించిన ఆందోళనలను ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు వివరించారు.

తహవ్వుర్ రాణా కేసు విచారణకు

నెలలు కాదు ఏళ్లు పట్టొచ్చు

ఏడాదికి ముందు ఎఫ్ఐఆర్ దాఖలు కష్టమే!

న్యూదిల్లీ: ముంబై పేలుళ్ల సూత్రధారి తహవ్వుర్ రాణా కేసు విచారణకు రావాలంటే ఎంత కాదన్నా 5-10ఏళ్లు పట్టవచ్చని అతనితో న్యాయవాదులు తెలిపారు. తనది సంక్లిష్టమైన కేసు అని, చార్జిషీటు దాఖలు కావాలన్నా కనీసం ఏడాది పడుతుందని వారు అతనితో చెప్పారు. అమెరికా రాజ్యాంగం లోని ఐదవ సవరణ ప్రకారం ఫిర్యాదు చేసేందుకు ఉన్న అవకాశాలపై రాణా ఆరా తీసినప్పుడు న్యాయవాదులు పై విధంగా సమాధానం ఇచ్చారని సమాచారం. అయితే తన కేసు విచారణ ఏడాది లోపు పూర్తి ముగుస్తుందా అన్నప్పుడు న్యాయవాదుల నుంచి సమాధానం రాకపోవడంతో రాణా తెల్లమొహం వేసినట్లు తెలుస్తోంది. రాణా ప్రస్తుతం ఎన్ఐఏ కస్టడీలో ఉన్నాడు. ఎన్ఐఏ కోర్టులో అతని తరపున న్యాయవాదులు లక్ష్యధీర్, పీయూష్ సచ్‌దేవ వాదించారు. అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు విముక్తి కల్పించడానికి ముందు పదేళ్లు జైలుశిక్ష అనుభవించినందున తనను అప్పగించాల్సిన అవసరం లేదని, నిర్దోషినని అని రాణా చెప్పుకున్నాడు. కాగా 18 రోజులు ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి చందర్జీత్ సింగ్ ఉత్తర్వులు జారీచేయడం విదితమే.

ఏఐకేఎస్ ప్రచార జాత విజయవంతం చేయండి: పశ్య పద్మ

విశాలాంధ్ర-హైదరాబాద్: తమిళనాడులోని నాగపట్నంలో ఈ నెల 15, 16 ,17 తేదీలలో జరుగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 30వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ శనివారం ఓ ప్రకటలో పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ 29వ జాతీయ మహాసభలు హైదరాబాదులో జరిగాయని, నాగపట్నంలో 30 వ మహాసభలు నిర్వహిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఏఐకేఎస్ జెండాను అక్కడ జాతీయ నాయకత్వానికి అందజేస్తామన్నారు. మహాసభల విజయవంతానికి తెలంగాణలో జాత నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బ్రిటిష్ వలస వాదులకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్రోద్యమ సమయంలో 1936 ఏప్రిల్ 11న అఖిల భారత కిసాన్ సభ స్థాపించబడిందన్నారు. ఈ నెల 11వ తేదీన 89 వ స్థాపన దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించినట్టు చెప్పారు. దేశ స్వాతంత్యసాధనకు, భూమికోసం, భుక్తి కోసం, జీవనోపాధి కోసం మహత్తర రైతాంగ సాయుధ పోరాటాలను నిర్వహించిన రైతులకు ఏఐకేఎస్ నాయకత్వం వహించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం, పశ్చిమబెంగాల్‌లో తెభాగ రైతాంగ తిరుగుబాటు, కేరళలో పున్నప్ర రైతాంగ పోరాటం, మలబారు రైతాంగ పోరాటాలలో ఏఐకేఎస్ ప్రముఖపాత్ర నిర్వహించిందని వివరించారు. పంటలకు మద్దతు ధరలు, గ్యారెంటీ చట్టం, రుణమాఫీ చట్టం, సాగుకు పెట్టుబడి సాయం రూ.ఆరు వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదా ఉపసంహరించుకోవాలని, పంటల బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా సవరించి అమలు చేయాలన్న తదితర ప్రధానమైన డిమాండ్ల పై ఏఐకేఎస్ పోరాడుతుందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చాలో ప్రధాన భాగస్వామిగా కొనసాగుతూ ఐక్య ఉద్యమాలలో ప్రధానమైన భూమికను నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం... ఏఐకేఎస్‌కు అనుబంధ సంస్థ అన్నారు. జాతీయస్థాయి పిలుపులో భాగంగా రాష్ట్రంలో రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలని, సాగు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని పాలకులపై ఒత్తిడి తెస్తూ ఉద్యమాలను కొనసాగిస్తున్నట్టు చెప్పారు.

సీపీఐ సీనియర్ నేత రవణమ్మ మృతి

నారాయణ, రామకృష్ణ నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత కమ్యూనిస్టుపార్టీ సీనియర్ నేత రావులపల్లి రవణమ్మ (92) శనివారం సాయంత్రం మృతి చెందారు. గుంటూరు జిల్లా ముప్పాళ్ల గ్రామంలో ఉన్నత కుటుంబంలో జన్మించిన రవణమ్మ... వివాహ అనంతరం ప్రకాశం జిల్లా మార్కాపురంలో స్థిరపడ్డారు. భర్త రావులపల్లి చెంచయ్య మొదటినుంచి కమ్యూనిస్టుపార్టీ ఉద్యమంలో కీలకంగా పనిచేసి... యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటినుంచి భర్తకు తోడుగా ఉంటూ కమ్యూనిస్టుపార్టీ, అనుబంధ సంఘాల ఉద్యమాల్లో రవణమ్మ కీలకంగా పనిచేశారు. ముఖ్యంగా సారా నిషేధ ఉద్యమంలో, అక్షరాస్యతా ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. పార్టీ అగ్రనాయకులు చండ్ర రాజేశ్వరరావు, నీలం రాజశేఖర్ రెడ్డి, గుజ్జుల యలమందారెడ్డి, సరళాదేవి వంటి అగ్రనేతలంతా ఆమె చేతి వంట తిన్నవారే. పార్టీ నిషేధ సమయంలో ఆమె అందించిన సేవలు, చేసిన త్యాగాలు నిరుపమానం. విజయవాడ మధురానగర్‌లోని ఆమె కుమార్తె అరుణ ఇంట్లో ఉంటున్నారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు. అందరూ కమ్యూనిస్టుపార్టీ ఉద్యమంలో కీలకంగా పనిచేసేవారు కావడం గమనార్హం. వారందరికీ పార్టీ వివాహాలే జరిపించారు. పెద్దకుమారుడు ఆర్.బాబురావు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో మేనేజర్‌గా పనిచేసి రిటైర్ కాగా, రెండవ కుమారుడు రావులపల్లి రవీంద్రనాథ్ ప్రస్తుతం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జర్నలిస్టుగా పనిచేసిన మూడో కుమారుడు కృష్ణారావు ఇటీవల మృతి చెందగా... నాల్గవ కుమారుడు రమేశ్ గతంలో పీఎంవోలో పనిచేసి, ప్రస్తుతం పీఐబీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రముఖుల నివాళి

రవణమ్మ మృతి వార్త తెలిసిన వెంటనే సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, మహిళా సమాఖ్య నేత దుర్గాంబ, ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, ఇస్కాఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్సర్ తదితరులు వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత

రవణమ్మ కోరిక మేరకు కుటుంబసభ్యులు ఆమె భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరీక్ష నిమిత్తం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు అప్పగించాలని నిర్ణయించారు. రవణమ్మ నేత్రాలను కూడా కరుణ ఐ క్యూర్‌కు అప్పగించారు.

వైసీపీలో నియామకాలు

33 మందితో అడ్వైజరీ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీలో నియామకాలను అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి చేపట్టారు. అమలాపురం పార్లమెంట్ నియోజక వర్గ సమన్వయకర్తగా పినిపె విశ్వరూప్, కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా చీర్ల జగ్గిరెడ్డి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ పినిపె శ్రీకాంత్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ అసిఫ్, క్రమశిక్షణా కమిటీ సభ్యుడిగా తోపుదురి ప్రకాశ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటన చేసింది. 33 మందితో పొలిటికల్ అడ్వైజరీ కమిటీ (పీఏసీ)ని పునర్వ్యవస్థీకరించారు. పీఏసీ శాశ్వత ఆహ్వానితులుగా పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త, పీఏసీ కన్వీనర్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. పీఏసీ సభ్యుల్లో తమ్మినేని సీతారాం, పీడిక రాజన్నదొర, బెల్లాన చంద్రశేఖర్, గొల్ల బాబూరావు (ఎంపీ), బూడి ముత్యాల నాయుడు, పిల్లి సుభాశ్ చంద్రబోస్ (ఎంపీ), పినిపె విశ్వరూప్, తోట త్రిమూర్తులు (ఎంఎల్‌సీ), ముద్రగడ పద్మనాభం, పుష్పాల శ్రీనివాసరావు (వాసుబాబు), చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), వెల్లంపల్లి శ్రీనివాస్, జోగి రమేశ్, కోన రఘుపతి, విడదల రజిని, బొల్లా బ్రహ్మానాయుడు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి (ఎంపీ), నందిగం సురేశ్, ఆదిమూలపు సురేశ్, పోలబోయిన అనిల్ కుమార్ యాదవ్, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, కె నారాయణ స్వామి, ఆర్కె రోజా, వైఎస్ అవినాశ్ రెడ్డి (ఎంపీ), షేక్ అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అబ్దుల్ హఫీజ్ ఖాన్, మాలగుండ్ల శంకరనారాయణ, తలారి రంగయ్య, వై విశ్వేశ్వర రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్, సాకె శైలజానాథ్ ఉన్నారు.

అరెస్టుకు కారణం చెప్పకపోతే బెయిల్ ఇవ్వొచ్చు: అలహాబాద్ హైకోర్టు



లక్నో: కారణం చెప్పకుండా అరెస్టు చేస్తేగనుక బెయిల్ ఇవ్వొచ్చని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టు చేసేటప్పుడు కారణాలు తెలియజేయడం తప్పనిసరి అని వెల్లడించింది. అలా జరగని పక్షంలో చట్టపరంగా పరిమితులు ఉంటాయని, బెయిల్ వస్తుందని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మంజీత్ సింగ్‌పై 2024 ఫిబ్రవరి 15న మోసం, బెదిరింపు, శాంతికి భంగం కలిగించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదైంది. అతడిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేశారు. 2024 డిసెంబర్ 26న జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. ఇందుకు రాంపూర్ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో మంజీత్ సింగ్ హైకోర్టును ఆశ్రయించారు. చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేశారని, రిమాండ్ విచారణలో విధానపరమైన లోపాలు ఉన్నాయని సింగ్ తరపున న్యాయవాది వాదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం అరెస్టుకు కారణాలను అరెస్ట్ సమయంలో లిఖితపూర్వకంగా తెలియజేయలేదన్నారు. ఈ వాదనను హైకోర్టు సమర్థించింది. 'ఆర్టికల్ 22(1)ను ఉల్లంఘించినప్పుడు, నిందితులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించడం న్యాయస్థానం విధి. చట్టబద్ధమైన ఆంక్షలు ఉన్నప్పటికీ బెయిల్ మంజూరీకి అది కారణం అవుతుంది' అని న్యాయమూర్తులు మహేశ్ చంద్ర త్రిపాఠి, ప్రశాంత్ కుమార్‌తో కూడిన డివిజన్ బెంచ్ పేర్కొంది. అరెస్టైన వ్యక్తికి అర్థమయ్యే భాషలో అరెస్టుకు గల కారణాలను తప్పనిసరిగా తెలియజేయాలని స్పష్టం చేసింది. రాంపూర్ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఆర్డర్‌ను, మంజీత్ సింగ్ అరెస్టును రద్దు చేసింది.

ఎస్పీ నేతపై 'కర్ణిసేన' కత్తిదాడి

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నేత హరీష్ మిశ్రాపై కర్ణి సేన మద్దతుదారులు కత్తితో దాడి చేశారు. దీంతో ఆయన అనుచరులు వారిని పట్టుకుని కొట్టారు. ఆ తర్వాత పోలీసులకు అప్పగించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. ఉత్తరప్రదేశ్, వారణాసిలో ఈ ఘటన జరిగింది. కర్ణిసేనపై వ్యాఖ్యలకుగాను మిశ్రాను కత్తితో పొడిచేసేందుకు ఇద్దరు యత్నించారు. అయితే మిశ్రా అనుచరులు వారిని పట్టుకున్నారు. ఆ ఇద్దరిని పోలీసులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆపై రెండు వర్గాల ఫిర్యాదుల ఆధారంగా ఫిర్యాదు చేపట్టారు.

సిట్టింగ్ జడ్జితో పీఆర్‌సీ

సూర్యనారాయణ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను వేధించిందని ఏపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు అందాల్సి ఉందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6,200 కోట్లు చెల్లించిందని చెప్పారు. ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

'విశ్రాంత ఐఏఎస్‌తో కూడిన పీఆర్‌సీ వద్దు. సిట్టింగ్ జడ్జి లేదా ముగ్గురు సభ్యులతో పీఆర్‌సీ సంఘం వేయాలి. పీఆర్‌సీ ఇచ్చేంత వరకు ఐఆర్ ప్రకటించాలి. కనీసం ఒక్క డీఏ అయినా ప్రకటించాలి. సీపీఎస్ అంశంపై ఓ స్పష్టత ఇవ్వాలి' అని గవర్నర్‌ను కోరారు.

వీఐటీ-ఏపీలో ముగిసిన హ్యాకథాన్ సెమీ ఫైనల్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ సైబర్ భద్రతా పరిశోధన మండలి అధ్వర్యంలో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో జరిగిన హ్యాకథాన్ ఎక్స్ సెమీ ఫైనల్స్ శనివారం ముగిసింది. సెమీ ఫైనల్స్‌లో తెలుగు రాష్ట్రాల జట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొదటి మూడు స్థానాలలో నిలిచిన జట్లకు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. సైబర్ భద్రత ఇకపై ఒక ప్రత్యేక అంశం కాదు. ఇది జాతీయ ప్రాధాన్యతని ఆయనన్నారు. గౌరవ అతిథి, ఎన్‌సీఎస్ ఏసీఐ డైరెక్టర్ డాక్టర్ ఖలీరాజ్ నాయుడు మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన సైబర్ భద్రతా నిపుణుల అవసరం పెరుగుతోందన్నారు. వీఐటీ-ఏపీ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటా రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, అభివృద్ధి చెందుతున్న రంగాలలో యువత చొరవ చూపాలని, ఇందుకు తమ విశ్వ విద్యాలయం నిబద్ధతను పనిచేస్తున్నదని చెప్పారు. హ్యాకథాన్ ఎక్స్ వంటి కార్యక్రమాలు దేశానికి సురక్షిత డిజిటల్ భవిష్యత్తు అందించడానికి దోహదమవుతాయని అన్నారు. కార్యక్రమంలో డీన్ సుధాకర్ ఎలాంగో, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ హుస్సేన్, అసోసియేట్ డీన్ స్టాఫ్ సరోజ్ కుమార్ పాణిగ్రాహి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉత్తమ జర్నలిస్ట్' కాగిత ప్రశాంత్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: విశాలాంధ్ర దినపత్రిక, బాపట్ల జిల్లా బ్యూరో కాగిత ప్రశాంత్ రాజు ఉత్తమ జర్నలిస్టుగా అవార్డు అందుకున్నారు. విశ్లేషణాత్మక జర్నలిజం విభాగంలో ఆయనను ఈ పురస్కారం వరించింది. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన తెలుగు జర్నలిస్టుల ఉగాది పురస్కారాల్లో భాగంగా ప్రశాంత్ రాజుకు అవార్డును మాజీ సీజేఐ ఎన్‌వీ రమణ ప్రదానం చేశారు. మెమొంటో, ప్రశంసా పత్రం, నగదు పురస్కారం అందజేశారు. ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో తెలుగు రాష్ట్రాల నుంచి 100 మంది ఉత్తమ జర్నలిస్టులుగా ఎంపికయ్యారు. ఈ అవార్డు అందుకున్న కాగిత ప్రశాంత్ రాజుకు అభినందనలు వెల్లువెత్తాయి. అయితే పురస్కారాన్ని ప్రదానం చేసే క్రమంలో ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సినీ నిర్మాత ఉపకార్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు, తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు, అబ్‌స్టా దర్బార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిజాం బాబా పాల్గొన్నారు.

జగన్, సాక్షిపై పీసీఐకి ఫిర్యాదు చేస్తాం: కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సాక్షి వార్తా సంస్థ, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు రాతలతో ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్న వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, సాక్షిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ)కు ఫిర్యాదు చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందేందుకు జగన్, ఆయన అనుచరులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీ ప్రతిష్టను దిగజార్చి సస్పెండ్ అయిన అధికారి కోసం గోశాలలో ఆవులు మృతి అంటూ కొత్త నాటకానికి తెరలేపి ఆ పార్టీ నేత కరుణాకర్ రెడ్డి అసత్యాలు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాస్తికుడైన కరుణాకర్ రెడ్డి మాటల్లో నిజం లేదని ప్రజలు గమనించాలన్నారు. లక్షలాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. వైసీపీ మూకలు టీటీడీని అల్లరి చేసేందుకు కుట్ర చేస్తున్నాయని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఓ పాస్టర్ యాక్సిడెంట్‌లో చనిపోతే, మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని పన్నాగం పన్నారన్నారు. పోలీసులు, ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని పాస్టర్ కుటుంబం చెప్పిన తర్వాత నోరుమూశారన్నారు. ముస్లింలను రెచ్చగొట్టాలని చూశారు... పార్లమెంట్‌లో అనుకూల ఓటు వేసి బయట తప్పుడు ప్రచారం చేశారన్నారు. కుటుంబ తగాదాలతో వ్యక్తి చనిపోతే అక్కడికి వెళ్లి జగన్ రాజకీయం చేయాలని చూశారని ఆరోపించారు. దుష్ప్రచారాలతో రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని రవీంద్ర మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కులాలు, ప్రాంతాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే వైసీపీ పన్నాగాలను ప్రజలు పసిగట్టాలని మంత్రి కోరారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.